
PDF Compressor Free Version

Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 18.10.2013, శుక్రవారం సంపుటి : 33 సంచిక : 20 పేజీలు : 12+8, వెల : ₹ 4




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com

◀ విభజనకు రాజ్యాంగ బ్రేకులు ▶

## ఆగిందా కాంగ్రెస్ గోవిందా

తలాతోక లేకుండా, కనీస పరిజ్ఞానం లేకుండా, విచక్షణాజ్ఞానం కోల్పోయి కాంగ్రెస్ అధిష్ఠానం తెలంగాణ నిర్ణయం తీసుకుంది. విభజన ఒకరోజులోనో, ఒక నెలలోనో ముగిసే ప్రక్రియ కాదు. సుదీర్ఘ చర్చలు, వివాదాల పరిష్కారాలు, సభల్లో తీర్మానాలు... ఇలా ఎన్నో ముడిపడి వున్నాయి.

తెలంగాణ ఏర్పాటుపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధే వుంటే కనీసం ఈ ప్రక్రియను రెండేళ్ల క్రితమైనా మొదలుపెట్టి ఉండాలి. హర్యానా, పంజాబ్ రాష్ట్రాలను చీల్చినంత సులభంగా, ఉత్తరాఖండ్, జార్ఖండ్, ఛత్తీష్‌గఢ్‌లను ఏర్పాటు చేసినంత శాంతియుతంగా తెలంగాణను ఏర్పాటు చేయలేరన్నది నగ్నసత్యం. పై రాష్ట్రాల ఏర్పాటులో ఎక్కడా రాజధాని సమస్య తలెత్తలేదు. హర్యానా, పంజాబ్‌లు ఉమ్మడి రాజధానిని ఏర్పాటు చేసుకోగా, ఉత్తరాఖండ్, జార్ఖండ్, ఛత్తీష్‌గఢ్‌లు కొత్త రాజధానులను ఏర్పాటు చేసుకున్నాయి.

ఆంధ్రప్రదేశ్ విభజనలో కొత్తగా ఏర్పడుతున్న రాష్ట్రానికి సంపూర్ణంగా అభివృద్ధి చెందిన రాజధాని నగరాన్ని అప్పగించడమే సమస్యకు మూలకేంద్రం అవుతుంది. ఈ సమస్య చిన్నది కాదు. 13జిల్లాలలో 5కోట్లమంది ప్రజలను విభజనకు ఒప్పించడం సాధ్యమయ్యే పని కాదు. కాని 2014 రాజకీయ ప్రయోజనాలను ఆశించి కాంగ్రెస్ విభజనపై తొందరపడింది. విభజనతో తలెత్తే సమస్యలకు ఎటువంటి పరిష్కారం చూపకుండానే విభజన ప్రకటన చేసేసింది.

అయితే ప్రకటన తర్వాత తలెత్తిన సమస్యలతో కాంగ్రెస్ అధిష్ఠానం ఉక్కిరిబిక్కిరవుతోంది. లోక్‌సభ ఎన్నికలలోపు విభజన తంతును ముగించగలిగితేనే కాంగ్రెస్ ఆశించిన ఫలితాన్ని రాబట్టే అవకాశముంటుంది. అలాకాకుండా ఎన్నికలలోపు విభజన జరగలేదా...? కాంగ్రెస్ శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది. విభజన జరగకుండా ఇదే పరిస్థితుల్లో ఎన్నికలు జరిగితే రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ఒక్కసీటూ రాదు. ఇటు సీమాంధ్రలో తుడిచిపెట్టుకుపోతుంది. అటు తెలంగాణలో మట్టికొట్టుకుపోతుంది. (మిగతా 10వ పేజీలో)

● రాష్ట్ర కాంగ్రెస్ ఖాళీ

## నేతలు తలోదారి

రాష్ట్ర విభజన విషయంలో కాంగ్రెస్ వెనక్కి తగ్గే పరిస్థితులు ఎంతమాత్రం లేవు. తెలంగాణపై కేంద్రం మరింత దూకుడు పెంచడంతో సీమాంధ్ర కాంగ్రెస్ నాయకులు ఆత్మరక్షణలో పడుతున్నారు. భవిష్యత్‌పై ఆలోచనలు చేస్తున్నారు. కాంగ్రెస్‌లోనే కొనసాగాలా ఇంకో పార్టీని చూసుకోవాలా అని ఆలోచిస్తున్నారు.

సీమాంధ్రలో పార్టీలు మారాలనుకునే కాంగ్రెస్ నాయకులకు రెండే ఆప్షన్స్ వున్నాయి. వెళితే వైయస్సార్ కాంగ్రెస్‌లోకన్నా వెళ్లాలి. లేదంటే చంద్రబాబు చెంతకన్నా పోవాలి. కాంగ్రెస్‌లో సీనియర్ నాయకులు చాలామంది వున్నారు. రాజకీయంగా ముదుర్లు. వీళ్లు జగన్ క్రింద పనిచేయలేరు. అలాగని నిన్నటి దాకా విమర్శించిన చంద్రబాబుతో సర్దుకుని పోలేరు. వైకాపాలో ఆల్‌రెడీ అన్ని సీట్లకు కర్చీఫ్‌లు వేసిపెట్టుకుని వున్నారు. కొత్తగా పోయేవాళ్లకు సీట్లు కష్టమే. అలాంటప్పుడు వీళ్లు పోయినా లాభమేముంది. అయితే కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన కొందరు ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు జగన్‌ను కలుస్తుండడం, వైకాపాలో చేరుతుండడం చూస్తూనేవున్నాం. కాంగ్రెస్‌లో వుంటున్న ఒక సామాజిక వర్గం నాయకులు మాత్రం తెలుగుదేశంవైపు చూస్తున్నారు. అక్కడ 'అభ్యర్థులు కావలెను' అనే బోర్డు వేలాడదీసి వున్నారు కాబట్టి కొత్తగా చేరేవారికి సమస్యలేదు. కాని అటు వైకాపా, ఇటు తేదేపాలోకి పోలేనివాళ్లు కాంగ్రెస్‌లో వుండకతప్పదు. సీమాంధ్రలో కాంగ్రెస్ (మిగతా 10వ పేజీలో)

ఢిల్లీకి దగ్గర కావడానికే ●

## బాబు సిల్లీదీక్ష

స్వామికార్యం... స్వకార్యం. ఢిల్లీదీక్ష ద్వారా చంద్రబాబు ఈ రెండింటినీ నెరవేర్చుకున్నాడు. సీమాంధ్ర రక్షణకంటే కూడా ఆయన రాజకీయ రక్షణకే ఢిల్లీ దీక్ష బాగా ఉపయోగపడింది. ఈ దీక్ష ద్వారా ఆయన జాతీయ, అంతర్జాతీయ మీడియాను బాగానే వాడుకోగలిగాడు.

యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలోనూ, ఆ తర్వాత ఎన్డీఏలోనూ చంద్రబాబు చక్రం బాగానే తిప్పాడు. జాతీయ రాజకీయాల్లో తనదైన ముద్రను వేసుకున్నాడు. 2004 నుండే ఆయన జాతకం తిరగబడింది. ఆయన చక్రం తిరగడం మానుకుంది. 2004, 2009 రెండు ఎన్నికల్లోనూ తెలుగుదేశంకు సీట్లేమీ లేకపోవడంతో మిగతాపార్టీల వాళ్లు చంద్రబాబును పట్టించుకోవడం మానేసారు. వామపక్షాలు, ఇతర లౌకికశక్తులు కూడా చంద్రబాబును దరిచేరనీయలేదు.

అయితే రాష్ట్ర విభజన అంశాన్ని వేదికగా చేసుకుని చంద్రబాబు మళ్ళీ ఢిల్లీలో వాలాడు. జాతీయరాజకీయాల్లో తన పాత్రను చాటే ప్రయత్నం చేసారు. సమన్యాయం అంటూ ఢిల్లీలో దీక్షా శిబిరాన్ని ఏర్పాటు చేసుకుని పలు పార్టీల నాయకులను తన వేదిక వద్దకు రప్పించుకున్నాడు. రాష్ట్రంలో తిరిగి బీజేపీతో పొత్తుకు ఆయన సుముఖంగా వున్నట్లు తెలుస్తుంది. తెలంగాణకు చంద్రబాబు అభ్యంతరం పెట్టడం లేదు కాబట్టి బీజేపీ కూడా పొత్తుకు సిద్ధంగానే వుంది. ఈ బంధానికి బాటలు వేయడం కోసమే బాబు (మిగతా 10వ పేజీలో)

◀ పరువుకంటే పదవే ముఖ్యం ▶

## అందరూ దొంగలే

మేం రాజీనామా చేసినంత మాత్రాన విభజన ఆగిపోతుందా..? మా రాజీనామాతో విభజన ఆగుతుందంటే అందుకు నేను సిద్ధమే... రాజీనామాలు చేసి లాభం లేదు, సీమాంధ్రకు మెరుగైన ప్యాకేజీ సాధిద్దాం... రాష్ట్ర విభజన ప్రకటన, తెలంగాణనోట్‌ను కేంద్ర కేబినెట్ ఆమోదించాక మన కేంద్రమంత్రులు, ఎంపీలు చెబుతున్న మాటలివి. రాజీనామాల విషయంలో అందరివీ దొంగనాటకాలే! పదవులను ప్రేమిస్తున్నంతగా వీళ్లు ఆ పదవులిచ్చిన ప్రజలను ఆదరించడంలేదు.

సీమాంధ్రలోని కాంగ్రెస్ ఎంపీలకు రోషం, పౌరుషం వుండుంటే, తమ రాష్ట్రం సమైక్యంగానే వుండాలన్న చిత్తశుద్ధి వుండుంటే ఈ రాష్ట్రం ఎట్టి పరిస్థితులోనూ విభజన జరిగేది కాదు. సీమాంధ్ర కాంగ్రెస్ ఎంపీలంతా ఒక్కటిగా మాట్లాడివుంటే తెలంగాణ నిర్ణయం తీసుకునేంత సాహసానికి కాంగ్రెస్ ఒడిగట్టి వుండేది కాదు.

కేంద్రంలోని యూపీఏ సర్కార్ బొటాబొటి మెజార్టీతో నడుస్తుంది. రాష్ట్రాన్ని చీల్చినా కూడా కాంగ్రెస్‌కు మెజార్టీ లోక్‌సభసీట్లు వుండేది సీమాంధ్రలోనే!

సీమాంధ్రలో 25లోక్‌సభ స్థానాలుండగా వైకాపాకు ఇద్దరు ఎంపీలు, టీడీపీకి నలుగురు ఎంపీలు మాత్రమే వున్నారు. మిగతా 19మంది ఎంపీలు కాంగ్రెస్‌వాళ్లే. రాష్ట్ర విభజన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వీళ్లంతా ఒకేసారి స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామాలు చేసి నేరుగా స్పీకర్‌కే ఇచ్చివుంటే చాలు... యూపీఏ ప్రభుత్వమే పడిపోయే పరిస్థితి వచ్చేది.

కాని ఏ ఒక్కరూ అలా చేయలేదు. ఒక్క నందమూరి హరికృష్ణ తప్పితే ఇంకెవరూ చిత్తశుద్ధితో రాజీనామాలు చేయలేదు. చాలామంది ఎంపీలు మేం రాజీనామాలు చేసామని డ్రామాలాడుతున్నా త్రికరణ శుద్ధిగా రాజీనామా చేసి ఆమోదించుకున్నది హరికృష్ణనే.

కొందరు ఎంపీలు ఫ్యాక్స్ ద్వారా రాజీనామా లేఖలు పంపారు. ఇంకొందరు ఎక్కడ రాజీనామా చేయాల్సి వస్తుందోనని తప్పించుకు తిరుగుతున్నారు. మరికొందరు పార్లమెంటులో బిల్లు అడ్డుకుంటామని ప్రగల్భాలు పలుకుతున్నారు. సభలో సోనియాగాంధీని చూస్తేనే ప్యాంట్లు తడుపుకునే వీళ్లు (మిగతా 5వ పేజీలో)



పుట్టిన ఊరు

## ఋణం తీర్చుకుంటున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

విత్త మొకనికిచ్చి వితరణగుణంపు
చిత్తమొకనికిచ్చి వెరుపు చేసె...

పై పద్యంలో చెప్పినట్లు డబ్బులున్న వారికి భగవంతుడు దానగుణము ఇవ్వడు, దానగుణము వున్నవాడికి ధనం చేకూరదు. కాని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి భగవంతుడు రెండూ ఇచ్చాడు. మనం సంపాదించిన దాంట్లో పావలానో పదిపైసలో దానం చేస్తే పుణ్యం అని చెప్తుంటే తన సంపాదనలో పావలా తాను వుంచుకుని మిగతాది దానధర్మాలకు ఉపయోగిస్తున్న అపర దానకర్ణుడిగా పిలువబడుతున్నాడు ప్రభాకర్‌రెడ్డి.

నెల్లూరులో కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన వి.పి.ఆర్. కన్వెన్షన్ సెంటర్‌లో విలేకరులతో మాట్లాడుతూ తాను నిర్మించిన ఈ అద్భుతసౌధం లాభాపేక్షతో కట్టలేదని, తాను పుట్టిన గడ్డ నెల్లూరులో ఒక చిరస్మరణీయమైన కార్యక్రమాన్ని చేపట్టాలన్న సంకల్పమే ఈ నిర్మాణమని అన్నారు. ఇది కేవలం ధనవంతులు మాత్రమే శుభకార్యాలు చేసుకోగల ప్రాంగణంకాదని, అన్ని వర్గాల ప్రజలు తమ ఇంట ఆనంద వేడుకలను ఇక్కడ జరుపుకోవచ్చని అన్నారు.

నెల్లూరుకు ఆర్.యల్.రెడ్డి కుటుంబం అందించిన టౌన్‌హాల్ తరహాలోనే ఈ కన్వెన్షన్‌సెంటర్‌ను నెలకొల్పానని, త్వరలో ఒక ట్రస్ట్ ఏర్పాటుచేసి ఆ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ సెంటర్ నిర్వహించబడేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపాడు. తాను పుట్టినగడ్డపై మమకారంతోనే జన్మభూమి రుణం తీర్చుకోవడానికే ఈ సత్కార్యాలన్నీ చేస్తున్నట్లు పేర్కొన్నాడు.

అంతేకాదు, ఈ కన్వెన్షన్‌సెంటర్ ప్రక్కనే వున్న మరో స్థలంలో త్వరలో ఒక స్కూల్‌ని ఏర్పాటుచేసి "స్వామి వివేకానంద ట్రస్ట్" ఆధ్వర్యంలో ఈ స్కూల్‌ను నిర్వహించే (మిగతా 10వ పేజీలో)

**ప్రత్యేక శీర్షిక**

వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి
జీవన ప్రస్థానాన్ని తెలిపే
ప్రత్యేకశీర్షిక 8పేజీలను
ఈ వారం
"లాయర్" పాఠకులకు
అందిస్తున్నాం....

సం/-

PDF Compressor Free Version



# అక్కడ ఉండలేం... ఎక్కడికి... పోగలం?

## జిల్లాలో కాంగ్రెస్ నేతల విచిత్ర పరిస్థితి



కాంగ్రెస్‌పార్టీని నమ్ముకుని అందులో వుండడంకంటే బస్టాండ్‌లో ఉడకబెట్టిన బఠానీలు అమ్ముకోవడం మేలనే ధోరణిలో కాంగ్రెస్ నాయకులున్నారు. సీమాంధ్రలో కాంగ్రెస్‌కు, వెంటిలేటర్ మీదున్న పేషంట్‌కు పెద్దతేడా లేదని కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యామ్నాయ రాజకీయ మార్గాలనూ వెదుక్కొంటున్నారు. కాంగ్రెస్‌లో ఉండి దాంతోపాటే మునగడంకంటే ఏదో ఒక పార్టీని ఇప్పుడే ఆశ్రయించడం మేలనే ధోరణి జిల్లా కాంగ్రెస్ నేతల్లో కనిపిస్తుంది.

జిల్లాలో ఆనం సోదరులకు తప్పితే మిగతా నాయకులెవరికీ కాంగ్రెస్‌లో వుండాలనే ధైర్యం లేదు. ఆనం వాళ్లు కూడా ఇతర పార్టీల్లోకి పోలేరు కాబట్టి అక్కడ వుండి తీరాల్సిందే! కాని మిగతావారికి అంత అవసరమేముంది. ఇక నేదురుమల్లి కుటుంబానికి తప్పదు. రాజకీయంగా అవకాశాలున్నా లేకున్నా కాంగ్రెస్‌లోనే వుండాలి. తన రాజకీయ జీవితంలో నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి సంపాదించుకున్న అతిగొప్పపేరు అవకాశవాదం కోసం పార్టీలు మార్చేరకం కాదని, నిఖార్సయిన కాంగ్రెస్‌వాది అని. అనారోగ్యంతో ఆయన ప్రస్తుత రాజకీయపరిస్థితులను గ్రహించే పరిస్థితిలో కూడా లేడు. ఆయన కుటుంబసభ్యులు కూడా కాంగ్రెస్‌ను వదలకపోవచ్చు.

సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిలు కాంగ్రెస్‌లోనే కొనసాగుతారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆదాల ఒక పార్టీవైపు చూస్తుంటే, ముంగమూరుకు పాత పార్టీవాళ్లు వల వేస్తున్నారనే ప్రచారం జరుగుతుంది. మాజీ ఎమ్మెల్యేలు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కంభం విజయరామిరెడ్డి, మాదాల జానకిరాం వంటి వారు తెలుగుదేశాన్ని వదిలివచ్చినవాళ్లే! వీళ్లు మళ్లీ పాతగూటికి చేరుతారనే వూహాగానాలు వినిపిస్తున్నాయి.

బొల్లినేని కృష్ణయ్య, కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి వంటి నాయకులు మండలస్థాయిలలో ద్వితీయశ్రేణి కాంగ్రెస్ నాయకులంతా కూడా కాంగ్రెస్‌లో వుండడంకంటే వైకాపాకో, టీడీపీకో జంప్ చేయడం మేలనే ఆలోచనలో వున్నట్లు తెలుస్తుంది.

# బస్టాండులో... బస్సు



గతంలో ఒకరోజు ఆర్టీసీ సమ్మె జరిగితేనే ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడేవాళ్లు. ప్రయాణాలు ఆగిపోయేవి. లావాదేవీలు స్థంభించిపోయేవి. అలాంటిది ఒకరోజు కాదు, రెండ్రోజులు కాదు, ఏకంగా 60రోజులు సమ్మె జరిగితే ప్రజలు ఏ మాత్రం చలించలేదు. బస్సులు లేక ఇబ్బందులు పడుతున్నా కూడా వాటిని బయటకు కనపడనీయలేదు. మరో 60రోజులు సమ్మె జరిగినా ప్రజలు ఏ మాత్రం ఇబ్బంది పడుతున్నామనే బాధకు లోనయ్యేటట్లు లేదు. మరి ఒకరోజు సమ్మెకు 60రోజుల సమ్మెకు ఇంత తేడా ఎందుకొచ్చింది. గతంలో ఆర్టీసీసమ్మెలను ప్రజలు కోరుకోలేదు. కాబట్టి ఒకరోజు సమ్మె జరిగినా ఇబ్బంది పడ్డారు. కాని ఈ 60రోజు సమ్మెకు ప్రజలే సంపూర్ణమద్దతు పలికారు. కాబట్టే ఇబ్బంది పడుతున్నామనే అభిప్రాయం రాలేదు.

రాష్ట్ర విభజన ప్రకటన తర్వాత సీమాంధ్రలోని 13జిల్లాల్లో ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగడం జరిగింది. జిల్లాలో 10డిపోల పరిధిలో 862బస్సులు డిపోలలో నిలిచిపోయాయి. ఆర్ఎం, డిప్యూటీ సీటీఎం, డిప్యూటీ సిఎంఇ, పర్సనల్ మేనేజర్స్, డిపో మేనేజర్స్, విజిలెన్స్ సిబ్బంది, వారి సెక్యూరిటీ, డ్రైవర్లు తప్పితే 10డిపోల పరిధిలో 4414 మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. దీంతో ఎక్కడి బస్సులు అక్కడ నిలిచిపోయాయి. నెల్లూరు ఆర్టీసీకి సరాసరిన రోజుకు 90లక్షల రూపాయల రాబడి లభిస్తుంది. సమ్మెకాలంలో నెల్లూరుజిల్లా వరకే ఆర్టీసీకి 50కోట్ల రూపాయల మేర రాబడిని కోల్పోవలసివచ్చింది. ఇంత కాకపోయినా ఇందులో సగం ఆదాయమైనా (మిగతా 10వ పేజీలో)

# మనమూ... అప్రమత్తం కావాలి



పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదం ఇంతకుముందు ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, పూణే, అహ్మదాబాద్ వంటి నగరాలలో వుండేది. అదిప్పుడు చాపక్రింద నీరులా పాకుతోంది. మహానగరాలను దాటి నగరాలకు, అక్కడనుండి పట్టణాలకు, అవైపు నుండి గ్రామాలకు కూడా విస్తరిస్తుంది. ఉగ్రవాదం ఎంత లోతుకు చొచ్చుకుపోతుందనే దానికి చిత్తూరు జిల్లాలోని పుత్తూరు ఘటనే ఉదాహరణ. ఆరునెలలుగా ఇక్కడ ముగ్గురు ఉగ్రవాదులు మకాం వేశారు. సాధారణ జనంలో కలిసిపోయారు. పుత్తూరుకు దగ్గర్లోనే ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం తిరుమల వుంది. బీజేపీ అగ్రనేత నరేంద్రమోడీతో పాటు తిరుమల కూడా పుత్తూరులో పట్టుబడ్డ ఉగ్రవాదుల లిస్టులో ఉండడం ఆందోళన కలిగించే విషయమే. పుత్తూరు సంఘటన నేపథ్యంలో నెల్లూరుజిల్లా పోలీసుయంత్రాంగం కూడా ఎంతో అప్రమత్తంగా వుండాల్సిన అవసరముంది. భారత అంతరిక్ష పరిశోధనారంగానికే తలమానికంగా నిలిచే శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష ప్రయోగకేంద్రం ఈ జిల్లాలోనే వుంది. పారిశ్రామిక ప్రగతికి రాజమార్గంగా వున్న కృష్ణపట్నం పోర్టు ఈ జిల్లాలోనే వుంది. పాక్ నుండి సముద్రమార్గంలో వచ్చి ఉగ్రవాదులు ముంబైదాడులకు తెగబడడం తెలిసిందే. షార్ తీరప్రాంతంలోనే వుంది. ఇప్పటికే మెరైన్ పోలీస్ స్టేషన్ల ఏర్పాటు ద్వారా పోలీసు యంత్రాంగం తీరంపై నిఘాను పెట్టింది. జరుగుతున్న సంఘటనలు, ఉగ్రవాదులు ఎక్కడైనా తిష్టవేస్తున్న పరిస్థితుల దృష్ట్యా తీరప్రాంతం మీదే కాకుండా శ్రీహరికోట పరిసర ప్రాంతాలన్నింటి మీద నిఘాను పెంచాల్సి వుంది.

# ఊపిరి వచ్చిన కేడర్.. కదులుతున్న లీడర్...

# 'దేశం'లో కదలిక వచ్చింది



**రెండుకళ్ల సిద్ధాంతం అంటూ చంద్రబాబు పార్టీని రెంటికీ చెడిన రేవడిగా మార్చాడు. జోడుగుర్రాల సవారీ ఎంత కష్టమో చంద్రబాబుకు ఇప్పుడు తెలిసొచ్చింది. కేంద్రం తీసుకున్న రాష్ట్ర విభజన నిర్ణయంతో ఇటు సీమాంధ్ర, అటు తెలంగాణ... రెండు ప్రాంతాల్లోనూ పార్టీ మునిగిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. దివాలా తీస్తున్న పార్టీని చూసి ఆ పార్టీ నాయకులు తట్టాబుట్టా సర్దుకోసాగారు. తమ సేఫ్టీ కోసం ఇతర పార్టీలవైపు చూడసాగారు.**

ఈ తరుణంలో సమన్యాయం అంటూ చంద్రబాబు ఢిల్లీలో చేసిన దీక్ష ఆ పార్టీ కేడర్‌లో కదలిక తెచ్చింది. పార్టీని కాపాడుకోవడానికి చంద్రబాబే ఏదో ఒక తంటాలు పడాలి. ఢిల్లీ దీక్ష ద్వారా ఆయన ఆ పనే చేసాడు. ఢిల్లీలో దీక్ష పార్టీకి ప్రయోజనం కలిగించింది. పంజాబ్ ముఖ్యమంత్రి బాదల్, దళ్(యు) అధ్యక్షుడు శరద్‌యాదవ్, యోగా గురువు బాబా రాందేవ్ వంటివారు రావడం, బాబు దీక్షకు సంఘీభావం తెలపడం, నరేంద్ర మోడీ, రాజ్‌నాథ్‌సింగ్‌లు ఫోన్‌లో బాబును పరామర్శించడం వంటి చర్యలు పార్టీలో నైతిక స్థైర్యాన్ని పెంచాయి. చంద్రబాబు కూడా ఈ వయసులో మొండిగా దీక్ష చేయడం ఆ పార్టీ కేడర్‌లో ఉత్సాహం నింపింది. రాష్ట్ర విభజన విషయంలో తెలుగుదేశం కార్యకర్తలు ఢిల్లీలో కొంత రభస సృష్టించి ఈ విషయాన్ని ఫోకస్ చేయగలిగారు. ఢిల్లీలో చంద్రబాబు దీక్షావేదికను మన జిల్లా నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి బాగానే ఉపయోగించుకున్నారు. సీమాంధ్ర వాయిస్‌ను ఆయన బలంగా వినిపించారు. చంద్రబాబు దీక్ష చేసే సమయంలో కూడా నెల్లూరు కేంద్రంగా తెలుగుదేశం శ్రేణులు ఉత్సాహంగానే సమైక్యాంధ్ర ఉద్యమంలో పాల్గొనడం విశేషం. చంద్రబాబు దీక్ష జిల్లా తెలుగుదేశం కేడర్‌కు టానిక్‌లా పనిచేసిందని చెప్పవచ్చు.

# ఏకతాటిపై నిలుస్తారా?



మనలో మనం పోరాడితే పాండవులు ఐదుగురు, కౌరవులు నూరుగురు... అదే మన మీదకు ఎవరన్నా దండెత్తివస్తే మనం నూటఅయిదుగురం... మహాభారతంలో డైలాగ్ ఇది. నేటి రాజకీయాలలో మహాభారత కాలంనాటి ఘట్టాలు అడుగడుగునా కనిపిస్తూనే వుంటాయి.

రాష్ట్ర విభజన నేపథ్యంలో నాయకులు పార్టీల వారీగా కాదు, ప్రాంతాలవారీగా విడిపోయారు. కాంగ్రెస్, తెలుగుదేశం, బీజేపీ, వైకాపా, సీపీఎం, సీపీఐ... నాయకులు ఇప్పుడు తమ పార్టీలను మరచిపోయారు. తెలంగాణ, సీమాంధ్ర... ఈ రెండు ప్రాంతాలను మాత్రమే గుర్తుపెట్టుకుని వున్నారు. తెలంగాణబిల్లు రేపు అసెంబ్లీకి వస్తే దానిమీద ఓటింగ్‌గాని లేదా అభిప్రాయ సేకరణ గాని ప్రాంతాల వారీగానే జరగబోతుంది. తెలంగాణలోని ఎమ్మెల్యేలంతా బిల్లు ఆమోదానికి ఒకే అంటున్నారు. ఒక్కరు కూడా ఈ విషయంలో పక్కకుపోయే అవకాశాలు లేవు. మరి సీమాంధ్రలో నాయకులు తెలంగాణబిల్లుకు వ్యతిరేకంగా ఏకతాటిపై వున్నారా? అనే సందేహం వ్యక్తమవుతుంది. తెలుగుదేశంవాళ్లు చూస్తే తెలంగాణలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు అనుకూలంగానూ, సీమాంధ్రలో ఎమ్మెల్యేలు వ్యతిరేకంగానూ వున్నారు. వైకాపాకు తెలంగాణలో ఎమ్మెల్యేలు లేరు కాబట్టి సమస్య లేదు. బీజేపీకి వున్న ముగ్గురు ఎమ్మెల్యేలు తెలంగాణవాళ్లే! ఇక కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చూస్తే తెలంగాణలో వాళ్లు బిల్లుకు అనుకూలంగా, సీమాంధ్రవాళ్లు వ్యతిరేకంగా వున్నారు. అయితే సీమాంధ్ర కాంగ్రెస్ (మిగతా 10వ పేజీలో)

# దటీజ్ రామా!

రాష్ట్ర విభజన విషయంలో డబుల్‌రోల్ చేసాడని విజయనగరంలో పీసీసీ అధ్యక్షుడు బొత్స సత్యనారాయణకు చుక్కలు చూపించారు అక్కడి ప్రజలు. తెలంగాణనోట్‌ను కేబినెట్ ఆమోదించాక బొత్స ఆస్తుల మీద ఉధృతంగా దాడులు జరిగాయి. ఒకరోజు జరిగిందంటే అర్థముంది... వరుసగా మూడురోజులు ఆగకుండా దాడులు జరిగాయి. పోలీసులు విరగ్గొడుతున్నా ప్రజలు ఆగలేదు. కర్ఫ్యూ విధిస్తేనే కాని అక్కడి పరిస్థితి అదుపులోకి రాలేదు.

రాష్ట్ర విభజన విషయంలో జనాలకు బొత్స మీద ఎంతకోపముందో నెల్లూరుజిల్లాలో ఆనం రామనారాయణరెడ్డి మీద అంతే కోపముంది. విభజన నిర్ణయానికి వ్యతిరేకంగా రాజీనామా చేయలేదనే ఆనం మీద కోపం. అయితే విజయనగరంలో బొత్స ఆస్తుల మీద దాడి జరిగినట్లుగా నెల్లూరులో ఆనం మీద దాడులు జరగలేదు. బొత్స లాగా ఆనంకు నెల్లూరులో కనపడే ఆస్తులు లేకపోవడం ఆయనకు ప్లస్‌పాయింట్. ఒకటిరెండుసార్లు మంత్రి ఆనం ఇంటి ముట్టడి కార్యక్రమం కూడా నామమాత్రంగా జరిగింది.

విజయదశమిరోజు మంత్రి దర్జాగా నెల్లూరుకే వచ్చారు. తన ఇంట్లో విలేకరుల సమావేశం పెట్టాడు. పబ్లిక్‌గానే తిరిగాడు. ఆందోళనకారులెవరూ ఆయనను ఘెరావ్ చేయడం కూడా జరగలేదు. దీనికి కారణం వ్యక్తిగత సంబంధాలే! ఎన్‌జీఓలకైనా, ఆర్టీసీ కార్మికులకైనా, సమ్మె చేసే ఉద్యోగులలో చాలామందికి ఆనంతో సన్నిహిత సంబంధాలుంటాయి. ఏదో ఒక పని మీద చాలామంది వారి వద్దకు వచ్చిన వాళ్లే వుంటారు. ఆ మొహమాటంతోనే ఈరోజు ఆనంను ముట్టడించలేకపోయారు.

## రాష్ట్ర విభజనలో...

# వెంకయ్య కీలకపాత్ర

దేశంలోని ప్రధాన జాతీయపార్టీలకు, రాష్ట్రంలోని అన్ని ప్రాంతీయపార్టీలకు రాష్ట్ర విభజన ఒక రాజకీయ అస్త్రంగా మారింది. కాంగ్రెస్‌తో పాటు మిగతా రాజకీయపక్షాలు కూడా ఈ అంశం నుండి లాభపడేందుకు తలోరకంగా ఆలోచిస్తున్నాయి. తెలుగుదేశం వంటి పార్టీలైతే దీనినుండి ఉత్పన్నమయ్యే రాజకీయ నష్టం నుండి తప్పించుకోవడానికి శత విధాలా ప్రయత్నిస్తున్నాయి. తెలంగాణపై ఒక్కో పార్టీ ఒక్కో రకంగా వ్యవహరిస్తుంది.



అయితే మొత్తం రాష్ట్ర విభజన విషయంలో బీజేపీ పోషించబోయే పాత్రపైనే ఇకముందు పరిణామాలు ఆధారపడి వుంటాయి. బీజేపీ మొదటి నుండి తెలంగాణ ఏర్పాటుకు కట్టుబడి వుంది. యూపిఏ ప్రభుత్వం తెలంగాణ ఏర్పాటు చేసినా మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా వున్నారు. కాని రాష్ట్రవిభజనతో సీమాంధ్రలో ఇంత పెద్దఎత్తున ఉద్యమం వస్తుందని వాళ్లు వూహించలేకపోయారు. ఈ పరిస్థితుల్లో బీజేపీ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర విభజనపై చేసిన ప్రకటనను తప్పుపడుతుంది. ప్రజల మధ్య విద్వేషాలను రగిల్చే విధంగా కాంగ్రెస్ ప్రకటన వుందని, రెచ్చగొట్టే ప్రకటనలతో కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర విభజన ప్రక్రియనే తప్పుదోవ పట్టించారని బీజేపీ విమర్శించడం జరిగింది. పరిపాలనా సౌలభ్యం కోసం ప్రాంతాలను విడదీయడానికి తాము అంగీకారం తెలిపామేగాని ప్రజలను విడదీయడానికి కాదని ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. కాంగ్రెస్ చేసిన రాష్ట్ర విభజన తీరుపై బీజేపీ అగ్రనేతలు అద్వానీ, నరేంద్ర మోడీ, రాజ్‌నాథ్‌సింగ్‌లు కూడా అసహనం వ్యక్తం చేయడం జరిగింది.

బీజేపీ మద్దతుతోనే ఇప్పుడు విభజన ముందుకు పోవడం గాని లేదా ఆగిపోవడం గాని వుంటుంది. ఆ బీజేపీలో ఇప్పుడు నెల్లూరీయుడైన ఆ పార్టీ జాతీయ నాయకుడు యం.వెంకయ్య నాయుడి పాత్ర కీలకం కాబోతుంది. సీమాంధ్రవాడైనప్పటికీ తెలంగాణ విషయంలో ఆయన తన పార్టీ నిర్ణయానికే కట్టుబడి వున్నాడు. సమైక్యవాదులు తన ఇంటిని ముట్టడించినా, తన దిష్టిబొమ్మలను తగలేసినా ఆయన పార్టీ నిర్ణయాన్ని మీరలేదు. అయితే రాష్ట్ర విభజన తీరుపై పార్లమెంటులో గతంలోనే నిప్పులు చెరిగాడాయన. కాంగ్రెస్‌పార్టీ ఓట్ల కోసం రాష్ట్రాన్ని విభజిస్తున్నట్లుగా వుందిగాని, పరిపాలనా సౌలభ్యం కోసం అన్నట్లుగా లేదని చెప్పారు. సీమాంధ్రుల సమస్యలను పరిష్కరించాకే తెలంగాణ ప్రకటన చేయాల్సివుందని గతంలోనే చెప్పారు. ఇటీవల ఢిల్లీలో విలేకరుల సమావేశంలో ఆయన సీమాంధ్రుల సమస్యలను పరిష్కరించాకే తెలంగాణపై ముందుకెళ్లాలని కేంద్రానికి సూచించారు.

వాస్తవంగా బీజేపీ నుండి ఈ ప్రకటన వచ్చాకే సీమాంధ్రులకు ధైర్యం వచ్చింది. బీజేపీ మద్దతు లేనిదే తెలంగాణ బిల్లు ఆమోదం పొందదు. సీమాంధ్రుల సమస్యలపై బీజేపీ గట్టిగా పట్టుబట్టింది కాబట్టి కాంగ్రెస్ కూడా ఏకపక్ష విభజనకు పూనుకోలేదు. త్వరితగతిన సీమాంధ్ర సమస్యలను పరిష్కరించాల్సిందే!

తెలంగాణపై బీజేపీ తీసుకునే నిర్ణయాలలో వెంకయ్య నాయుడి సలహాలు, అభిప్రాయాలు ఖచ్చితంగా వుంటాయి. కాబట్టి సీమాంధ్రకు అన్యాయం జరుగకుండా చూడాల్సిన గురుతరబాధ్యతను వెంకయ్య సమర్ధవంతంగా నిర్వర్తించాల్సివుంది.

## అంతర్జాతీయ యోగా పోటీలలో

# రత్నం విద్యార్థిని ప్రతిభ




ఈ నెల 12, 13, 14తేదీలలో ఫ్రాన్స్‌లోని పారిస్‌లో జరిగిన అంతర్జాతీయ యోగా పోటీలలో నెల్లూరులోని డాక్టర్ కిషోర్స్ రత్నం స్కూల్ విద్యార్థిని వై.జ్యోష్ణవి విశేషప్రతిభాపాటవాలు చూపి నాలుగు కాంస్య పతకాలు సాధించింది. మొత్తం ఐదువిభాగాలలో జ్యోష్ణవి పాల్గొనగా 4 విభాగాలలో పతకాలు సాధించడం విశేషం. మొత్తం 43దేశాల నుండి క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొన్నారు. 12ఏళ్ల జ్యోష్ణవి అండర్-17 విభాగంలో పాల్గొని తన ప్రతిభ చూపారు. అన్ని దేశాల నుండి వచ్చిన క్రీడాకారులలో జ్యోష్ణవిదే చిన్నవయస్సు. చిరుప్రాయంలోనే ఈ చిన్నారి చేసిన విన్యాసాలు చూసిన నిర్వాహకులు వచ్చే యేడాది దక్షిణకొరియాలో జరిగే అంతర్జాతీయ యోగా పోటీలకు ఆమెను నేరుగా ఎంపికచేసారు. అంతర్జాతీయ స్థాయిలో నెల్లూరుకు కీర్తి తెచ్చిన జ్యోష్ణవికి 'లాయర్' అభినందనలు.

# కరెంటు కష్టాలు ప్రారంభం

- కార్పొరేషన్‌లో 3గంటలు
- మున్సిపాలిటీల్లో 4గంటలు
- మండల కేంద్రాల్లో 6గంటలు
- గ్రామీణ ప్రాంతల్లో 8గంటలు

కరెంటు కోతల వేళలను మరలా పెంచడంతో వినియోగదారులకు కష్టాలు ప్రారంభమయ్యాయి. కార్పొరేషన్ పరిధిలో 3గంటలు, మున్సిపాలిటీల్లో 4గంటలు, మండల కేంద్రాల్లో 6గంటలు, గ్రామీణ ప్రాంతాల్లో 8గంటల పాటు కోతలు విధించినట్లు విద్యుత్‌శాఖ ఎస్.ఈ నందకుమార్ పేర్కొన్నారు. జలవిద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి తగ్గిపోవడంతో కోతల వేళాలను పెంచాల్సి వచ్చిందని అధికారులు చెబుతున్నారు. శ్రీశైలం జలవిద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి నిలిచిపోవడం, సింహాద్రి ప్లాంట్‌లో రెండు యూనిట్లు మరమ్మత్తులకు గురి కావడంతో కోతల వేళలను పెంచక తప్పదంటున్నారు.

అమ్మ ఫర్నిచర్ మాల్
మినిబైపాస్‌రోడ్, నెల్లూరు.
• సరికొత్త ప్రపంచస్థాయి మోడల్స్
• ఇంపోర్టెడ్ & ఇండియా ఫర్నిచర్
ఫైనాన్స్ సదుపాయము, ఆదివారం షాపు గలదు.



PDF Compressor Free Version



## 'ప్రభా'తం

'యథారాజ తథాప్రజ' అన్నది ఏ విధంగా అక్షరసత్యమో కేంద్రంలో వున్న యూపీఏ ప్రభుత్వ పనితీరునుబట్టి తెలుసుకోవచ్చు. ఒక గ్రామసర్పంచ్‌గా తన ఇల్లు మాత్రమే బాగుంటే చాలనికోరుకునే వాడుంటే అతని పదవీకాలంలో అతని ఇల్లు ఐదంతస్థుల మేడ అవుతుంది. అదే నా ఊరంతా బాగుండాలనుకునే వాడు సర్పంచ్‌గా వుంటే 5ఏళ్లలో ఆ ఊరంతా గుడిసెల స్థానంలో చిన్నచిన్న మేడలైనా వుంటాయి. రాజకీయనాయకుడు తన కోసం, తన పార్టీ కోసం ఆలోచిస్తే దేశం ముందుకుపోదు. అభివృద్ధి ఎక్కడా జరగదు. ఒక వ్యవస్థ అభివృద్ధి చెందాలంటే ఆరోగ్యవంతమైన పరిపాలనా విధానమే కాదు, ఆరోగ్యవంతమైన నాయకత్వం కూడా వుండాలి. దురదృష్టం కొద్దీ మనకు అలాంటి ఆరోగ్యవంతమైన నాయకత్వ లోపం శాపంగా మారుతోంది.

దేశంలో నెలకొన్న ఎటువంటి సమస్యలైనా వెనువెంటనే పరిష్కరించే మార్గం ఆరోగ్యవంతమైన, సమర్ధవంతమైన నాయకత్వం ద్వారానే ఏర్పడుతుంది. ఆరోగ్యం, ఆలోచన, దృఢచిత్తం, స్థిరమైన నిర్ణయాలు తీసుకునే వ్యక్తిత్వం, నిజాయితీ, పారదర్శకత, కులమతాలకతీతమైన భావసారూప్యత, జాతీయ దృక్పథం, దేశం పట్ల అచంచల భక్తివిశ్వాసాలు ఉత్తమ నాయకత్వానికి లక్షణాలు. కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వాన్ని ఏలుతున్న పెద్దలలో ఇవి లోపించాయి. ముఖ్యంగా కేబినెట్‌లోని ముఖ్యులంతా అనారోగ్యం బారిన పడినవాళ్లే! వాళ్ల అనారోగ్యం మూలంగానే సమస్యలు ఎక్కడికక్కడ పరిష్కారం కాకపోగా సుదీర్ఘకాలంగా నానుతూ వున్నాయి. ప్రధాని మన్మోహన్‌సింగ్ ఆరోగ్యంగా లేరు. ఆయనకు బైపాస్ సర్జరీ జరిగింది. అనారోగ్యం కారణంగా ఆయన పరిపాలనా వ్యవహారాలలో చురుకుగా వ్యవహరించలేకపోతున్నారు. యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ అనారోగ్యం బారిన పడడం తెలిసిందే! యూపీఏలో ఆమెకు అధికారిక పోస్టు ఏదీ లేకపోయినప్పటికి ప్రభుత్వాన్ని పరోక్షంగా శాసిస్తున్నది సోనియానే! ప్రభుత్వపరంగా ఎటువంటి కీలక నిర్ణయం తీసుకోవాలన్నా సోనియాపైనే ఆధారపడాలి. అనారోగ్య కారణంగా ఆమె ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో సహకరించే పరిస్థితి లేదు. కేంద్ర హోంశాఖ మంత్రి సుశీల్‌కుమార్‌షిండేకి ఇటీవల బ్రెయిన్ సర్జరీ జరగడం తెలిసిందే! ప్రభుత్వంలో కీలకశాఖ ఆయనది. కాని అనారోగ్యం కారణంగా హోంశాఖ పరంగా వెనువెంటనే నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితి. రక్షణశాఖ మంత్రి ఆంటోనీకి ఇటీవల సర్జరీ జరగడం తెలిసిందే! దేశ భద్రతకు సంబంధించిన శాఖ ఆయనది. కేంద్ర కేబినెట్‌లో ఇంకా పలువురు మంత్రులు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు.

### అనారోగ్య కేంద్రం



కేంద్రంలోని అనారోగ్య కేబినెట్ కారణంగా ఎటువంటి సమస్యలొస్తాయనే దానికి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విభజన అంశాన్ని ఒక ఉదాహరణగా తీసుకోవచ్చు. కాంగ్రెస్‌పార్టీ సిడబ్ల్యూసి భేటీలో తెలంగాణ ప్రకటన చేసాక దీనికి సంబంధించిన మంత్రులు ఇంతవరకు ఒక చోట కుదురుగా కూర్చోలేదు.

అయితే రోగాలనేవి మనుషులకు కాక చెట్లకు పుట్లకు రావు కదా! రోగాలనేవి కొనితెచ్చుకునేవి కూడా కాదు కాబట్టి ఇందులో ఎవరినీ తప్పుపట్టాల్సిన అవసరం లేదు. అయితే ఒక వ్యక్తి అనారోగ్యం బారిన పడితే అతని కుటుంబానికి మాత్రమే ఇబ్బంది ఏర్పడుతుంది. కాని ఒక కేంద్రమంత్రి, ఒక ప్రధాని అనారోగ్యం కారణంగా సరిగా పనిచేయలేకపోతే మొత్తం దేశమే ఇబ్బంది పడుతుంది. పరిపాలకుడు ఎంత చలాకీగా, చురుకుగా వుంటే పరిపాలన అంత వేగంగా వుంటుంది.

కేంద్రంలోని అనారోగ్య కేబినెట్ కారణంగా ఎటువంటి సమస్యలొస్తాయనే దానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అంశాన్ని ఒక ఉదాహరణగా చూద్దాం. కాంగ్రెస్‌పార్టీ సిడబ్ల్యూసి భేటీలో తెలంగాణ ప్రకటన చేసాక దీనికి సంబంధించిన మంత్రులు ఇంతవరకు ఒక చోట కుదురుగా కూర్చోలేదు. తెలంగాణపై ఏర్పాటు చేసిన సమావేశానికి ఒక మంత్రి వస్తే ఇద్దరు మంత్రులు రారు. వీళ్లంతా ఒకేసారి సమావేశం కానిదే సమస్యకు ఏకాభిప్రాయంతో పరిష్కారం రాదు. అంతెందుకు కేబినెట్ తెలంగాణానోట్‌ను ఆమోదించాక ఏర్పాటు చేసిన తొలి జిఎంఓకు ఇద్దరు మంత్రులు అనారోగ్యం కారణాలతో గైర్హాజరయ్యారంటేనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ప్రధాని ఢిల్లీలో వుంటే సోనియా వైద్య చికిత్స కోసం అమెరికాకు వెళ్లి వుంటుంది. సోనియా, మన్మోహన్‌లు ఢిల్లీలో వుంటే షిండే ముంబై ఆసుపత్రిలో వుంటాడు. తెలంగాణపై ప్రకటన వెలువడ్డాక కేంద్ర కేబినెట్ అంతా సమిష్టిగా కుర్చుని, సమిష్టి ఆలోచనతో సమిష్టిగా నిర్ణయాలు వెలువరించి వుంటే ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు ఇంత గందరగోళ పరిస్థితులు వుండేవి కావు. వీళ్లు అలా చేయకపోవడం వల్లే రాష్ట్రం అగ్నిగుండంలా మండుతోంది. దేశంలో సమస్యలను పరిష్కరించాలన్నా, ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తూ ముందుకు వెళ్లాలన్నా స్వతంత్ర, స్థిర, దృఢనిర్ణయాలు తీసుకునే నాయకత్వం కావాలి. ప్రస్తుత ప్రధాని మన్మోహన్‌సింగ్‌లోనూ, అతని మంత్రివర్గ సహచరులలోనూ ఆ లక్షణాలు లేవు. వీరంతా పరాన్నజీవులు. సోనియా గాంధీ ఆలోచనలను, స్వార్థపూరిత నిర్ణయాలను అమలుపరిచే మరమంత్రులు వీళ్లు. కాంగ్రెస్‌పార్టీకి కావాల్సింది అధికారం, సోనియాగాంధీకి కావాల్సింది రాహుల్ ప్రధాని కావడం. ఆమె ఆలోచన, ఆచరణ ఆ విధంగానే వుంటుంది. యూపీఏ ప్రభుత్వం చేత కూడా ఆ విధంగానే పనిచేయించుకుంటుంది. ప్రభుత్వానికి, పార్టీకి మధ్య స్పష్టమైన విభజన గీత వుంది. కాని ఇప్పుడు కాంగ్రెస్‌పార్టీయే ప్రభుత్వం అన్న రీతిలో వ్యవహరిస్తుంది. ఎందుకంటే ప్రభుత్వంలో వున్నది అందరూ సుద్దపప్పులే! ఇలాంటి సుద్దపప్పులు దేశానికి పరిపాలకులుగా ఇంకా అవసరమా?




### జ్ఞానంలో అజ్ఞానం!

భారతదేశ ప్రధానిగా మోడీ కానీ, రాహుల్ కానీ అనర్హులట. ఈ మాటలు అన్నది జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత యుఆర్ అనంతమూర్తి. ఆయన అంతటితో ఆగలేదు. దేశ ప్రధానికి ఉండవలసిన అర్హతలు ఇప్పడున్న నాయకుల్లో ఎవరికీ లేవట! 'ప్రధాని అభ్యర్థులు కావలెను' అని విదేశీపత్రికల్లో ప్రకటిస్తామా?

కురుగూరు రంగనాథం, నెల్లూరు.

### జగన్-జనపథ్ కలిసాయి

ఎవరు దొరలో, ఎవరు దొంగలోకాని మన దేశంలో ఒకరిని ఒకరు వేరుచేయలేరు. సోనియా గాంధీ అమెరికా వెళ్లొచ్చాక జగన్ విషయంలో మనసు మార్చుకుంది. ఇద్దరూ క్రిస్టియన్‌లే అయినప్పుడు సర్దుకుపోవచ్చు కదా అని అక్కడ మతపెద్దలు చెప్పారట. దాంతో సోనియా మెత్తపడింది. జగన్‌కు బెయిల్ వచ్చింది. ఇప్పుడు కాంగ్రెస్ పెద్దలు కూడా జైజగన్ అనబోతున్నారు. కష్టకాలంలో జగన్‌ను వెన్నంటి నిలిచినవారికి కష్టాలు రాబోతున్నాయి. కాంగ్రెస్ నిర్వాకం మూలంగా సీమాంధ్రకు జగన్ సీఎం కాబోతున్నాడు.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

### ఈ శాంతి వచనాలు అప్పుడేమయ్యాయి

సీమాంధ్రలో ఉద్యోగులు శాంతించాలని, ఆందోళనలు విరమించాలని, సామరస్యంగా సమస్యలు పరిష్కరించుకుందామని జైపాల్ రెడ్డి వంటి తెలంగాణ నాయకులు ఇప్పుడు చెబుతున్నారు. మరి తెలంగాణలో ఉద్యోగులు సకలజనుల సమ్మెకు దిగినప్పుడు, మార్చ్‌ఫాస్ట్ పేరుతో ట్యాంక్‌బండ్ మీద తెలుగు మహనీయుల విగ్రహాలు పగలగొట్టినప్పుడు ఈ కుహనా శాంతియుతులంతా ఏమయ్యారు?

డి.శ్రీరాం, ముత్తుకూరు.

### జగన్మాయే...!

సోనియా తన కొడుకును ప్రధానిని చేయడం కోసమే ఆంధ్రను చీలుస్తుందని జగన్ చెప్తున్నాడు. ఆంధ్రలో కాంగ్రెస్‌కు జగన్ తన ఎంపిల మద్దతిస్తాడనే కదా దీనర్థం. ప్రజలు దీన్ని గమనించాలి.

జె.యస్.కె. నెల్లూరు.

## 'అంతర్'జాతీయం

- బాలికల విద్య కోసం యూసఫ్‌జాయ్ మలాలా చేసిన కృషిని అమెరికా అధ్యక్షుడు ఒబామా ఆయన సతీమణి మిషెల్ ఒబామా అభినందించారు. ఇటీవల శ్వేతసౌధంలో మలాలా ఒబామా దంపతులను కలిసింది. ఈ సందర్భంగా మలాలాను వారు ప్రశంసించారు.
- కాంగ్రెస్‌పార్టీలో రాహుల్‌గాంధీ ఏకగ్రీవనాయకుడని, ఆయన ప్రధానమంత్రి అభ్యర్థిత్వం విషయంలో ఎలాంటి విభేదాలు లేవని కేంద్ర విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి సల్మాన్‌ఖుర్షీద్ వెల్లడించారు.
- అమర్‌సింగ్ స్థాపించిన లోక్‌మంచ్ పార్టీని త్వరలోనే కాంగ్రెస్‌లో విలీనం చేయనున్నట్లు ఆ పార్టీ ఎంపీ జయప్రద తెలిపారు.
- గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోడీ ఈ నెల 27న పాట్నాలో తలపెట్టిన 'హుంకార్ ర్యాలీ' విజయవంతం కావాలని కోరుతూ బీజేపీ మైనార్టీ మోర్చా ఆధ్వర్యంలో ముస్లింలు చాదర్‌ను సమర్పించి ప్రార్థనలు నిర్వహించారు.
- కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ, ఉపాధ్యక్షులు రాహుల్‌గాంధీల ఎన్నికల ఖర్చును కాంగ్రెస్ పార్టీయే భరించింది. 2009 ఎన్నికలలో సోనియా రాయ్‌బరేలీ నుండి, రాహుల్ అమేథీ నుండి పోటీ చేసారు. ఇద్దరికీ చెరో పాతికలక్షల చొప్పున పార్టీయే ఖర్చుపెట్టినట్లు ఎన్నికల ఖర్చుల వివరాలను కాంగ్రెస్ కోశాధికారి మోతీలాల్ వోరా ఎన్నికల కమీషన్‌కు నివేదించారు.
- బీజేపీ ప్రధానమంత్రి అభ్యర్థి నరేంద్ర మోడీ 13వ తేదీ అహ్మదాబాద్‌లోని తన ఇంటిలో జరిగిన దసరా వేడుకలలో పాల్గొన్నారు. ఎప్పట్లాగే ఈ ఏడాది కూడా ఆయన 9రోజులు ఉపవాసం ఆచరించి పోలీసులు, భద్రతా సిబ్బంది సమక్షంలో నిర్వహించిన ఆయుధపూజలో పాల్గొన్నారు. ఢిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహించిన రావణ దహనం కార్యక్రమాన్ని రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ, ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ, ప్రధాని మన్మోహన్‌సింగ్, యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీలు తిలకించారు.
- మధ్యప్రదేశ్‌లో జరిగిన విజయదశమి సంబరాల్లో అపశృతి చోటుచేసుకుంది. దాతియాజిల్లాలో సింధ్‌నది తీరంలో వున్న రత్నగఢ్ మాతా మందిరం వద్ద జరిగిన తొక్కిసలాటలో 117మంది భక్తులు చనిపోయారు. 100మందికి పైగా భక్తులు గాయపడ్డారు. వంతెన మీద భక్తులు కిక్కిరిసి పోవడం, పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతోనే తొక్కిసలాట జరిగింది.
- ఈ నెల 15వ తేదీన ఫిలిప్పీన్స్‌లో భారీభూకంపం సంభవించింది. ఈ భూకంపంలో 93మంది మృతిచెందగా వందలాదిమంది గాయపడ్డారు. ఇళ్లు, భవనాలు, వంతెనలు కుప్పకూలాయి. రోడ్లు చీలిపోయాయి. సునామీ కూడా వస్తుందని భయంతో ప్రజలు కొండ ప్రాంతాలకు చేరుకున్నారు.

## వార్త వ్యాఖ్య

వార్త :- సీమాంధ్రులను సంతృప్తి పరచే ప్యాకేజీ. - డి.యస్.
వ్యాఖ్య :- **ఆ ప్యాకేజీ ఏదో మీరే తీసుకుని సంతృప్తిపడి వుండొచ్చుగా...**

వార్త :- దొంగచాటుగా విభజన. - కాంగ్రెస్ అధిష్టానంపై గాదె అనుమానం.
వ్యాఖ్య :- **పార్టీలు దొంగలకంటే దిగజారాయన్నమాట.**

వార్త :- అవినీతితోనే అభివృద్ధి దూరం. - జస్టిస్ బి.చంద్రకుమార్.
వ్యాఖ్య :- **అభివృద్ధితోనే అవినీతి కూడా దూరమవుతుంది.**

వార్త :- సమైక్యాంధ్రకే కట్టుబడి వుంటా. - ఉద్యోగసంఘాలకు మంత్రి పితాని హామీ.
వ్యాఖ్య :- **నాయకుల హామీలు నీటిబుడగలే.**

వార్త :- న్యాయం చేసాకే ముందుకెళ్లాలి. - విభజనపై చంద్రబాబు డిమాండ్.
వ్యాఖ్య :- **రాష్ట్రానికా? మీకా?**

వార్త :- రాజకీయాల్లో అంటరానివారుండరు. - శరద్‌పవార్.
వ్యాఖ్య :- **దానికంటే కూడా నాయకులకు రోషం వుండదంటే సరిపోయేదేమో?**

వార్త :- వ్యక్తిత్వాన్ని బట్టే అభ్యర్థులను ఎన్నుకోవాలి. - ఆరెస్సెస్ చీఫ్ భగవత్.
వ్యాఖ్య :- **వ్యక్తిత్వం వున్నోళ్లు రాజకీయాల్లోకి ఎందుకొస్తారు.**

వార్త :- హైదరాబాద్‌లోని సీమాంధ్రులకు వివేచ్ భరోసా.
వ్యాఖ్య :- **ఆయన భరోసా ఇస్తేనే నమ్మబుద్ధికాదు.**

వార్త :- ఢిల్లీ పెద్దల తీరు అర్థం కావట్లేదు. - మంత్రి పితాని.
వ్యాఖ్య :- **అర్థంకాకపోవడమే వాళ్ల స్పెషల్.**

వార్త :- తిమ్మిని బమ్మి చేయడంలో జగన్ దిట్ట. - యనమల.
వ్యాఖ్య :- **అయినా దీనిలో చంద్రబాబే సీనియర్.**

వార్త :- కొన్ని శక్తులతో కాంగ్రెస్ రహస్య ఒప్పందం. - లగడపాటి.
వ్యాఖ్య :- **రహస్యం కాదు, ఓపన్ ఒప్పందాలే!**

వార్త :- తెలంగాణ బిల్లును వ్యతిరేకిస్తాం. - బొత్స.
వ్యాఖ్య :- **వ్యతిరేకించాల్సిన సమయంలో వ్యతిరేకించి వుంటే ఫలితం ఉండేది.**

వార్త :- విద్య, వైద్యం రాజకీయనేతల చేతుల్లో ఉండకూడదు. - స్వామి పరిపూర్ణానంద.
వ్యాఖ్య :- **అసలు వాళ్ల చేతుల్లో ఏమీ ఉండకుంటేనే బాగుంటుంది.**

PDF Compressor Free Version



☞ సమైక్యాంధ్ర ఉద్యమం...

# ఆగడమా? సాగడమా?



సమైక్యాంధ్ర ఉద్యమం దేశ చరిత్రలోనే నిలిచిపోయే రీతిలో జరిగింది. రాష్ట్ర విభజన ప్రకటన నిర్ణయం తర్వాత సీమాంధ్ర లోని 13జిల్లాలు స్థంభించిపోయాయి. ప్రతి ఒక్కరి గుండె మండింది. తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించకున్నా దానిని ప్రకటించిన తీరు చూసి ప్రజలు మండిపడ్డారు. ఏ రాజకీయ పార్టీతో పొత్తులేకుండా, ఎవరి సాయం తీసుకోకుండా ప్రజలే స్వచ్ఛందంగా సమైక్యాంధ్ర ఉద్యమాన్ని నిర్మించారు. ఈ ఉద్యమం మహోగ్రరూపం దాల్చింది. అది ఎంతటి తీవ్రరూపం దాల్చిం దనేది విజయనగరంలో తగలబడిన బొత్స ఆస్తులను, రాజ మండ్రిలో పగిలిన హర్షకుమార్ కాలేజీ బస్సుల అద్దాలను చూసి తెలుసుకోవచ్చు. విజయనగరంలో నాలుగురోజుల పాటు కర్ఫ్యూ విధించారంటేనే ఉద్యమజ్వాల ఏ స్థాయిలో ఎగిసిందో అర్థమవు తుంది. దాదాపు సీమాంధ్రలో 80రోజుల నుండి ఆందోళనలు జరుగుతున్నాయి. ఉద్యమంలో కీలకపాత్ర ఉద్యోగులదే! ఎందుకంటే వాళ్లు ఇన్నిరోజుల జీతాలను కూడా త్యాగం చేసారు. పస్తులుండి పుస్తెలను అమ్ముకుని ఉద్యమాన్ని నడిపారు. రాష్ట్ర విభజన చేస్తే ఈ స్థాయిలో ఉద్యమం జరుగుతుందని ఎవ్వరూ ఊహించలేదు. కాంగ్రెస్ అధిష్టానం అంచనా వేయలేదు. సీమాంధ్ర నేతలు కూడా అనుకోలేదు. కాని ఎవరూ వూహించని స్థాయిలో సమైక్యాంధ్ర ఉద్యమం నడిచింది. తెలంగాణ ప్రకటన రాగానే ఏపి ఎన్‌జీఓలు సమ్మెకు దిగారు. అదనపు జిల్లా కలెక్టర్ నుండి క్రిందిస్థాయి క్లర్క్ వరకు చిన్నా పెద్ద తేడా లేకుండా అందరూ ఉద్యమబాట పట్టారు. ప్రభుత్వ కార్యాలయాలన్నీ మూతపడ్డాయి. ప్రభుత్వ లావాదేవీలన్నీ ఆగిపోయాయి. ప్రభుత్వానికి రావాల్సిన పన్నులు నిలిచిపోయాయి. 13జిల్లాల్లో ఆర్టీసీ బస్సులు ఆగిపో యాయి. వేలాదిమంది ఆర్టీసీ కార్మికులు ఉద్యమబాట పట్టారు. విద్యుత్ ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. సీమాంధ్రలో ఇంత ఎత్తున ఆందోళన జరుగుతున్నా కేంద్రంలో చలనం లేకుండా పోయింది సరికదా, సీమాంధ్రులను ఇంకా రెచ్చగొడుతూ తెలంగాణనోట్‌కు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. దీంతో సమైక్యాంధ్ర ఉద్యమం మరింత వేడెక్కింది. నిరసనలు మిన్నం టాయి. విద్యుత్ ఉద్యోగులు మెరుపు సమ్మెకు దిగారు. ఏడాపెడా కోత లతో దక్షిణాది గ్రిడ్‌పై ప్రభావం చూపారు. దక్షిణాది రాష్ట్రాలకు వణుకుతెప్పించారు. రైల్వేను స్థంభింపజేసారు. విద్యుత్ ఉద్యోగుల మెరుపు సమ్మెతోనే కేంద్రం కొంత వరకు దిగొచ్చింది. సీమాంధ్ర సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని తొలిసారిగా చెప్పింది. కేంద్రం తన మూర్ఖత్వాన్ని తగ్గించుకోవడంతో ఉద్యో గులూ కొంత మెత్తబడ్డారు. మొదట విద్యుత్ ఉద్యోగులు సమ్మెను విరమించారు. ఫైలిన్ తుఫాన్ నేపథ్యంలో విధుల్లో చేరారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామనే హామీతో ఆర్టీసీ కార్మికులు సమ్మె విరమించారు. రెండు నెలల విరామం తర్వాత బస్సులు రోడ్డెక్కాయి. ఎన్‌జీఓలు తుఫాన్ సమయంలో తాత్కాలికంగా విధులకు హాజరయ్యారు. వాళ్లు ఒక్కరే సమ్మె విరమించాల్సి వుంది. సమైక్య రాష్ట్రం లేదా సీమాంధ్ర ఉద్యోగు లకు న్యాయం చేసే విషయంలో స్పష్టమైన హామీ వస్తే వాళ్లు విధుల్లో చేరే అవకాశముంది. అలాకాకుండా కేంద్రం మొండి వైఖరినే అవలంభిస్తే విధుల్లో చేరిన ఉద్యోగులు మళ్ళీ వీధుల్లోకి వచ్చి గర్జిస్తారు.

సింహం పడుకోనుందికదా అని జూలుతో జడేయకూడదు... ఉద్యోగులు సమ్మె విరమించారు కదా అని ఉదాసీనత చూప కూడదు... కాంగ్రెస్... తస్మాత్ జాగ్రత్త.

# వినియోగదారుడికి విద్యుత్ షాక్

## □ సకాలంలో రీడింగ్ తీయని ఫలితం □ 200 యూనిట్లు దాటితే భారీతేడా

విద్యుత్ సిబ్బంది సకాలంలో రీడింగ్ తీయని ఫలితంగా వినియోగదారుడు విద్యుత్‌షాక్‌తో విలవిలలాడుతున్నాడు. 200 యూనిట్లు దాటిందంటే భారీతేడాతో బిల్లు తడిసి మోపెడవుతున్నది. పెరిగిన విద్యుత్ టారిఫ్ ఒక్కరోజు ఆలస్యమైనా వందల్లో తేడా వస్తోంది. గడువు తేది దాటితే అపరాధరుసుం వేస్తున్నారు. ప్రతి నెలా ఒకే తేదిన రీడింగ్ నమోదు చేసి బిల్లులు ఇవ్వాల్సిన సిబ్బంది. ఇష్టాను సారంగా వ్యవహరిస్తుండడంతో వినియోగ దారుడికి బిల్లులు షాక్‌కొడుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఛార్జీలు పెంచడంతో 200 యూనిట్లు దాటితే బిల్లు తడిసి మోపె డవుతోంది. ఇది పేద, మధ్య తరగతి ప్రజలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది.

మీటర్ రీడింగ్ తీసేందుకు ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. వారు ప్రతినెల ఇళ్ళకెళ్ళి వినియోగించిన విద్యుత్ యూని ట్లును నమోదు చేయాల్సివుంది. కొంత మంది సెలవు పెట్టడంతో తక్కువ సిబ్బందితో పనులు కానిచ్చేయడం పరి పాటిగా మారింది. దీంతో రీడింగ్ తీయడం ఆలస్యం అవుతోంది. విద్యుత్ శాఖ చేసే తప్పులకు వినియోగదారుడు తీవ్రంగా నష్టపోతున్నాడు.

జిల్లాలో విద్యుత్ గృహ వినియోగ దారులు కనెక్షన్లు 8 లక్షల 87 వేల 317 ఉన్నాయి. వీటికి సంబంధించి 5 కోట్ల యూనిట్లు వినియోగమవుతుంది. వీరిలో 50 యూనిట్లలోపు 4.25 లక్షల కనెక్షన్లు, 51 నుంచి 100 యూనిట్లులోపు 2.10 లక్షల కనెక్షన్లు, 101 నుండి 200 వరకు 2 లక్షల కనెక్షన్లు ఉన్నాయి. ఈ కేటగిరి వారు ఎక్కువగా నష్టపోతున్నారు. వీరిలో దాదాపు 50 వేల పైబడి కనెక్షన్లలో మీటర్ రీడింగ్ ఆలస్యంగా తీస్తున్నట్లు సమాచారం. దీంతో వినియోగదారుడు లక్షల్లో నష్టపోతున్నాడు. దీనిపై ఉన్నతాధికా రుల్లో చలనం లేదు. రీడింగ్ సిబ్బందిని అప్రమత్తంగా చేయడంలో నిర్లక్ష్యం వహి స్తున్నారు. రీడింగ్ సిబ్బంది. నిర్లక్ష్యం మూలంగా వినియోగదారులు విద్యుత్ బిల్లు చెల్లింపుల్లో నష్టపోతున్నారు.

# సమైక్యాంధ్ర కోసం ఉపాధ్యాయుల వినూత్న నిరసన

నెల్లూరు గాంధీబొమ్మ కూడలిలో ఈ నెల 15న సమైక్యాంధ్ర ఉపాధ్యాయ పోరాట సమితి ఆధ్వర్యంలో వేపాకు మండలతో అర్ధనగ్న ప్రదర్శనతో రాష్ట్ర విభజన నిర్ణయానికి వ్యతిరేకతను వ్యక్తం చేసారు. రెండున్నర నెలలపైన సాగుతున్న సమైక్యాంధ్ర ఉద్యమ నేపథ్యంలో ఉపాధ్యాయులు సమ్మెను తాత్కాలికంగా విరమించినా ప్రతి రోజు తమ నిరసనను తెలియచేస్తూనే వున్నారు. ప్రజాప్రతినిధులు సమైక్యాంధ్ర ఉద్యమం పట్ల తగిన విధంగా స్పందించి రాజీనామాలు చేయకపోవడం తగదని, ఇప్పటికైనా వారు తమ పదవులను పట్టుకొని వేలాడకుండా రాజీనామాలు సమర్పించాలని కోరారు. బెలూన్లపై రాజకీయ నాయకుల చిత్రాలను అతికించి గాంధీబొమ్మ నుంచి వీఆర్‌సి కూడలి మీదుగా ఏసి సుబ్బారెడ్డిబొమ్మ దాకా ఊరేగించి గాంధీబొమ్మ వద్దకు చేరుకున్నారు. అక్కడ రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సమైక్యాంధ్ర ఉపాధ్యాయులు పోరాట సమితి నాయకులు కృష్ణారెడ్డి, ఉదయభాస్కర్, రమణయ్య, నారాయణ, హజరత్తయ్య, మణి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# గంధవళ్ళకు లండన్ రికార్డ్

నెల్లూరు నగరానికి చెందిన సూక్ష్మ కళాఖండాల సృష్టికర్త, తెలుగు ఉపాధ్యా యుడు గంధవళ్ళ ఉమాశంకర్ తయారు చేసిన ఓ కళాఖండం లండన్ రికార్డును దక్కించుకుంది. సూది రంధ్రంలో పట్టే (4.5మిల్లీమీటర్లు 2.5మిల్లీమీటర్లు) అతి సూక్ష్మమైన చెప్పులజత కళాఖండ ప్రతిభను యునైటెడ్ కింగ్‌డమ్ లండన్‌కు చెందిన "రికార్డు హోల్డర్ రిపబ్లిక్(ఆర్. హెచ్. ఆర్) ప్రపంచ రికార్డు సంస్థ నమోదు చేసింది. ఆర్‌హెచ్‌ఆర్ సంస్థ రికార్డుబుక్‌లో ఉమా శంకర్ పేరును నమోదు చేసింది. ఈ ప్రపంచ రికార్డును గంధవళ్ళ ఉమాశంకర్ బుధవారం నెల్లూరుజిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ చేతుల మీదుగా అందు కున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీకాంత్ ఉమాశంకర్‌ను అభినందించారు. ఇదే స్ఫూర్తితో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించడమే తన ధ్యేయమని ఉమాశంకర్ తెలిపారు.

# నెల్లూరుచెరువు కబ్జాకు కళ్లెం...

## 680 ఎకరాలు స్వాధీనం



కొన్నేళ్లుగా నెల్లూరు చెరువును కబ్జాచేసి అక్రమంగా సాగుచేస్తున్న భూములను నీటిపారుదలశాఖ అధి కారులు ఎట్టకేలకు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే నెల్లూరురూరల్ మండలం కొండ్లపూడి, పొట్టెపాళెం గ్రామాలకు చెందిన కొందరు నెల్లూరు చెరువులో సుమారు 680ఎకరాలను ఆక్రమించి పంటలు వేసుకుంటున్నారు. ఆక్రమణలో ఉన్న చెరువు భూములను స్వాధీనం చేసుకోవాలని నీటిపారుదలశాఖకు హైకోర్టు గతంలో ఉ త్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా మంగళవారం చెరువులో భూములను స్వాధీనం చేసుకునేందుకు నీటిపారుదలశాఖ ఏఈ వేణుగోపాల్‌రావు ఆధ్వర్యంలో రూరల్ సిఐ సుధాకర్‌రెడ్డి సహకారంతో భూముల వద్దకు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో అక్కడ సాగుచేసుకుంటున్న రైతులు అధికారులను అడ్డుకోవడంతో ఉద్రిక్తవాతావరణం నెలకొంది. ఎట్టకేలకు అధికారులు 680ఎకరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏఈ వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ మొత్తం 3500ఎకరాలున్న నెల్లూరుచెరువు గతంలో 20వేల ఎకరాలకు సాగు నీరందించేదని తెలిపారు. ప్రస్తుతం రెండువేల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతోందని వివరించారు.

# నేత్రపర్వంగా శ్రీనివాసుని కల్యాణం



శ్రీవారి జన్మ నక్షత్రం శ్రవణాన్ని పుర స్కరించుకుని తిరుమల తిరుపతి దేవ స్థానములు, హిందూ ధర్మ ప్రచార మండలి సంయుక్త ఆధ్వర్యంలో నెల్లూరు దర్గా మిట్టలోని టీటీడీ కల్యాణ మండపంలో సోమవారం శ్రీనివాసుని కల్యాణ మహోత్సవం నేత్రపర్వంగా సాగింది. వేదపండితులు వేదగిరి ఫణిశర్మ ఆధ్వర్యంలో అర్చక బృందాలు ఉత్సవమూర్తులను కల్యాణ వేదికపై కొలువుదీర్చి విశేషపూజలు, సుగంధద్రవ్యాలతో అభిషేకాలు, గణపతిపూజ, పుణ్యాహవచనం, వరపూజ, సంకల్పం, యజ్ఞోపవీత ధారణ, కన్యాదానం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

వేదపండితుల వేద మంత్రోచ్చారణలతో, మంగళవాయిద్యాలతో శ్రీవారు ఉభయ నాంచారులకు మాంగల్యధారణ గావించారు. అనంతరం మంగళహారతులను సమర్పిం చారు. హాజరైన భక్తులకు శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని పంపిణీచేసారు. ఈ కార్యక్రమంలో ధర్మప్రచార కో-ఆర్డినేటర్ డా॥యం.శ్రీహరి ధార్మిక సలహా మండలి అధ్యక్షుడు సిపీ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, కార్యదర్శి ధనుం జయ, సభ్యులు వాకాటి విజయకుమార్‌రెడ్డి, వీరిశెట్టి సుధాకర్, గిరిజ, ఆలూరి శిరోమణిశర్మ పాల్గొన్నారు.

# పోటీతత్వంతో ప్రతిభ వెలుగు చూస్తుంది

పోటీతత్వంతోనే ప్రతిభ వెలుగుచూస్తుందని, ఈ విషయాన్ని ప్రతి క్రీడాకారుడు గుర్తించాలని బ్యాడ్మింటన్ జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ముక్కాల ద్వారకానాథ్ పేర్కొన్నారు. నెల్లూరునగరంలోని మెక్లిన్స్ క్లబ్ ఇండోర్‌స్టేడియంలో మూడురోజుల పాటు నిర్వహించిన సిఎస్‌ఆర్ జిల్లాస్థాయి నాన్‌మెడలిస్ట్ బ్యాడ్మింటన్ పోటీలు సోమవారంతో ముగిసాయి. వివిధ విభాగాల్లో విజేతలకు ద్వారకానాథ్ బహుమతులను ప్రదానంచేసి మాట్లాడుతూ నెల్లూరుజిల్లాకు చెందిన వర్ధమానక్రీడాకారులు ఉత్తమ క్రీడాకా రులకు తనవంతు సహాయసహకారాలను అందిస్తానన్నారు. నిర్వాహకుడు చంద్ర శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మూడురోజులు నిర్వహించిన టోర్నీలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 120జట్లు పాల్గొన్నాయ న్నారు. విజేతలకు నగదు ప్రోత్సాహకం, జ్ఞాపికలు, షీల్డులు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు పల్లిశెట్టి శ్రీనివాసులు, శ్రీరాంసురేష్, సీనియర్ క్రీడాకారులు, కోచ్ తదితరులు పాల్గొన్నారు.

# అందరూ దొంగలే

(మొదటిపేజీ తరువాయి)

సభలో బిల్లును అడ్డుకుంటామంటే విని చప్పట్లు కొట్టడానికి సీమాంధ్రప్రజలు చెవుల్లో కాలీఫ్లవర్‌లు పెట్టుకుని వున్నారా? తెలంగాణ నోట్‌ను అడ్డుకోలేకపోయారు. తెలంగాణ నోట్‌ను కేబినెట్ ఆమోదించాక కూడా కేంద్రమంత్రులు సిగ్గులేకుండా పదవుల్లో కొన సాగుతున్నారు. రాజీనామా చేసినవాళ్లు కూడా సోనియాగాంధీ బుజ్జగించారంటూ మెత్తపడ్డారు. కొందరు కేంద్రమంత్రులైతే ఈ సీమాంధ్ర ఎటుపోతే మాకేం, మాకు ఓట్లేసిన జనం ఎక్కడ ఛస్తే మాకేంటి.. అధిష్టానమే మా దైవం అంటున్నారు.

తెలుగు ప్రజలకు ఒక రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన ఖ్యాతి అమరజీవి పొట్టి శ్రీరాములు దైతే, ఆ రాష్ట్రాన్ని చీల్చిన ఖ్యాతిని కాంగ్రెస్‌తో పాటు సీమాంధ్ర కాంగ్రెస్ ఎంపీలు తమ ఖాతాలో జమ చేసుకోబోతున్నారు. అమరజీవి పేరు చరిత్రలో నిలిస్తే వీళ్లందరి పేర్లు చరిత్రహీనుల జాబితాలోకి చేరనున్నాయి.

PDF Compressor Free Version



## నెల్లూరు కబుర్లు

## అధికారిక వ్యవహారాలు బంద్

రాష్ట్ర విభజన నేపథ్యంలో తలెత్తిన ఆందోళనలతో జిల్లాలో అభివృద్ధి ప్రక్రియకు తీవ్ర విఘాతం ఏర్పడింది. అభివృద్ధి పనులు, ప్రారంభోత్సవాలు లేకుండా పోయాయి. జిల్లాకు వివిధ శాఖల మంత్రులు రావడం కూడా ఆగిపోయింది. అధికారిక సమావేశాలు, సమీక్షలు నిలిచిపోయాయి. జిల్లాకు చెందిన ఆర్థికమంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇటీవలవరకు జిల్లాలో భారీగా అభివృద్ధి పనులు చేయించారు. నెలలో ఒకట్రెండుసార్లన్నా ఆయన అధికారిక పర్యటనలుండేవి. వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ఆయనే నిధులు తెప్పించేవాళ్లు. శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు సందడిగా జరిగేవి. ఈ ప్రభుత్వానికి పదవీకాలం ముగుస్తున్న తరుణంలో ఆర్థికమంత్రిగా ఈ జిల్లాలో అసంపూర్తిగా మిగిలివున్న పనులకు నిధులు మంజూరు చేయించుకోవడానికి ఆయన కృషి చేస్తున్న సమయంలో విభజన ప్రకటన మూలంగా మంత్రి మీద వ్యతిరేకత వచ్చింది. దీంతో ఆయన జిల్లాలో అధికారిక పర్యటనలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేకపోతున్నారు. విభజన ప్రకటన మన జిల్లా అభివృద్ధికి చేటు తెచ్చిందనుకోవచ్చు.

## సందడి తగ్గింది

ఉద్యోగులకు జీతాల్లేవ్... కార్మికులకు పనుల్లేవు... వ్యాపారులకు వ్యాపారాలు లేవు... అన్నిరకాలా ఆదాయం పడిపోయింది. ఇక దసరా పండుగలో సరదా ఏముంటుంది. రెండు నెలలుగా ఉద్యోగులకు, ఆర్టీసీ కార్మికులకు జీతాలు లేవు. దీని ప్రభావం వ్యాపారస్థుల మీద బాగా కనిపించింది. ప్రతి సంవత్సరం దసరా, బక్రీద్ పండుగలప్పుడు నెల్లూరులోని బట్టల షోరూంలు కిటకిటలాడుతుండేవి. పలు వ్యాపార సంస్థల ప్రారంభోత్సవాలు కూడా ఘనంగా వుండేవి. కాని ఈ సంవత్సరం షోరూంలన్నీ వెలవెలబోయి కనిపించాయి. ఇతర వ్యాపారాల మీద కూడా ఈ ఆందోళనల ప్రభావం బాగా కనిపించింది.



నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనుల విషయంలో జరుగుతున్న ప్రోటోకాల్ అక్రమాలపై జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్‌ను కలిసి ఫిర్యాదు చేస్తున్న వైయస్సార్సీపీ రూరల్ సమన్వయకర్త కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కె.వి.రాఘవరెడ్డి, ముందా బాబ్జి, బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

## సమైక్యాంధ్రకు "జై"

### ప్రమాణ పత్రాలపై సంతకాలు చేసిన ఎమ్మెల్యేలు

సమైక్యాంధ్ర కోసం ప్రజాప్రతినిధులు ముందుకు రావాలని లేకుంటే ప్రజలు క్షమించరని ఏపిఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు రవీంద్రబాబు పేర్కొన్నారు. 12వ తేదీ నెల్లూరు ఎన్జీఓ హోంలో నెల్లూరు రూరల్, నగర ఎమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిల చేత సమైక్యాంధ్రకు కట్టుబడి ఉంటామనే ప్రమాణ పత్రాలపై సంతకాలు తీసుకున్నారు. ఈ ప్రమాణపత్రంలో రాష్ట్ర విభజనపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ చేసిన నిర్ణయాన్ని, కేంద్ర కేబినెట్ ఆమోదించిన తెలంగాణనోట్‌ను తాము అంగీకరించడం లేదని, సమైక్యతను కోరుకుంటున్నామని, రాష్ట్ర విభజనపై శాసన సభలో చర్చ లేదా తీర్మానం వస్తే సమైక్యత అభిప్రాయాన్ని తెలియజేస్తామంటూ సంతకాలు చేసి, ప్రమాణపత్రాలు ఎమ్మెల్యేలు ఎన్జీఓలకు అందించారు. కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డితో కూడా ప్రమాణపత్రాన్ని ఎన్జీఓ నాయకులు స్వీకరించారు. ఎన్జీఓ హోంలో వైద్య విధానపరిషత్ చేపట్టిన రిలే నిరాహారదీక్షలకు రూరల్, నగర ఎమ్మెల్యేలు సంఘీభావం తెలిపారు.

ఈ కార్యక్రమంలో వెంకటరాజు, అంజనేయశర్మ, రమణారెడ్డి, శ్రీధర్, శేఖర్, సతీష్, రాజేంద్ర, మనోజ్‌కుమార్, సంధాని బాషా, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇంజనీర్ల నిరసన

రాష్ట్ర విభజన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 15న నెల్లూరు దర్గామిట్టలోని శబరి శ్రీరామక్షేత్రం నుంచి ఆత్మకూరు బస్టాండు వరకు నీటిపారుదలశాఖ ఇంజనీర్లు బైక్‌ర్యాలీ నిర్వహించి అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు విగ్రహానికి పాలాభిషేకం చేసారు. కార్యక్రమంలో వీరకుమార్, వెంకటసుబ్బయ్య, నాగుల మీరా, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి యోగా పోటీలకు జోషిత



జాతీయస్థాయిలో నవంబర్ 16 నుంచి 20వ తేది వరకు జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో జరుగనున్న జాతీయస్థాయి యోగా పోటీలకు డాక్టర్ కిషోర్స్ రత్నం స్కూలు విద్యార్థిని కె.జోషిత ఎంపికయ్యింది. నెల్లూరు సరస్వతినగర్‌లోని పాఠశాలలో ఆదివారం జోషితకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. స్కూలు డైరెక్టర్ డాక్టర్ కె.కృష్ణకిషోర్ మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లో రాణించి తమ ఉజ్వల భవితకు విద్యార్థులు బాటలు వేసుకోవాలన్నారు. ఈనెల 8 నుంచి 10వ తేది వరకు హైదరాబాద్ ఎల్.బి.స్టేడియంలో జరిగిన 38వ రాష్ట్రస్థాయి యోగా ఛాంపియన్‌షిప్-2013 పోటీల్లో అండర్-14 విభాగంలో జోషిత ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం హర్షణీయమన్నారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వాసంతి కిషోర్, జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, ప్రిన్సిపాల్ కె.వి.డి.మనోజ్‌కుమార్, ఏఓ కె.అనురాధ, మేనేజర్ డి.సునీల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## యోగాలో రెయిన్‌బో విద్యార్థి ప్రతిభ

రాష్ట్రస్థాయి యోగాపోటీల్లో అండర్-11 విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చి రజిత పతకం సాధించిన రెయిన్‌బో స్కూల్ విద్యార్థి ధనుష్‌కు ఈనెల12న నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని పాఠశాలలో అభినందనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ పద్మాసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో అక్టోబర్ 8 నుంచి 10వ తేది వరకు 38వ రాష్ట్ర యోగా ఛాంపియన్‌షిప్-2013 పోటీలు జరిగాయన్నారు. ఇందులో ధనుష్ పాల్గొని ద్వితీయ స్థానం సాధించడం అభినందనీయమన్నారు. ధనుష్‌కు ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి పతకం అందజేసారని ఆమె వివరించారు. నవంబర్‌లో జార్ఖండ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించాడన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ అరుణ స్వయంప్రభ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి సన్నిధిలో మాజీ దొరవారు

మాజీ రాష్ట్ర డీజీపి వేణుంబాక దినేష్‌రెడ్డి 11వ తేదీ రాత్రి నెల్లూరు వచ్చారు. తాళ్ళపూడిలోని ఆయన స్వగృహానికి వెళ్ళి తిరిగి పోలీస్ పెరేడ్‌గ్రౌండ్స్‌లోని అతిథి గృహానికి చేరుకున్నారు. 12వ తేదీ తెల్లవారుజామున 4 గంటల నుంచి ఉదయం11 గంటల వరకు నెల్లూరు దర్గామిట్టలోని రాజరాజేశ్వరి అమ్మవారి సన్నిధిలో దినేష్‌రెడ్డి దంపతులతో పాటు ఆయన మామ బలరామిరెడ్డి కుటుంబసభ్యులు పూజలు నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న మీడియా ప్రతినిధులు దేవస్థానానికి చేరుకున్నారు. కాని దినేష్‌రెడ్డి మాత్రం మీడియాతో మాట్లాడకుండానే వెళ్ళిపోయారు.

## రాజరాజేశ్వరి అమ్మవారి దసరా రాబడి

నెల్లూరు దర్గామిట్టలోని రాజరాజేశ్వరి అమ్మవారికి శరన్నవరాత్రుల్లో 35,50,633 రూ॥లు ఆదాయం లభించింది. నవరాత్రుల్లో భక్తులు సమర్పించిన కానుకలు, టిక్కెట్ల ద్వారా వచ్చిన మొత్తాన్ని మంగళవారం ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. హుండీల ద్వారా 11,54,333రూ॥లు, టిక్కెట్ల ద్వారా 24,26,302రూ॥ల ఆదాయం సమకూరింది. గత యేడాది శరన్నవరాత్రుల్లో మొత్తం 34,55,369రూ॥లు ఆదాయం రాగా ఈ ఏడాది భారీగా ఆదాయం పెరిగింది.

## వైభవంగా సాయి ఆరాధనోత్సవాలు



నెల్లూరు నగరంలోని సాయిబాబా మందిరాల్లో శిరిడీ సాయి 95వ మహాసమాధి విజయదశమి ఆరాధనోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. నెల్లూరు ట్రంకురోడ్డు గాంధీ నగర్, బాలాజీనగర్‌లోని శిరిడీసాయిదర్బార్(అద్దాల మందిరం)లో సాయినాథుని ఆరాధనోత్సవాలు వేడుకగా జరిగాయి. ఆదివారం బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబా వారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకలు, హారతులు, గోక్షీరంతో ప్రత్యేకాభిషేకాలు, మహాసమాధి ఘట్టపారాయణంతో, 95జ్యోతులతో హారతి పల్లకి సేవలు, కోలాటాలు, పండరీ భజనలు తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

## ఫుట్‌బాల్ ఆటకు ప్రాణం పోద్దాం

ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులకు ఫుట్‌బాల్ క్రీడపై మక్కువ కలిగించి వారిని ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు అసోసియేషన్ ప్రణాళికాబద్ధమైన కార్యాచరణకు శ్రీకారం చుట్టిందని ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి, అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారుడు జీపి ఫల్గుణ పేర్కొన్నారు. 13వ తేదీ నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఫుట్‌బాల్ క్రీడకు పూర్వ వైభవం తెచ్చేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. 11ఏళ్ళుగా అసోసియేషన్ వివిధ కారణాల వల్ల వివాదాల్లో చిక్కుకుందని, దీనివల్ల దశాబ్దకాలంగా రాష్ట్రంలో ఫుట్‌బాల్ క్రీడ ఎన్నో ఒడిదుడుకుల్ని ఎదుర్కొందన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారుడు, జిల్లా అసోసియేషన్ వ్యవస్థాపకుడు వివి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షల షెడ్యూలు ఖరారు

సమైక్యాంధ్ర ఉద్యమంలో భాగంగా విక్రమ సింహపురి యూనివర్శిటీ పరిధిలో జరగాల్సిన పరీక్షలు వాయిదాపడ్డాయి. ఇటీవల సమ్మె విరమించిన నేపథ్యంలో పరీక్షల ప్రక్రియపై చర్చించి పరీక్షల షెడ్యూలును విక్రమసింహపురి యూనివర్శిటీ వైస్‌ఛాన్సలర్ రాజారామిరెడ్డి ఆదివారం ఖరారుచేసారు. బిఇడి పరీక్షలు ఈనెల 22 నుంచి 25వతేదీ వరకు జరుగుతాయి. ఎల్ఎల్‌బి 4వ సెమిష్టర్ పరీక్షలు 22, 24తేదీల్లో, ఎంబిఏ, ఎంసిఏ, ఎంబిఏ(టిఎం) ద్వితీయ సెమిష్టర్ పరీక్షలు యూనివర్శిటీ కళాశాల, విఎస్‌యూ పిజీ సెంటర్ కావలిలో 22 నుంచి నవంబర్ 6వతేదీ వరకు నిర్వహించనున్నారు. విఎస్‌యూ అనుబంధ కళాశాల పరీక్షలు 25 నుంచి నవంబర్ 6వతేదీ వరకు జరుగుతాయి. ఎల్ఎల్‌బి సెకండ్ సెమిష్టర్ పరీక్షలు విఆర్ లా కాలేజీలో 25 నుంచి నవంబరు 6వతేదీ వరకు జరుగుతాయి. మూడు సంవత్సరాల డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలు అన్ని డిగ్రీ కళాశాలల్లో 29వతేదీ నుంచి జరుగుతాయి.



PDF Compressor Free Version

లాయర్
ప్రత్యేక శీర్షిక



## కలియుగకర్ణుడు సేవాసామ్రాజ్యంలో ప్రకాశిస్తున్న సేవాసూర్యుడు

మనిషి నిదానం.
అడిగిన వారికి లేదనకుండా
సాయం చేయడం ఆయన విధానం.
ఆపదలో వున్నవారిని ఆదుకోవడమే
ఆయనకు ప్రధానం.
పేద బడుగు బలహీనవర్గాలంటే
ఆయనకు అభిమానం.
ఆయన చేస్తున్న సేవలు
అందిస్తున్న దానధర్మాలు అసమానం.
ఆయన ప్రతి అడుగూ ఓ సంచలనం.
ఆదర్శవంతం ఆయన ప్రస్థానం.
ప్రజల హృదయాలలో
చెరిగిపోనిది ఆయన స్థానం.
ఆయన సేవానిరతికి అంకితం
ఈ 'లాయర్' సంకలనం.


వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

# సేవ ఆయనకి వ్యసనం

వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఈ పేరు తెలియని సేవాసంస్థలు బహుశా ఈ జిల్లాలో బహు అరుదుగా వుంటాయి. వ్యాపారం ఆయన వ్యాపకం సేవ ఆయనకి వ్యసనం. దానానికి పెద్దపీట వేసే నెల్లూరుజిల్లాలో పాతతరం దానధీరుళ్ళందరినీ ఎప్పుడో అధికమించిన దానధీశాలి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి.

**1956**లో వేమిరెడ్డి శివాకోటారెడ్డి శ్యామలమ్మ పుణ్యదంపతులకు అఖరు సంతానంగా ప్రభాకర్ రెడ్డి జన్మించాడు. తామో మగబిడ్డకు జన్మనిచ్చామనుకున్నారే కాని ఆనాడు తమ ఇంట్లో ఓ యుగ పురుషుడు జన్మించాడని వాళ్ళు భావించి వుండరు. తమ బిడ్డ భవిష్యత్తు బాగుండాలనే సంకల్పంతో జిద్దు కృష్ణమూర్తి ఫౌండేషన్‌లో నిర్వహించబడే రిషివ్యాలి స్కూల్‌లో తమ చిన్నారిని చేర్పించి వుంటారేమో గాని ఆ చిన్న కుర్రవాడు నెల్లూరుజిల్లాలో "సేవ"కు చిరునామాగా మారతాడని బహుశా వాళ్ళు వూహించి వుండకపోవచ్చు.

(మిగతా VIIIవ పేజీలో)



ప్రభాకర్‌రెడ్డి అమ్మ నాన్న శ్యామలమ్మ శివకోటారెడ్డి

PDF Compressor Free Version





"కన్ను తెరిస్తే జననం... కన్ను మూస్తే మరణం... రెప్పపాటు ఈ జీవితం" అని మహాకవి ఎప్పుడో ప్రవచించారు. కాని ఆ రెప్పపాటు జీవితంలోనే అద్భుతాలు సృష్టించ వచ్చని మహాద్భుతాలు చేయవచ్చునని నిరూపించారు ఎందరో మహానుభావులు. ఆ రెప్పపాటు జీవితంలో చేసిన కృషితోనే మానవులు మాధవులై వున్నారు. మహానీయులైవున్నారు. మానవాళికే మార్గదర్శకులై నిలిచారు.



స్వర్ణభారత్ ట్రస్ట్‌లో బాబా రాందేవ్, వెంకయ్యనాయుడుల నడుమ ప్రభాకర్‌రెడ్డి

# సరిరారు నీకెవ్వరూ...
# ఓ సేవా ప్రభాకరా...

జీవితం అనేది మనం మలచుకునేదాన్ని బట్టే అందంగాగాని, అందవికారంగా గాని వుంటుంది. నేను మాత్రమే సంతోషంగా వుంటే చాలు అని కోరుకునేవాడు జీవితంలో ఎప్పుడు సంతోషపు సాగరాన్ని చూడలేడు. నా సంతోషం కంటే నా చుట్టుపక్కలవాళ్లు సంతోషంగా వుండడమే నాకు ముఖ్యమని కోరుకున్న విశాలహృదయంగలవాళ్లు ఎప్పుడూ సంతోషంగానే వుంటారు.

పదిమందితో కలిసి నవ్వడం, జీవించడం, వారి కష్టసుఖాలలో మనమూ తోడూనీడై జీవించడం... ఇదీ సమాజజీవనం. తానే కాదు, తన చుట్టూ వున్న సమాజం కూడా సంతోషంగా, సరదాగా వుండాలని కోరుకునే మానవీయశక్తి, విలువలున్న వ్యక్తి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి. మానవసేవలోనే మాధవసేవ వుందని, ఆ దిశగా కృషి చేస్తున్న సమాజసేవకుడు. తన జేబులోని రూపాయి తనకంటే ఎదుటివారి అవసరాలకు ఉపయోగపడాలని కోరుకునే ఉదారవాది. ఆయన మనిషేకాదు మనసు కూడా అంతే మెత్తనిది. మాట్లాడేది తక్కువ, చేసేది ఎక్కువ.

దొడ్ల సుబ్బారెడ్డి, రేబాల లక్ష్మీనరసారెడ్డి వంటి గొప్పదాతలకు జన్మనిచ్చింది నెల్లూరు. వారి స్ఫూర్తిని పొంది, వారి మార్గంలో పయనిస్తున్నవారిలో ప్రభాకర్‌రెడ్డి ఒకరు. సమాజసేవకు, పదిమంది సంతోషానికి ఆయన చేసిన సేవాకార్యక్రమాలు, ఇచ్చిన విరాళాలే ఇందుకు నిదర్శనం.

ఆయన చేసిన సేవాకార్యక్రమాలను పరిశీలిస్తే అవి ఒక వరదప్రవాహాన్నే తలపిస్తాయి.

ప్రతి మనిషికీ జీవితంలో ఆఖరు మజిలీ శ్మశానం. తల్లి కడుపులో నుండి బయటకొచ్చి కన్ను తెరుస్తాం. కన్ను మూసాక పుడమితల్లి కడుపులోకి చేరుతాం. కాని మనిషి చివరి మజిలీని కూడా ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించాలనే ఉద్దేశ్యంతో రోటరీక్లబ్ వారు నెల్లూరు బోడిగాడితోటలో అత్యాధునిక వసతులతో స్వర్గధామం శ్మశాన వాటికను నిర్మించడం జరిగింది. ఈ శ్మశాన వాటిక నిర్మాణం తలపెట్టినప్పుడు నేను కూడా ఇందులో భాగస్వామ్యుడినవుతానంటూ ముందుగా ముందుకొచ్చి10లక్షలరూపాయలు విరాళమిచ్చిన దాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి. అంత్యక్రియల సంస్కారాల్లో పాల్గొనేందుకు ఇక్కడకు వెళ్లిన వారెవరైనా సరే ఈ ప్రాజెక్ట్‌ను, దాతలను అభినందించకుండా వుండలేరు.

సమాజసేవల్లో ప్రభాకర్‌రెడ్డి చేయి అందుకోని రంగం, ఆయన చేయూతనివ్వని సంస్థ అంటూ నెల్లూరుజిల్లాలో ఉండదేమో! క్రీడారంగానికి తనవంతు సహకారమందించే క్రమంలో స్టేడియంలో అభివృద్ధి పనులకు ఆయన 10లక్షల రూపాయల విరాళాన్ని జిల్లా క్రీడామండలికి అందజేశారు. అలాగే నెల్లూరు, పోలీస్‌పరేడ్ మైదానంలో బాస్కెట్‌బాల్ కోర్టు ఏర్పాటుకు 6లక్షల రూపాయల విరాళమిచ్చి పోలీస్ క్రీడాకారులకు చేయూతనిచ్చారు.

అన్నం పరబ్రహ్మస్వరూపం అంటారు. మురళీకృష్ణ హోటల్స్ వ్యవస్థాపకులు, రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో లక్షల మందికి తన చేతివంట రుచిచూపించిన అన్నదాత గ్రోసు గోపాలయ్య నెల్లూరు, మైపాడుగేటు వద్ద మాతా అన్నపూర్ణేశ్వరి వృద్ధాశ్రమాన్ని నెలకొల్పి ఎంతోమంది అనాధవృద్ధులను చేరదీసి ఆశ్రయంకల్పించారు. ఇక్కడ అనాధవృద్ధులను తల్లిదండ్రులుగా భావించి, వారికి దేవుడిచ్చిన బిడ్డగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈ ఆశ్రమానికి 5లక్షల రూపాయల విరాళమిచ్చి ఇక్కడ ఏడాదిలో ఒక మాసం(ఆగష్టు) పూర్తిగా భోజన ఖర్చులు ఆయనే భరిస్తున్నాడు. మానసిక, అంగవైకల్యంతో బాధపడే పిల్లల సంక్షేమం కోసం ప్రగతిఛారిటీస్‌కు 2లక్షల రూపాయలు విరాళంగా ఇచ్చారు. ఇక్కడ కూడా యేడాదిలో ఒక నెల(మార్చి) భోజన ఖర్చులు పూర్తిగా ఆయనే అందిస్తున్నారు. రామ్మూర్తినగర్‌లో సత్యసాయి మందిరం వరకు తన తండ్రి వేమిరెడ్డి శివకోటారెడ్డి పేరుతో రోడ్డు వేయించారు. ఇక నెల్లూరులోని ఇస్కాన్ మందిరంతో ఆయనకున్న అనుబంధం చెప్పలేనిది. నెల్లూరు పరిసర ప్రాంతాల పాఠశాలలకు, ఆసుపత్రులకు ఇస్కాన్ వారే రుచికరమైన భోజనం అందిస్తున్నారు. వారు భోజనం తీసుకెళ్లేందుకు అనువుగా 5లక్షల రూపాయల సొంత నిధులతో 'మాక్స్‌పికప్' యుటిలిటి వాహనాన్ని కొనుగోలు చేసి విరాళంగా అందించారు.

అనాథబాలలకు, బిడ్డలకు భారమై దూరమైన వృద్ధులకు ఆసరాగా నిలిచిన వాత్సల్య సంస్థకు రూ.10లక్షలతో భవన నిర్మాణానికి సహకరించి ప్రతి సంవత్సరం మార్చిమాసం మొత్తం వారి భోజనానికి అయ్యే ఖర్చు మొత్తం కూడా ప్రభాకర్‌రెడ్డి భరిస్తారు.

ఇలా చెప్పుకుంటూ పోతే ఆయన చేసిన సేవాకార్యక్రమాలు, ఇచ్చిన విరాళాల గురించి చెప్పడానికి ఒక పూట పడుతుంది. వ్రాస్తే అది వంద పేజీల పుస్తకమవుతుంది. ఆయన చేసిన సేవా కార్యక్రమాలు మన కంటికి కనిపించేవి కొంతే, కనిపించనిది కొండంత. ఎదుటివారి బాగులోనే తన సంతోషాన్ని వెదుక్కునే వ్యక్తి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి. ఇలాంటి వారు వూరికొకరుంటే మనకు ప్రభుత్వాలతోనే పనివుండదు.



వేమిరెడ్డి దాతృత్వంతో రూపుదిద్దుకున్న వాత్సల్య భవనం

PDF Compressor Free Version







## భావితరాలకు మార్గదర్శి

# వితరణకే భాష్యం చెప్పిన వేమిరెడ్డి

## స్ఫూర్తిదాతల విగ్రహాలకు ఈయన దాత

సమాజాన్ని జాగృతం చేయాలని ఎంతగానో పరితపించి ఆ తపస్సులో తనువు చాలించిన వ్యక్తులు ఎందరో! వారు భువిపై వెలసిన మహానుభావులు వారి యశశ్చంద్రికల్ని ప్రజలకు నిత్యస్ఫూర్తి రగిలిస్తూనే ఉంటుంది. అలాంటి వ్యక్తుల విగ్రహాలు, ప్రతిమలు ప్రజలకెప్పుడూ ప్రేరణగా నిలుస్తాయి. వారిని ఆరాధించడం అంటే వారిని అభిమానించడం అంటే సన్మార్గంలో నడవడమే అవుతుంది. అలా వారిని నిత్యం స్మరించుకునేలా వారి కార్యక్రమాల్ని మననం చేసుకొనేలా వారిని కళ్ళెదుట నిలిపే మహోన్నత కార్యక్రమాన్ని చేపట్టి వివిధ కూడళ్ళలో వారి విగ్రహాల్ని ప్రతిష్టింపజేసిన అనన్య సామాన్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి.

ఆయన వితరణ కొత్తపుంతలు తొక్కడం విశేషం. వితరణ వ్యక్తులకుగాక సంఘాన్ని మేల్కొలిపేలా, సామాజిక వికాసానికి తోడ్పడేలా చేయగల ప్రతిభావంతుడు వేమిరెడ్డి. భావితరాలకు నిరంతర చిరంతన ఉద్దీపన కల్గించే వైశిష్ట్యాన్ని కన్నుల్లో నింపుకొని, నైర్మల్య మనస్సుతో సామాజిక సేవకోసం పరితపిస్తున్న అభినవ దానకర్ణుడు శ్రీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి.

భౌతికంగా ఉన్నా లేకున్నా తమ విశిష్టతలే సమాజాన్ని వెన్నుతట్టి మేల్కొలిపే విధంగా నడచి వ్యక్తులశక్తుల ప్రతిమలు ఛాయాచిత్రాలు మనోజ్ఞంగా భాసిల్లుతుంటాయి. స్వాతంత్ర పోరాటానికి సారథ్యం వహించి జాతిని ముందుకు నడిపించి తన అహింసా వ్రతం పదునైన ఆయుధంగా బ్రిటీషు పాలకులపై ఎక్కుపెట్టిన మహోన్నత ఆదర్శానికి ప్రతీకగా మహాత్మాగాంధీ భారతీయుల గుండెల్లో కొలువు కావడమే కాక విదేశాల్లో సైతం అహింసావ్రతాన్ని యునైటెడ్ నేషన్స్‌లోని 114సభ్యదేశాలు తీర్మానించడం చూస్తే ఈ అణుయుగాన్ని ఆయన ఎంతగా ప్రభావితం చేశారో అర్థమవుతుంది. అందుకే ఆయన్ను బాపూజీగా కీర్తించడం ఆరాధించడం! గాంధీ విగ్రహం లేని భారతదేశ అసెంబ్లీ భవనాలు లేకపోవడం ఆ మహనీయుని సందేశ వ్యాప్తికి సముచిత నిదర్శనం. అలాగే శ్రీ రామచంద్రుడు దేవాలయాలు లేని ఊళ్ళు ఉండకపోవడం ఆయన ఆదర్శాన్ని పరివ్యాప్తి చేయడమే అవుతుంది. వీరిద్దరూ సామాజిక వైతాళికులు వారి సందేశం గుండెదీపమై ఎన్ని తరాలకైనా వెల్గులు పంచుతూనే ఉంటుంది. అలాగే అల్లూరి అమరజీవిలాంటి వ్యక్తులు కూడా! ఆ మహోన్నత ఆశయాన్ని తన హృదయాల్లో నింపుకొని తనదాతృత్వ కాంతులు జాతికి వెల్లుబాట వేయాలన్న తపనతో ముందుకు సాగుతున్న అపురూపమైన వ్యక్తి శ్రీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి.

గురజాడ నుండి బెజవాడ దాకా అని కీర్తించబడ్డ నెల్లూరు కీర్తికేతనం బెజవాడ గోపాలరెడ్డి రాజకీయాల్లో నిష్కల్మషంగా, స్వచ్ఛతకు మారుపేరుగా భాసిల్లిన మహోన్నతుడు. బెజవాడ తన బ్రతుకే బృందావనం చేసి వేణుగానం వినిపించి జాతిసేవలో నిత్యం తరించిన 'గోపాలుడాయన'. తన వ్యక్తిత్వమే ప్రామాణికంగా లోకానికి చాటిన సుగుణగుణసంపన్నుడు. ఆ చైతన్యమూర్తి సాహితీదీప్తి విగ్రహాన్ని మాగుంట లే అవుట్ నడిబొడ్డున స్థాపించి నెల్లూరీయులు ఆయన గొప్పతనం శాశ్వతంగా గుర్తుండేలా చేసిన వ్యక్తి వేమిరెడ్డి. తుర్లపాటి అన్నట్లు బెజవాడ సాధారణ వ్యక్తికాదు, అసాధారణ ప్రతిభాశాలి. ఆయనో స్టేట్స్‌మెన్. అవినీతికి ఆమడదూరంగా తాను నమ్మిన సిద్ధాంతాన్ని జీవించినంతకాలం పాటించిన అద్వితీయ మూర్తి ఆయన. ఈ కాలం రాజకీయ నాయకులు ఆయన్నుంచి నేర్చుకోవలసింది ఎంతైనా ఉంది. ఆ మహనీయకీర్తి పతాక రెపరెపల్ని మన కళ్ళెదుట నిలిపి రాజకీయాల్లో విలువల అవసరాన్ని నిత్యం గుర్తుచేయడానికి బెజవాడ విగ్రహాన్ని నిలిపిన ప్రభాకరరెడ్డి ధన్యజీవి.

ప్రజల జీవితాలు రాజకీయ నాయకుల చేష్టల పైనే ఆధారపడి ఉంటాయి. కలుషితమైపోతున్న నేటి రాజకీయ చీకట్లలో బెజవాడలాంటి వ్యక్తుల నీడలే ఉషస్సులై వెలుగులు ప్రసరింపజేస్తాయి. జిజియా బాయి వీరుల గాథలు విన్పించే ఈ దేశానికి వీరశివాజీనందించినట్లు ఇలాంటి సమున్నతుల చరితలే రాజకీయాల్ని పునీతం చేస్తాయి. ప్రక్షాళనకు ఎంతగానో దోహదం చేస్తాయి. ఇలాంటి కల్మషాన్ని కడిగివేయాలని, సరికొత్త సమాజాన్ని కలలుకన్న గొప్ప దార్శనికుడు వేమిరెడ్డి. అందుకే వితరణ శీలత్వానికి ఆయన నూతన రూపురేఖలు దిద్దాడు. వితరణకో సరికొత్త అర్థాన్ని ప్రతిపాదించాడు. అందుకే వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి నెల్లూరీయుల గుండెల్లో కొలువైనాడంటే అతిశయోక్తి కాబోదు. నడిచే దాతృత్వం ఆయన. సింహపురి కీర్తికేతనం ఆయనే!

తన పేరుకు తగినట్లుగానే ప్రభాకరుడై లోకానికి వెల్గులు పంచుతున్న ప్రతిభామూర్తి ఆయనే! అభినందనీయుడు వేమిరెడ్డి.

తనగానంతో చిరస్మరణీయత సాధించిన ప్రాతఃస్మరణీయుడు ఘంటసాల. ఆయన విగ్రహాన్ని 'కళాక్షేత్ర'లో ప్రతిష్టింపజేశారాయన. అలా అమరమైన పాటను ప్రజల హృదయాల్లో ఆవిష్కరించిన ఘనత ప్రతిభా ప్రభాకరునిది. ఆంధ్రదేశంలో ఘంటసాల పాట విన్పించకనే తెల్లారదు. ఆయన గానామృతంలో తేలియాడిన ఆంధ్రులకు ఆయన ఎంతటి గొప్పగాయకుడో తెలుసు. ఆ మధురగాయకుని స్మరించుకొనేలా....తలపుల్లో కలకాలం నిలుపుకొనేలా చేసిన వ్యక్తిత్వం వేమిరెడ్డిగారిది. ఇందుకు నెల్లూరీయులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గారికి ఎంతగానో ఋణపడి ఉంటారు.

ఆయన స్థాపనలో మరో ఆణిముత్యం ఆయన ఆధ్వర్యంలో నెల్లూరు నూతన ట్రంకురోడ్డు మాగుంట లే అవుట్ రూపురేఖల్ని మార్చి అన్నమయ్య సర్కిల్‌గా కీర్తింబడేలా పదకవితా పితామహుడు, శ్రీ వెంకటపతిపై సంకీర్తనలు వెలయించిన శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యులు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దాతృత్వంతో వెలసిన అన్నమయ్య విగ్రహం ఆధ్యాత్మిక పరిమళాల్ని వెదజల్లుతూ ఆ ప్రాంతాన్ని ఒక కమనీయ ప్రదేశంగా మార్చిన వైనం ఆశ్చర్యం కల్గించకమానదు.

కలియుగ దైవం వెంకటేశ్వరుని దివ్య నామస్మరణలో తాదాత్మ్యం చెందిన భక్తవరేణ్యుడు అన్నమయ్య రగిల్చిన భక్తిభావం ఈనాటి సమాజానికి ఎంతైనా అవసరం. వర్తమాన పరిస్థితుల్లో ఈ సమాజాన్ని మార్పుగల్గించి ఆధ్యాత్మికత మాత్రమే. స్వార్థం ధనసంపాదన కోసం అడ్డదారులు తొక్కడంలాంటి నిత్య కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయగల్గేది ఆధ్యాత్మికతేనన్నది నిర్వివాదాంశం. లోకానికి ఆధ్యాత్మిక వెలుగులు నింపాలనే సదాశయమే అన్నమయ్య విగ్రహ ప్రతిష్ఠాపనకు వేమిరెడ్డిని పురికొల్పింది. అన్నమయ్యలాంటి ఆధ్యాత్మికమూర్తుల భావజాలాన్ని ప్రచారంలోకి తేవాల్సిన అగత్యాన్ని గుర్తించడంలో వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి చూపిన చొరవ ఎంతైనా అభినందనీయం.

సామాజిక సేవలో తరించిన ఆదర్శమూర్తులు సావిత్రిభాయి పూలే, జ్యోతిరావు పూలే. వారి విగ్రహాల్ని మినీబైపాస్‌లో ప్రతిష్టింపజేసారాయన. ఆ ఆదర్శదంపతుల్ని నెల్లూరీయుల గుండెల్లో ప్రతిష్టింపజేసిన మహనీయత వేమిరెడ్డి గారిదే! వీరు సామాజిక సేవలో తరించిన ఉన్నతికి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దాతృత్వం అద్దంపట్టింది. ప్రజాభ్యుదయనేతల అడుగుజాడల్ని నెల్లూరీయుల లోగిళ్ళలో నిల్పి...వారి సందేశం ఊరూవాడా విన్పించిన ఘనతర చరిత శ్రీ వేమిరెడ్డిదే.

తన సంపదను సద్వినియోగం చేస్తున్న మహోన్నత ధీశాలి వేమిరెడ్డి. చరిత్రగతిని తన వితరణతో ప్రభావితం చేస్తున్న సేవా ప్రభాకరుడు, అభినవదానకర్ణుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి. భావితరాలకు ఆయనో మార్గదర్శి. నెల్లూరీయుల అభిమాన సంపదను దోచుకొన్న వితరణశీలి నడిచే మానవతా శక్తి ఆయన. మన గుండెల్లో కొలువైన మహానుభావుడాయన!






PDF Compressor Free Version














# ఆనందవేడుకల

# శుభసందర్భాలకు

# VPR కన్వెన్

ఆకాశమంత పందిరి క్రింద భూదేవంత పీటలపై పెళ్ళి... అంటూ అనేక సందర్భాల్లో గొప్పవాళ్ళ పెళ్ళిళ్ళ గురించి మనం వింటూవుంటాం. అలాంటి అరుదైన ఆర్భాటాలను సామాన్యుడి ముంగిట్లో ఆవిష్కరించి నెల్లూరీయుల గుండెల్లో కొలువైపోయాడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి. తమ రాజ్యపు పట్టపు రాణి కోసం కోట్లు వెచ్చించి కోటలు నిర్మించిన చరిత్ర ఆనాటి రాజులదైతే తనకు జన్మనిచ్చినగడ్డలో తన వూరివారి కోసం కోట్లు కుమ్మరించి స్వర్గధామాన్ని అందించిన ఘనమైన చరిత్ర ఈయనది.

నెల్లూరు రూరల్ కనుపర్తిపాడులో గొలగమూడికి వెళ్ళే దారిలో 81/2ఎకరాల విస్తీర్ణంలో విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ పేర ఆయన నిర్మించిన భారీ సముదాయం నేడు యావత్ రాష్ట్రంలోనే టాక్ ఆఫ్ ది స్టేట్‌గా మారి నెల్లూరు జిల్లాలో ఓ యాత్రాస్థలంగా అవతరించబోతోందంటే అతిశయోక్తికాదేమో.

కొన్ని దశాబ్దాలక్రితం హైదరాబాదు నగరానికెళ్తే అక్కినేని నాగేశ్వరరావు, తిక్కవరపు సుబ్బరామిరెడ్డిల ఇళ్ళకు టూరిస్టులను బస్సులలో తీసుకెళ్ళి చూపించేవారు. నేడు నెల్లూరులో అలాంటి ఆకర్షణ విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌కి రాబోతోందంటే అది నమ్మలేని నిజం. రేపటి రోజున మనందరం చూడబోయే వాస్తవ దృశ్యం.

శుభకార్యాలను చేసుకోవాలంటే ఆ ప్రాంగణం ఎలా వుండాలో ఎంతటి ఆహ్లాద భరితంగా రూపొందాలో ఎంతటి సౌకర్యవంతంగా నిర్మించాలో ప్రతి అంగుళంలో చేసి చూపించాడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి. ఏదో చేశాం ఏదో చేసేద్దాం అనేలా కాకుండా ప్రతి విషయంలోనూ తానే స్వయంగా ప్రత్యేక శ్రద్ధ వహించి తన కలల ప్రాకారాన్ని తీర్చిదిద్దాడు.

60వేల చదరపు అడుగులలో నిర్మితమైన ఈ సువిశాల భవనంలో 15000 అడుగుల మెయిన్ హాల్‌లో రెండువేల మంది ఒకేసారి కూర్చుని ఏ శుభవేడుకనైనా వీక్షించవచ్చు. మరో 15000అడుగులలో వెలసిన డైనింగ్‌హాల్ ఎంతమందికైనా సునాయాసంగా వసతికి కల్పించగలిగేలా రూపుదిద్దుకుంది. కేవలం పెళ్ళిళ్లకీ రిసెప్షన్‌లకే పరిమితం కాకుండా ఏ చిన్న శుభకార్యా న్నైనా ఈ ప్రాంగణంలో జరుపుకోవడానికి వీలుగా ఎక్కడికక్కడ హాల్ స్థాయిని కుదించి 10వేలు లేదా 5వేల అడుగులలో హాల్ పరిణామాన్ని తగ్గించుకోవడానికి వీలుగా పార్టిషన్‌లను ఏర్పాటుచేశారు.





# ...ద్దాల మందిరం ...ందాల మండపం

# ...్షన్ సెంటర్



5 నక్షత్రాల హోటల్‌ను మరపించేలా రెండు స్వీట్‌రూములు 8డీలక్స్ గదులు ఇక్కడ వేడుకలు చేసుకునే ...రికి వసతిని కల్పించడానికి అందంగా ముస్తాబు చేసి వుంచారు. మెయిన్ హాల్‌కి అనుసంధానం చేస్తూ ...ండు విశాల గదులను పెళ్ళికుమారుడు పెళ్ళి కుమార్తెల కోసం ఏర్పాటుచేశారు.

ఈ భవనంలోపల అడుగు పెట్టీపెట్టగానే మనకు కన్పించే రిసెప్షన్ హాల్ సైతం దాదాపు 5వేల ...డుగులకు పైగా స్థలాన్ని కేటాయించి నిర్మించారంటే ఈ హాల్ రూపకల్పన ఎంతటి ముందుచూపుతో ...రిగిందో మనం వూహించుకోవచ్చు.

ఇక ఇక్కడ ఉపయోగించిన ఫర్నీచర్ మొత్తం విదేశాల నుండి తెప్పించారు. కోట్లాది రూపాయల ...ర్చుతో అలంకరించబడిన ఈ ప్రాంగణంలో కిచెన్‌ని, 7నక్షత్రాల హోటల్స్‌లో వున్న అత్యాధునిక ...ంట సామాగ్రితో ఆహూతులకు రుచితో పాటు శుచికరమైన ఫలహారాలను అందించడానికి ...లుగా సిద్ధం చేశారు.

ఇక 50మంది నుండి 5000మంది వరకూ తమ కుటుంబ వేడుకలను లేదా తమ ...ంస్థల వార్షికోత్సవాలను లేదా సాంస్కృతిక సంబరాలను జరుపుకోవడానికి వీలుగా ...చ్చని లాన్స్‌ను నందనబృందావనంలా తీర్చిదిద్దారు. ఆహూతులకు ఎలాంటి ...సౌకర్యం కలుగకుండా అతి విశాలమైన ప్రాంగణంలో 500లకు పైగా కార్లు ...ర్కింగ్ చేసుకోగలిగేలా పార్కింగ్ సదుపాయాన్ని కల్పించి, ఇన్‌గేట్, అవుట్‌గేట్లను ...ర్పాటు చేశారు.

భవిష్యత్‌లో తమ ఇంట శుభకార్యాల్ని ఫలానా వి.పి.ఆర్ కన్వెన్షన్‌లో ...సుకున్నాం, తమ సంస్థ వార్షికోత్సవం ఫలానా హాల్‌లో జరిగింది. తమ ...డ్డ జన్మదినం ఫలాన చోట చేశాం అని అన్ని వర్గాల వారూ గర్వంగా ...ప్పుకోగలిగే స్థాయిలో ఈ వి.పి.ఆర్ కన్వెన్షన్ సెంటర్ అవతరించింది.

ఇలాంటి అద్భుతమైన అపురూపమైన శుభవేడుకల నిలయాన్ని ...ల్లూరీయులకు అందించిన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి జన్మ ధన్యమైతే, ప్రభాకరరెడ్డి లాంటి వ్యక్తి నెల్లూరులో జన్మించడం నెల్లూరీయులు ...సుకున్న పుణ్యమే అని చెప్పొచ్చు ప్రభాకర్‌రెడ్డికి "లాయర్" శుభాకాంక్షలు.





PDF Compressor Free Version



### అరుదైన కళాపోషకులు

# వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



కళలపట్ల మక్కువతో కళా కారుల పట్ల ఆదరాభిమా నాలు చూపే కళాపోష కులు ఈ కలికాలంలో కానరా వడం అరుదే. అటువంటి వారిని వెతికినా కనపడని రోజులివి. కాని కళల కాణాచి అయిన నెల్లూరులో కళలకు ప్రాముఖ్యతనిచ్చి కళాకారు లను ప్రోత్సహించే కళాభిమా నులు కొందరుండడం విశేషం. ఆ కొందరిలో భారి విరాళాలతో ప్రత్యేకత చాటుకునే వ్యక్తి, శక్తి, అపరదానకర్ణుడు ప్రముఖ పారిశ్రామికవేత వేమిరెడ్డి అని ఘంటాపథంగా చెప్పవచ్చు. కళలకు ప్రాణమిచ్చి కళాకారుల నైపుణ్యాలను వెలికి తీసే విధంగా వినూత్నంగా ప్రదర్శలను నిర్వహించే కళాంజలి సంస్థను ఆయన ప్రోత్సాహించి పాడుతాతీయగా -2013 చిన్నారులతో "కళాంజలి స్వరఝరి" కార్యక్రమం నెల్లూరు టౌనుహాలులో జరిపేలా చూడడం ఎందరో రసజ్ఞులను ఆనందపరిచింది. అలాగే అమర గాయకులు, తెలుగునేల పులకించేలా తన స్వర సంచలనం సృష్టించిన ఘంటసాల వెంకటేశ్వరరావును స్మరించుకునేలా ప్రతిఏటా ఘంటసాల వర్ధంతిని క్రమం తప్పకుండా నిర్వహించే గాయకుడు కె.ఆనందరావు నిర్వహణలో జరిగే కార్యక్రమానికి తన సహాయాన్ని అందించి తనది ఎముకలేని చేయి అనిపించుకున్నారు దానశీలి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి. ఇటువంటి కళాపోషకులు నెల్లూరులో వుండడం మనందరికీ ఆనందదాయకం. మచ్చుకి మాత్రమే ఈ కళాసంస్థలను ఉదహరించడం. ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణకు ఆయన వెన్నుదన్నుగా నిలిచినట్లు ప్రతీతి. ఆయన కళాసంస్థలను ప్రోత్సహిస్తూ చేసిన ఆర్థిక సాయం బయటకు వెల్లడైనది కొద్ది మాత్రమే. ఈ చేతితో చేసిన సాయం ఆ చేతికి తెలియకుండా లెక్కకు మించిన విరాళాలతో నెల్లూరులో, చెన్నైలో సాంస్కృతిక వైభవం పరిఢవిల్లేలా గుప్త దానాలు చేసిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కీర్తి అజరామరంగా నిలుస్తుంది. పదికాలాల పాటు ఆయన సమున్నతంగా, ఆరోగ్యంగా ఆనందంగా సుఖసంపదలతో తులతూగుతూ కళలను ప్రోత్సహిస్తూ సంతోషంగా వుండాలని లాయర్ ఆకాంక్షిస్తోంది.

# వైద్యసేవలకు వేమిరెడ్డి విశేషకృషి




"వైద్యోనారాయణో హరి" అన్నారు. ఈనానుడి వైద్యసేవలకు వేమిరెడ్డి చేసిన విశేష కృషికి అద్దం పడుతుంది. నేడు ఇతర దేశాలలో విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యతలిస్తున్నారు. ఇతర దేశాలతో పోల్చు కుంటే భారతదేశంలో విద్యవైద్యానికి అనుకున్నంత ప్రాధాన్యతలేదు.

సామాన్య మానవుడు కార్పొరేట్‌స్థాయి ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకునే స్థితిలేదు. ప్రభుత్వాసుపత్రుల్లో సేవలు అంతంత మాత్రమే. తీవ్రమైన వ్యాధులతో బాధలుపడుతూ, నయంకాక ఆర్థిక సంక్షోభంతో విలవిలలాడుతున్న పేద మధ్యతరగతుల ప్రజల బాధలు చూసి చలించిన ప్రముఖ వ్యాపారవేత్త, దానదాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి. వైద్యసేవలు, వైద్యరంగానికి సామాన్య మానవునికి చేతనైనంత సహాయం చేసేందుకు నడుంకట్టి ఎన్నో దానధర్మాలు విరాళాలు అందించారు. 1600మానసిక వ్యాధిగ్రస్తులైన పిల్లలకు సేవలందించే తమిళనాడు స్పాస్టిక్ సొసైటీకి కార్యదర్శిగా ఉంటూ విశేష కృషి చేస్తున్నారు. దీనివల్ల మానసిక వికలాంగులైన అభాగ్యులకు తనవంతు సేవ చేస్తున్నాననే సంతృప్తి చెందడమేకాకుండా, వారు మరలా కొత్త జీవితాన్ని పొందాలనే ఆశయంతో వేమిరెడ్డి ఆ సొసైటీకి సేవలందిస్తున్నారు. భయంకరమైన గుండె జబ్బుల వ్యాధులతో క్షణాల్లో ప్రాణాలు పోగొట్టుకుంటున్న అభాగ్యులకోసం నెల్లూరు జయభారత్ ఆసుపత్రిలో గుండె వ్యాధుల చికిత్సకు అవసరమైన స్కానర్ కలర్‌డాప్లర్ కోసం 15లక్షల రూపాయలు విరాళాన్ని అందించారు. గుండెజబ్బులతో మరణించే పేద మధ్య తరగతి ప్రజలు ఈ పరికరాలు వల్ల కొంత వరకు ఉపశమనం పొందేందుకు అవకాశం కల్గుతున్నది. గుండెజబ్బుల వ్యాధుల నుండి బయటపడే వారికి పరోక్షంగా వేమిరెడ్డి దోహదపడుతున్నారు. ప్రమాదాల్లో అవయవాలు పోగొట్టుకుని జీవితాంతం నిస్సహాయస్థితిలో మరొకరి మీద ఆధారపడుతూ బతుకు బండిని ఈడ్చే వారి కోసం నెల్లూరుజిల్లా వెంకటాచలం మండలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో కృత్రిమ అవయవాల తయారీకి కేంద్రానికిగాను 5లక్షల రూపాయలు విరాళాన్ని అందించారు వేమిరెడ్డి.

సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్నారు. మానవునికి అన్ని అవయవాలకంటే కన్ను ప్రధానమైంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్య విభాగానికి ఆపరేషన్ థియేటర్ నిర్మాణానికిగాను విరాళాన్ని అందించారు. స్వర్ణభారత్‌లో ఇంకా ఆయన అందించిన సేవలు అనేకం వున్నాయి.

కాలేయవ్యాధితో బాధపడుతూ చావుబ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతూ వైద్యం చేయించుకునే స్థోమతలేని వ్యాధిగ్రస్థులెందరినో ఆర్థికసాయంతో ఆదుకున్న ప్రాణదాత ప్రభాకర్‌రెడ్డి.

ఏ పాపం ఎరుగని చిన్నారుల గుండె జబ్బుల నిరోధానికి చిన్నారి హార్ట్ ఫౌండేషన్‌కు లక్షరూపాయలు విరాళాన్ని తనవంతు సహాయంగా అందించారు. వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి. ఇలా వైద్యరంగానికి విశేష సేవలు అందించి తన దాతృత్వాన్ని చాటుకున్న మహామనిషి వేమిరెడ్డి.

### చేయూతతో విద్యావజ్రాలకు మెరుగులుదిద్దిన

# విలక్షణదానశీలి వేమిరెడ్డి

ఎక్కడైతే విద్య ప్రకాశిస్తుందో అక్కడ విజ్ఞానం పరిఢవిల్లుతుంది. పునాదులన్నీ ఎందరో మేధావుల విద్వత్తుతోనే నిర్మించబడ్డాయి. కాబట్టి భారతదేశం నేడు ప్రపంచంలో మేటిగా నిలబడింది. ఆనాడు గురుకులాల్లో విద్యను విశాల హృదయంతో నిబద్ధతతో గురువులు బోధించడం వల్ల క్రమశిక్షణ కలిగిన విద్యార్థులు విద్యనభ్యసించి దేశం నలుమూలలా వెలుగులు పరిచారు. కాని నేడు విద్యాభ్యాసం విరుద్ధరీతిలో జరగక పోవడంతో నైతిక విలువలు దిగజారిపోతున్నాయి. దీనికి కారణం చదువుకునే వారికన్నా చదువుకొనే వారిదే పైచేయిగా మారిపోవడం ప్రతిభ కలిగి వున్నా, పరిస్థితుల రీత్యా చదువుకునే స్థోమత లేకపోవడంతో అనేక మంది విద్వన్మణులు సానబెట్టని వజ్రాలుగానే మరుగున పడి పోవడం జరుగుతోంది. మరి ఇటువంటి నిస్సహాయులకు చేయూత నిచ్చి ప్రోత్సహిస్తే వారిలోని ప్రతిభ మెరుపులీనుతుంది. సమాజంలో వెలుగులు విరజిమ్ముతుంది. అదే పని చేసారు అసమాన మానవతా మూర్తి, అపర దానకర్ణుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి. నెల్లూరు, కోవూరు, వెంకటాచలం మండలాల్లోని 400మంది విద్యార్థులకు చెన్నైలోని రోటరీక్లబ్ సహకారంతో 8లక్షలతో విద్యాసామాగ్రితో కూడిన కిట్స్ పంపిణీచేసి సహృదయతను చాటుకున్న ఆయన నెల్లూరులోని కస్తూరిదేవి స్కూలు బాలికలకు పలు సంవత్సరాలు యూనిఫామ్స్ ఉచితంగా పంపిణీచేసారు. ఎందరో శ్రామి కులు తమ పిల్లలు తమలాగా కాకుండా విద్యావంతులై సుఖపడాలని ఆశపడతారు. కాని ఏరోజుకారోజు కూలీతో జీవనం సాగించే వారికి ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలే ఆలంబనగా నిలుస్తాయి. కాని ఆ వసతి గృహాల పరిస్థితి మనకందరికీ తెలిసిందే. సౌకర్యాల లేమితో అవి కునారిల్లిపోతుండడంతో ఆ విషయాన్ని గ్రహించారో ఏమో వదాన్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, నెల్లూరులోని కొండాయపాళెం గేటు వద్ద వున్న ప్రభుత్వ బి.సి.బాలుర వసతిగృహంలో 6లక్షలతో ఆధునిక వసతులు కల్పించి పేద విద్యార్థులు, తల్లిదండ్రుల కళ్ళల్లో ఆనందాన్ని చవిచూశారు. దాత పేరుతో ఒక బి.సి.బాలుర వసతి గృహం వుండడం రాష్ట్రంలో ఒక్క నెల్లూరులోనే జరిగింది. దీనికి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి బాలుర వసతి గృహం అని పేరు పెట్టడం ఆయన దానగుణానికి, వ్యక్తిత్వ విశిష్టతకు మచ్చుతునకగా నిలుస్తోంది. ప్రతి ఏటా నిరుపేదలైన విద్యార్థులకు విద్యా పరమైన అవసరాలకు 6లక్షల మేర విరాళాలు అందించడం, నెల్లూరులోని ఉన్నత పాఠశాలల్లో 4లక్షలతో మధ్యాహ్న భోజనానికి ఆసరాగా పళ్ళాలు, గ్లాసులు పంపిణీ చేసి పేద విద్యార్థుల్లో చదువుకోవాలన్న కాంక్షను పెంపుదల చేయడం ఆయన విశాల హృదయానికి నిదర్శనాలు. ఇలా పేద విద్యార్థుల చదువుకు అవసరమయ్యే అన్ని విషయాల్లో ఆయన వెన్నుదన్నుగా నిలుస్తూ వారి మనస్సుల్లో ఎప్పటికీ చెదరని సుస్థిర స్థానాన్ని పొందారు. నేరుగా చేసిన వితరణలతో సరిపెట్టుకోకుండా ఎవరైనా ఇదే స్ఫూర్తితో ముందుకెళుతుంటే వారిని ప్రోత్సహిస్తూ తనవంతు సహాయ సహకారాలు అందించడం ఆయన ఉదాత్తతకు నిలువెత్తుసాక్ష్యం. గతంలో నెల్లూరుజిల్లా కలెక్టర్‌గా పనిచేసిన బి.శ్రీధర్ పేద విద్యార్థుల ఉన్నత చదువుకోసం ప్రవేశపెట్టిన సరస్వతీనిధి పథకానికి ఆయన దొడ్డ మనస్సుతో 4లక్షలు విరాళమివ్వడం దీనికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. విద్యా వనరులే కాకుండా మౌలిక సదుపాయాల కోసం నెల్లూరులోని పాఠశా లల్లో భవనాల నిర్మాణాలకు సాయమందించే క్రమంలో రామ్మూర్తినగర్ గంజిఖానా పురపాలక పాఠశాల భవన నిర్మాణానికి 3లక్షలు వితరణ చేయడం వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని చేతికి ఎముకలేని దానశీలిగా నిలుపుతోంది.

ఎయిడెడ్ పాఠశాలల్లో చదివేవారు ఖచ్చితంగా యూనిఫాం ధరించి అందరూ ఒకేలా కనిపించేలా వుండాలన్న లక్ష్యంతో కస్తూరిదేవి బాలికల పాఠశాలలో పలుసార్లు యూనిఫాంలు అందించాడాయన. ఎందరో రేయింబవళ్ళు సంపాదనలో మునిగి తేలుతుంటారు. కాని పిల్లికి కూడా బిచ్చమెయ్యరు. చరిత్రహీనులుగా మిగిలిపోతారు కాని భవిష్యత్‌కాలంలో కూడా చరిత్రలో చెరగని ముద్ర వేసేలా తన ఉదారస్వభావాన్ని, ఉన్నత హృదయాన్ని చాటిచెప్పేలా సంపాదించిన దాంట్లో ముప్పావు శాతం దానధర్మాలకు వెచ్చించడం శిబిచక్రవర్తి వంటి సమున్నత వ్యక్తిత్వం కలిగిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డివంటి వారికే చెల్లుతుంది.







PDF Compressor Free Version



## ఆధ్యాత్మిక కేతనమై...

# ఎగసే ప్రభాకరుడు



**"ధనం మూలం ఇదం జగత్"గా విలసిల్లే సమాజానికి దారిచూపే టార్చ్‌లైట్ ఆధ్యాత్మికత. అవినీతి ఊబిలో మునిగితేలుతున్న ఈ సమాజాన్ని మేల్కొలిపే వజ్రాయుధం ఆధ్యాత్మికత. మనిషిలోని పరివర్తనకు మానవ జీవిత సాఫల్యానికి కావల్సిన చేతనత్వం ఇమిడి ఉన్నది కేవలం ఆధ్యాత్మికతలోనే! ఆ జీవన పరమార్థాన్ని ఒడిసి పట్టుకొన్న అపురూపమైన వ్యక్తి, సామాజిక సేవా పరాయణులు, ప్రజాసేవే తన ధ్యేయంగా మార్గంగా విరాజిల్లుతున్న మేనాపస్సి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి చేస్తున్న మహత్తరకార్యక్రమాల్లో ప్రాముఖ్యతగాంచినది ఆధ్యాత్మికతకావడం ఎంతైనా ఆనందదాయకం.**

నెల్లూరీయుడుగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి జన్మించడం మనం చేసుకొన్న పుణ్యం. ఆయన తనదాతృత్వంతో వితరణ శీలత్వంతో విశిష్ట ఆధ్యాత్మిక సేవలను నెల్లూరీయులకు అందించడం మనకెంతో గర్వం. కలియుగ దైవం వెంకటేశ్వరుని కల్యాణం కనులారా తిలకించడమే గొప్ప భాగ్యం. అలాంటిది నెల్లూరులోనే శ్రీ వెంకటేశ్వరుని కల్యాణ వైభవాన్ని దర్శించే భాగ్యాన్ని గత సంవత్సరంలో ఏర్పాటుచేసిన గొప్ప ఆధ్యాత్మికవేత్త, ఆ స్వామి సేవలో తరిస్తున్న మహోన్నతులు శ్రీ వేమిరెడ్డి.

ఆ కల్యాణానికి నెల్లూరంతా తరలి వచ్చిందా అన్న రీతిలో విశేషంగా తిరుమల ఆ స్థాన వైదిక పండితుల్ని రప్పించి నెల్లూరును మరో తిరుమలగా తీర్చిదిద్ది శ్రీ వెంకటనాథుని కల్యాణం తిలకించే భాగ్యాన్ని మనందరికీ ప్రసాదించడం ఎంతైనా అభినందనీయం. కమనీయమైన ఆ కల్యాణాన్ని తిలకించి పులకించిన వంతు నెల్లూరీయులదైతే తన ఐదు లక్షల వితరణతో ఓ గొప్ప ఆధ్యాత్మిక చరిత్రను సృష్టించిన ఘనత ప్రభాకరరెడ్డిగారిది.

నెల్లూరులో పదసంకీర్తనామాత్యుడు అన్నమయ్య విగ్రహావిష్కరణ సందర్భంగా మరో కార్యక్రమాన్ని నిర్వహించారు. సాక్షాత్తూ భగవత్ స్వరూపులు శ్రీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి నిర్వహించిన పుష్పయాగమేకావడం మరింత విశేషం. వేలకొద్దీ పూలు అనేక రకాల పుష్పాలు శ్రీ వెంకటపతి పదసీమను అలంకరించి భక్తి భావంతో పులకించిపోయిన సంఘటనలతో నెల్లూరీయులు పరవశించిపోయిన అద్భుతమైన ఘటన. ఈ పుష్పయాగాన్ని కనులారాగాంచి నెల్లూరు ఓ మహత్తర అనుభూతిని మూటగట్టుకొంది. వెంకటనాథుని సేవలో తరించి పులకించిపోయింది. దాని విధాత వేమిరెడ్డికావడం ఏ జన్మ పుణ్యమో మరి.

ఎంతో మంది ధనవంతులకు పుట్టినిగడ్డ నెల్లూరు. అయినా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిలా దాతృత్వానికి తార్కాణంగా నిలిచిన మహనీయమూర్తులు ఏందరున్నారు. సామాజిక సేవాపరాయణులెందరుంటారు. పువ్వుకు తావిఅబ్బినట్లు ఆయనకు సేవాగుణం దానగుణం అబ్బి నెల్లూరు కీర్తి ప్రతిష్టగా భాసిల్లడం ఎంతో ఆనందదాయకం అభినందనీయం.

నెల్లూరు మూలాపేట శివాలయంలో కొన్నిలక్షలు వెచ్చించి ఎన్నో అభివృద్ధికార్యక్రమాలు నిర్వహించి ఆ పరమేశ్వరుని కృపకు పాత్రులయ్యారాయన. ఎంతగా ఆర్థిక సహాయం అందించారో ఆయన పెద్దగా లెక్కించి ఉండకపోయినా దాదాపు ముప్పైలక్షలపై చిలుకే ఉంటుంది.



ఎంతో భక్తిభావంతో తాను దేవాలయ జీర్ణోద్ధరణను సైతం చేపట్టి ప్రజల్లో భక్తి భావాన్ని ప్రోదిచేస్తున్న ఆధ్యాత్మిక స్వరూపులు, సేవా ఋషి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి.

విఘ్నేశ్వరాలయంలో అనేక కార్యక్రమాల్ని విశేషంగా చేపట్టి జీర్ణోద్ధరణతో ప్రజలకు అన్ని కార్యాలు అవిఘ్నంగా జరిగేలా విఘ్నేశ్వరుని ప్రార్థిస్తూ ఆయన ఆలయాన్ని అత్యంత వైభవంగా తీర్చిదిద్ది విఘ్నేశ్వరుని కృపకల్గేలా కృషిచేసిన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిగారిలో కేవలం అపురూప మానవత్వమే కాక దైవత్వమూ పరిమళిస్తున్నది. విఘ్నేశ్వరుని ముఖ ద్వారాన్ని ఏర్పాటుచేయడం కూడా జరిగింది. ధ్వజస్తంభం ఏర్పాటుచేసి శిల్ప కళా వైభవాన్ని తీసుకొచ్చి, రథమండపం జీర్ణోద్ధరణ కార్యక్రమాన్ని సైతం చేపట్టి విఘ్నేశ్వరాలయానికి విశిష్ట వైభవాన్ని తీసుకొచ్చిన ఘనతర చరితులు శ్రీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిలో ఎంతో వైశిష్ట్యం దాగున్నదంటే అతిశయోక్తికాబోదు.



రాహుకేతు పూజలకు ఎంతో పేరెన్నికగన్నది కాళహస్తిలోని కాళహస్తీశ్వరాలయం ఎంతో మంది భక్తులు రాహుకేతు పూజకోసం కాళహస్తికెళ్ళి అక్కడ పూజలు చేయాల్సిన తరుణంలో నెల్లూరులోనే ఎందుకు రాహుకేతు పూజా మండపాన్ని నిర్మించకూడదనే ఆలోచన వేమిరెడ్డి ప్రభాకర రెడ్డిగారికి వచ్చింది. ఆ ఆలోచన వచ్చిందే తడవుగా రాహుకేతు పూజా మండపాన్ని నిర్మింపజేశారాయన. ఆ రాహుకేతు పూజలిప్పుడు నెల్లూరులోనే ప్రారంభంకావడం విశేషమైతే ఆ పూజల్లో తరిస్తున్న నెల్లూరీయులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి ఋణపడి ఉన్నారంటే అతిశయోక్తి కాబోదు.



శ్రీరామచంద్రుని వంటి ఉన్నత వ్యక్తిత్వం గల మహనీయులు అరుదుగా జన్మిస్తారు. అందుకే శ్రీరాముని ఆలయం లేని ఊరు మనకు కనిపించదు. శ్రీరామచంద్రుని వంటి వ్యక్తుల్ని ఆరాధించడం పూజించడం భారతీయులు చేసుకున్న అదృష్టంగా భావించవచ్చు. అలాంటి మహానుభావుని కోసం రామతీర్థంలో రామాలయాన్ని పునర్నిర్మాణం గావించి ఆ విశిష్ట పురాణపురుషుని ఆశీస్సులు మనకందించేలా ఏర్పాటు చేసారు వేమిరెడ్డి వారు. ఈ కార్యక్రమాన్ని బృహత్తరంగా చేపట్టారాయన.

మహానంది గొప్ప ఆధ్యాత్మిక క్షేత్రంగా రాయలసీమలో విలసిల్లుతూ ఉన్నది. కర్నూలు జిల్లాలోని మహానందిలోని దేవాలయం యొక్క అభివృద్ధి కార్యక్రమాలకు దాదాపు 7లక్షల రూ॥ ఖర్చు చేసారాయన. అడిగిందే తడవుగా విరాళాలందించారు. ఆ శివుని కార్యక్రమాలకు వితరణ చేయడంలోనే ఆనందాన్ని, తృప్తిని అనుభవిస్తారాయన.

నెల్లూరు ఇస్కాన్‌తో వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి గారి అనుబంధం విడదీయరానిది. ఆయన దాతృత్వంతో ఇస్కాన్ ఆలయం ఎంతో అభివృద్ధి చెందడం మనకు కన్పిస్తూ వుంటుంది. ఇస్కాన్ కార్యక్రమాలకు అడుగకనే విరాళాలిందించే మహారాజపోషకులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి. ఇస్కాన్ వారు ప్రతి ఏటా నిర్వహించే జన్మాష్టమి మరియు రథయాత్రలు వీరి దాతృత్వంతో జరుగుతున్నవి. వీరి సేవాపరాయణత్వంలో పురుడు పోసుకుంటున్నవే. ఆ సందర్భంలో వేలాదిమందికి భోజన వసతి కల్పించడం ఆయనకే చెల్లింది. ఇస్కాన్‌లో గోశాల నిర్మించడం ఆయన మెదడులో ప్రభవించినదే. మద్రాసులోని వేంకటేశ్వరుని ఆలయానికి లెక్కలేనంతగా ఖర్చుచేసిన ఉదారస్వభావులు వేమిరెడ్డి గారు. ఒకవైపు సేవను తన ఆయుధంగా చేసుకొని సేవచేస్తూ మరోవైపు లోకాన్ని ఆధ్యాత్మిక వైపు మళ్ళిస్తూ ఈ సమాజానికి కావలసింది, ఈ సమాజాభివృద్ధికి అవసరమైంది ఆధ్యాత్మికతేనని సందేశాన్ని తన అనేక కార్యక్రమాలతో నిరూపించిన మహోన్నతుడాయన.

సేవ ఆయన నైజం. ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ ఆయన విజయం. నిర్మాణాత్మక కార్యక్రమాల వెల్లువతో నెల్లూరుకు విశిష్టత కల్పించడం మనం చేసుకొన్న అదృష్టం. తన సేవాభాగ్యాన్ని నెల్లూరుకు ప్రసరింపజేయడంలో అందెవేసిన చేయి ప్రభాకరరెడ్డిది. ఆ పుణ్యపురుషుని ఆధ్యాత్మిక స్ఫూర్తితో తరిద్దాం. ఆ మహనీయుని, సేవాస్వరూపుని ఆశీర్వదిద్దాం.

ఆధ్యాత్మిక సేవలో తడిసి, ఆనంద బిందువై ఎగిసిన ప్రేమస్వరూపులు శ్రీ వేమిరెడ్డి గారిని అభినందిద్దాం. లోకాన్ని ఓదార్చే మహోన్నత దైవం కోసం తపస్సు సాగించే మహాఋషిని... కృషీవలుని స్వాగతిద్దాం!

PDF Compressor Free Version



## విలువలతోనే పయనం...

# ఆడితప్పని జీవనగమనం

న్యూయార్క్‌లోని వరల్డ్‌ట్రేడ్ భవనాలను నిర్మించడానికి కొన్నేళ్లు పట్టింది. అవే భవనాలను కుప్పకూల్చడానికి ఒసామా బిన్‌లాడెన్‌కు 10నిముషాలు కూడా పట్టలేదు. జీవితంలో మంచిచెడులు కూడా అటువంటివే! మంచిపేరు అనేది ఎన్నో ఏళ్లు కష్టపడి కట్టుకున్న భవనంలాంటిది. ఆ పేరును పోగొట్టుకోవడానికి ఒక్క నిముషం చాలు. ఒక్క సంఘటన చాలు. మనం వంద మంచిపనులు చేసుండొచ్చు, ఒక్క తప్పుచేస్తే చేసిన వంద పనుల మంచి కూడా మంచుకుపోతుంది. ఆడి మాట తప్పని వాడిగా, మాటకు నిలబడే మనిషిగా చాలా కొద్దిమంది మాత్రమే పేరు తెచ్చుకుంటారు. అలాంటివారిలో అగ్రగణ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి. తన వ్యాపార, వ్యక్తిగత జీవితంలో ఆయన ఎన్నోకోట్లు సంపాదించి వుండొచ్చు. కాని ఇన్నేళ్ల జీవితంలో ఆయన తెచ్చుకున్న మంచిపేరు ముందు ఆయన సంపాదించిన కోట్లు ఏ మాత్రం సరితూగవు.

'అతనిని నమ్మి మోసపోయిన వాళ్లెవరూ లేరు' అని మన పల్లెటూర్లలో గొప్ప వ్యక్తుల గురించి సామెత చెబుతుంటారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని నమ్మి మోసపోయిన వాళ్లు కూడా ఎవరూ వుండరు. ఆయనను నమ్ముకుంటే బాగుపడతారని ప్రతీతి.

ఆయన వ్యాపార, కాంట్రాక్ట్ రంగాల్లో విస్తరించారు. మనిషిగా మనం బ్రతకడం కాదు మనం పదిమందికి బ్రతుకుదెరువు కల్పించినప్పుడే మనకు సార్థకత. వేమిరెడ్డిని నమ్ముకుని ఈరోజు వేలాదిమంది బ్రతుకుతున్నారు. కాంట్రాక్ట్ రంగంలో, వ్యాపార రంగంలో ఎంతోమందికి ఉపాధి కల్పించారు. తన దగ్గర పని చేసే సిబ్బందిని జీతగాళ్లుగా చూసే మనస్తత్వం కాదతనిది. తన వాళ్లుగా చూస్తాడు, వారికే కష్టం వచ్చినా తానే చూసుకుంటాడు. కాబట్టే ఆయన దగ్గర పని చేసేవాళ్లు వేమిరెడ్డిని వదిలివెళ్లరు.

ఇన్నేళ్ల జీవితంలో ఎవరూ వేలెత్తి చూపలేని స్థాయికి ఎదిగాడాయన. వ్యాపారంలో గాని కాంట్రాక్ట్ రంగంలోగాని కమిట్‌మెంట్స్‌కు పెద్దపీట వేస్తాడు. ఆర్థికలావాదేవీలకంటే వ్యక్తిగత సంబంధాలకే ప్రాధాన్యతనిస్తాడు.

వేమిరెడ్డి వ్యక్తిత్వం ఎంతో ఉన్నతమైనది. 'మౌనంగానే ఎదగమని మొక్క నీకు చెబుతుంది... ఎదిగేకొద్దీ ఒదగమని అర్థమందులో వుంది...' అనే పాటను బహుశా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని చూసే రచయిత వ్రాసాడేమోననిపిస్తుంది.

# కనుపర్తిపాడుకు మహర్దశ

దేనికైనా టైం రావాలంటుంటారు. ఇది ప్రాంతాలకు కూడా వర్తిస్తుంది. ముఖ్యంగా రియల్‌ఎస్టేట్ సంస్కృతి గ్రామాలకు కూడా పాకిపోయింది. ఒక ప్రాంతంలో కాలుష్యం వెదజల్లే పరిశ్రమ ఏర్పడితే అక్కడ ఎకరా కోటిరూపాయల విలువచేసే భూమిని 10లక్షల రూపాయలకు కూడా కొనరు. అదే అందమైన అభివృద్ధికరమైన ప్రాజెక్ట్ వస్తే... 10లక్షలు విలువచేసే ఎకరాభూమి ఒక్కసారిగా కోటీరూపాయలైనా పలుకుతుంది. అక్కడ నెలకొనబడే వాతావరణాన్ని బట్టీ ప్రాంతాల విలువలు మారుతుంటాయి. నెల్లూరు నగరంలోనే రెండు ఉదాహరణలు చూద్దాం. కూరగాయల మార్కెట్ సందులో ఖాళీస్థలాలున్నాయి. ఇక్కడ స్థలం ధర చాలాతక్కువ. ఈ ప్రాంతం నగరం నడిబొడ్డులో వుంది. కాని ఈ ప్రాంతం మురికిమయం కావడంతో స్థలాల రేట్లు పెరగలేదు. అలాగే చిన్నపిల్లల పార్కు ప్రాంతాన్ని చూద్దాం. ఒకప్పుడు మున్సిపాల్టీ కంపోస్టుయార్డ్ ఉండేదక్కడ. చింతారెడ్డిపాలెం డొంకరోడ్డుగా దీనిని పిలిచేవాళ్లు. అప్పట్లో ఇక్కడ ఎకరా భూమి వేలల్లోనేవుండేది. అదే ప్రాంతంలో చిల్డ్రన్స్ పార్కు వచ్చాక... అంకణం స్థలం లక్షల్లోకి ఎకరా భూమి కోట్లలోకి పోయింది. పన్నెండేళ్ల క్రితం చిల్డ్రన్స్‌పార్కు వున్న ప్రాంతం వైపు పోవాలంటేనే జనం భయపడేవాళ్లు. ఇప్పుడు అదే ప్రాంతంలో స్థలాల కోసం ఎగబడుతున్నారు. దీనికంతటికీ కారణం చిల్డ్రన్స్‌పార్కు రావడమే.

కనుపర్తిపాడు దగ్గర గొలగమూడి రోడ్డులో ఇలాంటి ల్యాండ్‌మార్కే కాబోతుంది విపిఆర్ కన్వెన్షన్ సెంటర్. వాస్తవంగా చూస్తే నగరానికి విపిఆర్ కన్వెన్షన్ వున్న ప్రాంతం కొంత దూరం అనిపిస్తుంది. కాని ఈ కన్వెన్షన్ సెంటర్ ప్రారంభమైతే ఈ ప్రాంతం నగరంలో కలిసిపోతుంది. ఎందుకంటే రాకపోకలు అంతగా పెరుగుతాయి. కనుపర్తిపాడు పరిసర ప్రాంతాలకు ఎనలేని విలువ వస్తుంది. కనుపర్తిపాడు గ్రామ ప్రజలు ఇక గర్వంగా చెప్పుకోవచ్చు హైదరాబాద్‌ను తలదన్నే రీతిలో వుండే కన్వెన్షన్‌సెంటర్ మా ఊర్లో వుందని. మొత్తానికి విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌తో ముందుగా బాగుపడేది కనుపర్తిపాడు ప్రాంతమే!

# ఖైదీల సంక్షేమం కోసం...

తెలిసో తెలియకో క్షణికావేశంలో చాలా మంది నేరాలకు పాల్పడుతుంటారు. నేరస్థులందరినీ ఒకే గాటన కట్టేయలేం. పొరపాటున తప్పులు చేసి చాలామంది జైలుశిక్ష అనుభవిస్తుంటారు. జైలు శిక్ష అనేది నేరస్థులలో మార్పు తేవడానికే! సాటి మనుషుల పట్ల మనం వ్యవహరించే తీరువల్లే వారిలో మార్పు వస్తుంది. సాటి మనిషిని ప్రేమించి, అభిమానిస్తే క్రూరులలో కూడా మార్పు చూడగలం. జైలులో వున్న ఖైదీలు మనుషులేనని, వారిలోనూ మంచి మానవత్వం వుంటుందని గుర్తించి వారి సంక్షేమం కోసం ఉదారస్వభావం చూపిన సంఘశీలి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి. ఖైదీలను చాలామంది చులకనగా చూస్తుంటారు. వారిని కలవడానికే భయపడుతుంటారు. కాని వేమిరెడ్డి వారి పట్ల దయచూపుతాడు. వారితో స్నేహం చేస్తాడు. వారి మంచిచెడ్డలు చూస్తాడు. నెల్లూరు కేంద్ర కారాగారంలో ఖైదీల సంక్షేమం కోసం లక్షల రూపాయల సొంత డబ్బుతో ఆయన ఎన్నో వసతులు కల్పించారు. ఫ్యాన్లు, వినోదం కోసం టెలివిజన్లు, వాటర్‌కూలర్‌లు, అంబులెన్స్‌కు ఏ.సి, వంటపాత్రలు ఇవ్వడం వంటివెన్నో చేసారు. ప్రతి ఏడాది గాంధీజయంతి రోజు జైలుకెళ్లి ఖైదీలతో గడుపుతారు. వారికి స్వీట్లు, పండ్లు పంచుతారు. వారికి కావాల్సిన వసతుల గురించి తెలుసుకుని వెంటనే వాటిని ఏర్పాటు చేస్తుంటారు. ఖైదీలు పండించిన కూరగాయలను మార్కెట్‌కి తరలించడానికి ఓ ఆటోని సైతం ఇటీవల కొనిచ్చాడు. మనం చూపించే మంచితనాన్ని బట్టే వాళ్లు మంచిమనుషులుగా మారుతారని, రేపు జైలు నుండి విడుదలయ్యాక సమాజంలో మంచిగా జీవిస్తారని వేమిరెడ్డి అభిప్రాయం. ఇది అక్షరాల నిజం కూడా!

# సేవ ఆయనకి వ్యసనం

(1వపేజీ తరువాయి)



మదనపల్లెలోని రిషివ్యాలీ పబ్లిక్‌స్కూల్‌లో యల్‌కెజి నుండి 12వ తరగతి వరకూ చదివి అక్కడే తన చిన్నతనంలో సమయపాలన, నైతిక విలువలతో పాటు సమాజం పట్ల మనిషికున్న బాధ్యతలను కూడా తెలుసుకున్నాడు ప్రభాకర్‌రెడ్డి. అక్కడనుండి నేరుగా చెన్నై మహానగరంలోని లయోలా కళాశాలలో చేరి బి.ఏ ఎకనామిక్స్ డిగ్రీని అందుకున్నాడు. అత్యంత ప్రశాంతమైన వాతావరణంలో ఆహ్లాదకరమైన ప్రకృతి ఒడిలో ఓనమాలు నేర్చుకున్న ఆయన ఒక్కసారిగా నిత్యం రద్దీగా వుండే నగరంలో క్షణం తీరికలేకుండా గడిపే మనుషుల మధ్యకు వచ్చేసాడు. అయినా ఆయన ఆలోచనా సరళి మారలేదు. చిన్ననాడే తనలో బలంగా నాటుకుపోయిన సేవాభావాలు ఎక్కడా వీడలేదు. ఎప్పుడూ ప్రశాంతంగా వుంటూ మంచినే ఆలోచించే మనస్తత్వాన్ని ఆయన సొంతం చేసుకున్నాడు.

డిగ్రీ అందుకున్న అనంతరం తండ్రికి చేదోడు వాదోడుగా మైకా మైనింగ్ వ్యాపారంలో భాగస్వామ్యుడయ్యాడు, అనంతరం కొద్దిరోజులకే కాంట్రాక్టు రంగంలో అడుగుపెట్టి అతిస్వల్పకాలంలోనే తన లక్ష్మీ కన్‌స్ట్రక్షన్ కంపెనీని అగ్రగామి సంస్థగా తీర్చిదిద్ది దాదాపు 2000వేల మందికి ఉపాధి కల్పించే స్థాయికి తెచ్చాడు. అనంతరం తాను స్వంతంగా ప్రారంభించిన మరో సంస్థ విపిఆర్ మైనింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీని కోల్ మైనింగ్‌లో భారతదేశంలోనే ప్రతిష్ఠాత్మక కంపెనీగా నిలబెట్టాడు. ఇక్కడ నుండి ఆయన విజయ ప్రస్థానంతో పాటు సేవా ప్రయాణం కూడా అలుపులేకుండా కొనసాగుతోంది.

కాదు లేదు అన్న పదం ఆయన డిక్షనరీలో లేదు. నిజమైన అవసరానికి ఆయన ఎప్పుడూ ఆసరాగా వుంటాడనటానికి వేల ఉదాహరణలున్నాయి. "సేవకు కాదేది అనర్హం" అన్నారు. విద్యారంగం, వైద్య రంగం, సాహిత్యరంగం సాంస్కృతిక రంగం, క్రీడారంగం, ఆధ్యాత్మికరంగంతో పాటు అనేక సాంఘిక సంక్షేమ కార్యక్రమాలకు ఆయన కోట్ల రూపాయలను దానంచేశాడు. అన్ని విభాగాలలోనూ ఆయన సేవై గుభాళించాడు.

ఇక వ్యాపార రంగంలో సైతం సంచలనాలకు సారధి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి. ప్రపంచ ప్రఖ్యాతగాంచిన "వోల్వో" సంస్థ ప్రతిష్ఠాత్మకంగా రూపొందించే తమ క్యాలెండర్‌లో 2008 సంవత్సరంలో వేమిరెడ్డికి అగ్ర సింహాసనం వేసింది.

మరో అంతర్జాతీయసంస్థ "కొమాట్సో" సంస్థ ఏషియన్ పసిఫిక్‌లోనే అతిపెద్ద ఖాతాదారుడిగా వేమిరెడ్డిని కీర్తిస్తోంది. తమ సంస్థను భారతదేశానికి పరిచయం చేసి తమ ఉనికిని ఈదేశంలో చాటిచెప్పిన ఉత్తమ వ్యాపారవేత్తగా ప్రభాకరరెడ్డికి అత్యుత్తమ స్థానాన్ని కల్పించింది.

2006లో జేసీస్ నుండి ఉత్తమ విశిష్ట వ్యాపారవేత్తగా పురస్కారాన్ని అందుకున్నాడు వేమిరెడ్డి. నెల్లూరుజిల్లాకే తలమానికంగా వివిధ పదవులను అలంకరించిన మేధావి. పలుమార్లు కేంద్రమంత్రిగా ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రిగా, ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా నెల్లూరు కీర్తిప్రతిష్ఠలను పెంచిన డా॥బెజవాడ గోపాలరెడ్డిగారి పేర ఏర్పాటుచేసిన "గోపాలరెడ్డి అవార్డు" 2009లో ప్రభాకర్‌రెడ్డిని వరించింది. ఈ సభలో ప్రసంగించిన ముప్పవరపు వెంకయ్యనాయుడు, వేమిరెడ్డిని గురించి మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో పుట్టిన ఆణిముత్యంగా ప్రభాకరరెడ్డిని కీర్తించాడు.

తెలుగు వారన్నా తెలుగు భాషన్నా ప్రభాకరరెడ్డికి మక్కువ ఎక్కువ, ప్రపంచ తెలుగు సమాఖ్య వేదికగా ఎన్నో కార్యక్రమాలకు ఆయన చేయూతనిచ్చాడు. ఇటీవల మలేషియాలో జరిగిన సమాఖ్య వార్షిక సదస్సుకు 10లక్షల రూపాయలు విరాళంగా అందించి తెలుగుపై వున్న ప్రేమను చాటుకున్న ఘనత ఆయనది.

భారతదేశంతో పాటు ఆఫ్రికా దేశంలోనూ, ఇండోనేషియాలోను వ్యాపార కార్యకలాపాలను నిర్వహిస్తూ సమయం దొరికినప్పుడల్లా తన స్వంతగడ్డ నెల్లూరుకి వస్తూ వచ్చిన ప్రతిసారీ ఒక సేవా కార్యక్రమాన్ని తప్పనిసరిగా చేయడం అలవాటుగా మార్చుకున్నాడు ప్రభాకర్‌రెడ్డి.

పార్టీలకతీతంగా పలు రాజకీయనేతలతో పాటు రాష్ట్రంలో, దేశంలోనేకాక అంతర్జాతీయంగా ఆయనకు పలు వ్యాపారవేత్తలతో సన్నిహిత స్నేహబాంధవ్యాలు వున్నాయి. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అందించిన సేవలను ప్రశంసిస్తూ దివంగత నేత డా॥ వై.యస్.రాజశేఖరరెడ్డి ఆయనను అభినందించిన సందర్భాలు ఎన్నో వున్నాయి.

ఆయన వివిధ రంగాలలో చేసిన సేవా సేద్యాన్ని ఈ వారం "లాయర్" పాఠకులకు అందిస్తున్నాం. నెల్లూరుజిల్లా సేవారంగానికి వేమిరెడ్డి ఓ వరంగా లభిస్తే ఆయన చేసిన కార్యక్రమాలు రేపటి తరానికి స్ఫూర్తిగా నిలవాలనే ప్రయత్నమే మా యీ ప్రత్యేక శీర్షిక.




అమెరికాలో జరిగిన 'మైన్ ఎక్స్‌పో' లో కొమాట్సూ సంస్థ అధినేతతో లోడర్ బకెట్‌లో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

# సమైక్యమే మా పంథా!

సింహపురి సమాచారం



సమైక్య రాష్ట్రం కోసమే తమ కుటుంబం కట్టుబడి వుందని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మంత్రి నెల్లూరులోని తన ఇంట్లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జైఆంధ్రా ఉద్యమం సమయంలోనూ తాము సమైక్యాంధ్ర కోసమే పోరాడామని చెప్పారు. తెలంగాణ బిల్లును వ్యతిరేకించే విషయంలో సీమాంధ్ర కాంగ్రెస్ ఎమ్మెల్యేలందరం ఒక్కటిగా వున్నామన్నారు. ఆర్టికల్-3 ప్రకారం తెలంగాణ బిల్లు రెండుసార్లు అసెంబ్లీకి రావాల్సివుంటుంది. దీనిని మేం గట్టిగా వ్యతిరేకిస్తాం. బిల్లు అసెంబ్లీకి రాదని ఎవరైనా చెబితే వారికి రాజ్యాంగం పట్ల అవగాహన లేనట్లే! సీమాంధ్ర ప్రజల మనోభావాలకు విరుద్ధంగా సిడబ్ల్యూసి నిర్ణయం తీసుకుంది. కాబట్టి మేం సిడబ్ల్యూసి నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాం. ప్రజల మనోభావాలను గౌరవిస్తూ సమైక్యాంధ్రకు కట్టుబడి వున్నాం. ముఖ్యమంత్రిగా కిరణ్‌కుమార్‌రెడ్డిని మార్చినంత మాత్రాన సమస్యలు పరిష్కారం కావు. నేను ముఖ్యమంత్రి కావాలని కోరుకోవడం లేదు. కిరణ్ నాయకత్వంలో రాష్ట్రం సమైక్యంగా వుంటుంది. ఆయన నాయకత్వంలోనే 2014ఎన్నికలను ఎదుర్కొంటామని మంత్రి చెప్పుకొచ్చారు. ఫైలిన్ తుఫాన్‌ను ఎదుర్కోవడంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో సమర్థవంతంగా వ్యవహరించిందని చెప్పారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, విజయడెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డీసీసీ ఇన్‌ఛార్జ్ అధ్యక్షులు చాట్ల నరసింహారావు, కాంగ్రెస్ నాయకులు ఆనం విజయకుమార్‌రెడ్డి, సన్నపరెడ్డి పెంచలరెడ్డి, సి. హెచ్.హరిబాబుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



## ఎస్పీ పి.వి.యస్. రామకృష్ణ

పోలీసులు ప్రజలకు అందుబాటులో వుంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని, పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని నెల్లూరుజిల్లా ఎస్పీ పి.వి.యస్. రామకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం నెల్లూరు నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో నూతనంగా శిక్షణ పూర్తి చేసుకుని వచ్చిన కానిస్టేబుళ్ళతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వశాఖల ఉద్యోగులకంటే పోలీసులకు ప్రత్యేక గుర్తింపు, బాధ్యతలు ఉంటాయన్నారు. నిజాయితీగా విధులు నిర్వర్తించి పోలీసుశాఖకు మంచిపేరు తేవాలని కోరారు. మెరుగైన పనితీరు ఉన్న వారికి వేగంగా పదోన్నతులు లభిస్తాయన్నారు. ఆరోపణలు ఎదుర్కొనే వారికి అర్హతవున్నా పదోన్నతులు దక్కవన్నారు. కానిస్టేబుల్ ఉద్యోగాలు దక్కించుకున్న వారిలో ఎందరో డిగ్రి, పీజీలు చేసినవారు ఉన్నారని, వారు కానిస్టేబుల్ ఉద్యోగంతోనే సరిపెట్టుకోకుండా పోటీపరీక్షలు రాసి ఉన్నత ఉద్యోగాలు పొందాలని కోరారు. అనంతరం డిటిసి సిబ్బందికి జ్ఞాపికలు అందజేశారు. ఈ సమావేశంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఐఆర్ఎస్ మూర్తి, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అన్నకు పగటి వేషాలే మిగులుతాయ్



## ఆనం జయకుమార్‌రెడ్డి


అన్న వివేకాకు చివరకు పగటివేషాలే మిగులుతాయని, నోరు అదుపులో పెట్టుకోకుంటే వివేకాకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని ఆనం వివేకా సోదరుడు ఆనం జయకుమార్‌రెడ్డి మండిపడ్డారు. ఈ నెల 12వ తేదీన తన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాన్ని దుర్మార్గంగా విభజించిన సోనియాగాంధీ నాలుకను కోయాలని, రోజుకో ప్రకటన చేస్తూ రాష్ట్ర ప్రజలను గందరగోళం చేస్తున్న దిగ్విజయ్‌సింగ్, షిండేల నాలుకలు కోయాలని, సిఎం కుర్చీకోసం ప్రజలను మభ్యపెడుతున్న రాష్ట్రమంత్రి ఆనం రామనారాయణరెడ్డి నాలుక కోయాలని ఆవేశంగా మండిపడ్డారు. కాంగ్రెస్‌పార్టీ 5కోట్ల సీమాంధ్ర ప్రజల గొంతులను కోసిందని ఆవేదన చెందారు. కాంగ్రెస్ అధినాయకత్వం రాష్ట్ర విభజన తీర్మానంపై అసెంబ్లీలో చర్చ మాత్రమే జరుగుతుందని, ఓటింగ్ ఉండదని చెబుతున్నా వివేకానందరెడ్డి అసెంబ్లీలో విభజన అడ్డుకుంటామనడం ప్రజల్ని మోసం చేయడమేనన్నారు. రాష్ట్రమంత్రి రామనారాయణరెడ్డి సీమాంధ్ర ప్రజల మనోభావాలను కించపరుస్తూ సిడబ్ల్యూసీ నిర్ణయానికి కట్టుబడి ఉంటామనడం సిగ్గుచేటన్నారు. సిఎం కిరణ్‌కుమార్‌రెడ్డి రాష్ట్ర ప్రజలను తప్పుదోవపట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో ఆసిఫ్‌బాషా, శివారెడ్డి, ఆర్‌యస్‌ఆర్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

# ఆరోగ్య కేంద్రాలను బ్రతికించండి



## జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్

నెల్లూరు గోల్డెన్ జూబ్లీ హాల్లో మంగళవారం వైద్యాధికారులతో నెల్లూరుజిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై ప్రజల్లో అపనమ్మకం ఏర్పడిందని, చనిపోయిన పిహెచ్‌సీలను బతికించాల్సిన అవసరం వుందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పిహెచ్‌సీ) పనితీరు అధ్వాన్నంగా వుందని ఏ ఒక్క వైద్యుడు పనివేళలు పాటించడంలేదని మండిపడ్డాడు. వీలైనంత వరకు పని చేసే చోటే వైద్యులు నివాసం ఉండాలని సూచించారు. రోజూ ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యాధికారులు విధిగా పిహెచ్‌సీల్లో ఉండాలన్నారు. పిహెచ్‌సీల్లో కాన్పులు జరగడం లేదంటే అవి పనిచేయడం లేదనే చెప్పాలన్నారు. చాలా మంది వైద్యులు వృథాగా ఉన్నారని వారిని గుర్తించి తొలగించాలని డిఎంహెచ్‌ఓను ఆదేశించారు. పిహెచ్‌సీల్లో సంబంధిత జనన, మరణ నివేదికలను నెలలవారీగా చెప్పే విధంగా ఉండాలన్నారు. ఈ సమీక్షాసమావేశంలో ట్రైనీ కలెక్టర్ వర్షిణి, ఏజేసి పెంచలరెడ్డి, డిఎంహెచ్‌ఓ డా॥సుధాకర్, అడిషనల్ డిఎంహెచ్‌ఓ డా॥కోటేశ్వరరావు, ఎన్ఆర్ హెచ్ఎం డా॥పెంచలయ్య, ఎన్‌సీడి నోడల్ అధికారి డా॥ఈదూరు సుధాకర్, వైద్యాధికారులు పాల్గొన్నారు.



PDF Compressor Free Version



## కదంబం

### దారం

డా॥ సి.భవానీదేవి
హైదరాబాద్. 98668 47000

నిజానికి...
ఎవరూ పుట్టిందీ లేదు... చచ్చిందీ లేదు
పుట్టటం అంటే మట్టిలోంచి మట్టిగా ఎదగటమా
చావంటే మళ్ళీ మట్టిలో కలిసిపోవటమా
కానేకాదు... చరిత్రగా వెలగటం... మిగలటం
అందుకే... ఆకాశంలో నక్షత్రాల్ని
పద్యాల తుఫానులుగా మార్చి
ప్రతిధ్వనుల చినుకులుగా వినిపిస్తున్నాను
ముళ్ళమోదుల వేణుగానం వింటూ
ప్రాణశక్తి పొంగిన పిల్లకాలువయ్యాను
కొంతకాలం...
అంటే.. నా జీవితకాలం
కనిపించేవి దారానికి రెండు కొసలే
మధ్యలో కనిపించని దారం... నేనే

## దసరా సంబరాలు



నెల్లూరులోని శాంతి కల్చరల్ ఆధ్వర్యంలో 13వ తేదీ స్థానిక టౌన్‌హాలు వర్ధమాన సమాజంలో దసరా సంబరాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి నెల్లూరు నగర శాసనసభ్యులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సహస్రసభాసింహం బి.వి.నరసింహం అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా ఆర్.వి.నాయుడు, పాములూరు జయరమేష్‌రెడ్డి, బీరంగుంట శ్రీనివాసులు, వల్లకవి వేంకటసుబ్బారావు, సర్వేపల్లి ప్రభాకరరావు, కేతా సుబ్బారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమానుల్లాఖాన్ మిమిక్రి, మున్వర్‌ఖాన్ మ్యాజిక్‌షో అందరిని అలరించాయి. నృత్య పోటీలలో గెలుపొందిన విజేతలకు ఎమ్మెల్యే ముంగమూరు బహుమతులు ప్రదానం చేశారు.

## కళాకారులు సమాజసేవకులు



నెల్లూరు నగరం సుబేదారుపేటలో కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'కళాకారులు సమాజసేవకులు' అనే అంశంపై మంగళవారం సభ జరిగింది. ఈ సభకు స్వతంత్ర పార్కు మిత్రమండలి అధ్యక్షులు పాములూరు జయరమేష్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఇంజనీర్ కె.సీతారామస్వామి, శింగంశెట్టి మురళీ మోహన్‌రావు, అక్షరకవి వరదా శ్రీనివాసులు, వల్లకవి వేంకట సుబ్బారావు, టంగుటూరు మహబూబ్‌లు అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మురళీమోహన్‌రావు మాట్లాడుతూ కళాకారుడు వినోదంతో పాటు విజ్ఞానాన్ని, మంచి మార్గాన్ని చూపిస్తాడని, అందుకే కళాకారుడు సమాజసేవకుడని పేర్కొన్నారు. అనంతరం సంగీత విభావరి, అమానుల్లాఖాన్ మిమిక్రి, రమణయ్య నృత్యం అందరిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని ట్రస్ట్ అధ్యక్షులు కేతా సుబ్బారావు నిర్వహించారు.

## పిచ్చెక్కి రోడ్లమీద పడ్డ కాంగ్రెస్ నేతలు

**గల్పిక**

మూడు నెలల క్రితం...

రేపిస్టులకు, శాడిస్టులకు ప్రసిద్ధిగాంచిన ఢిల్లీ మహానగరమది. టెన్‌జనపథ్‌లో ప్రధాని మన్మోహన్‌సింగ్, కేంద్ర హోంమంత్రి సుశీల్‌కుమార్ షిండే, రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ వ్యవహారాల పరిశీలకులు దిగ్విజయ్‌సింగ్‌లు చేతులు కట్టుకుని నిలుచుని వున్నారు. అప్పుడే వి.హెచ్.హనుమంతరావు, ఒక ట్రేలో కాఫీ కప్పులు తెచ్చి వీరిని తీసుకోమన్నాడు. అది చూసి మన్మోహన్... మేడమ్ వచ్చే టైమయ్యింది, కాఫీ ఇప్పుడొద్దులే అని అన్నాడు. వి.హెచ్ వుండి... మీకేమన్నా బ్రాందీ తెచ్చానా... కాఫీయే కదా... మేడమ్ వచ్చినా ఏం అనుకోదులే అని అన్నాడు. దానికి మన్మోహన్... నా బాధ అది కాదు, మేము కాఫీ తాగుతున్న సమయంలో మేడమ్ వచ్చిందనుకోండి... మాకు చేతులు కట్టుకునే అవకాశముండదు కదా. మేడమ్‌తో మాట్లాడాక తాగుతాంలే అని సర్దిచెప్పి వి.హెచ్‌ను పంపించేసాడు. కొద్దిసేపటికి సైకిల్ తొక్కుకుంటూ అక్కడకు రాహుల్ వచ్చాడు. అతనిని చూడగానే దిగ్విజయ్ వుండి... ఈమధ్య రాహుల్‌బాబు బాగా పొడుగొచ్చాడు కదా అని అన్నాడు. దానికి షిండే... బాగా పొడుగొచ్చేసాడు కాబట్టి ఇక హ్యాపీగా ప్రధాని పదవిని చేపట్టొచ్చు... ఏం అంటారు మన్మోహన్‌జీ అని అన్నాడు. దానికాయన... నేనదేముంది... ఇప్పుడైనా నేను రెడీనే అని చెప్పాడు. అంతలో అక్కడకు సోనియాగాంధీ వచ్చింది. ఆ చేతిలో రెండు అరటిపండ్లు వున్నాయి. అవి చూసి వీళ్ళ ముగ్గురూ... పొద్దున్నే మేడమ్‌కు అరటిపండ్లు తినే అలవాటున్నట్లుంది... అందుకే ఈ వయసులో కూడా ఇంత హుషారుగా వుండగలుగుతుందని మనసులో అనుకున్నారు. కాని సోనియా ఆ రెండు అరటి పళ్లను దిగ్విజయ్‌సింగ్‌కిచ్చి... ఈ పండ్లను మన్మోహన్‌జీ, షిండేజీలకు సమానంగా పంచమని చెప్పింది. వెంటనే దిగ్విజయ్ ఒక్కో పండును అడ్డంగా విరగ్గొట్టి రెండేసి సగాలను మన్మోహన్, షిండేల చేతిలో పెట్టాడు. అది చూసి ఆశ్చర్యంతో మన్మోహన్... ఇదేంటి దిగ్విజయ్... మేడమ్ చెరిసగం పంచమన్నారు కదా... రెండు పండ్లు వున్నప్పుడు చెరొకటి ఇస్తే సరిపోయేదిగా... రెండు పండ్లను సగానికి తుంచడమెందుకని అడిగాడు. అప్పుడు సోనియా జోక్యం చేసుకుని... కాదు మన్మోహన్‌జీ... దిగ్విజయ్ చేసింది కరెక్టే... ఆంధ్రప్రదేశ్ విభజన కోసం ఎవరిని నియమించాలా అనే దానికోసమే దిగ్విజయ్‌కు నేను ఈ టెస్ట్ పెట్టాను. పండునే అడ్డంగా తెంచలేని వాడు రేపు రాష్ట్రాన్ని అడ్డంగా ఏం చీల్చగలడు. దిగ్విజయ్ ఫార్ములా కరెక్ట్, కాబట్టి ఆంధ్రప్రదేశ్ విభజన బాధ్యతలను ఆయనకే అప్పగిస్తున్నాను. మూడు నెలల తర్వాత దిగ్విజయ్ వచ్చి ఆంధ్రప్రదేశ్ విభజన ప్రకటన తర్వాత తలెత్తిన పరిణామాల గురించి నాకు చెప్పాలి అంటూ లోపలకు వెళ్లిపోయింది.

★★★★★

మూడు నెలల తర్వాత(ప్రస్తుతం)...

టెన్‌జనపథ్‌లోకి ప్రధాని మన్మోహన్‌సింగ్ వచ్చాడు. ఆయన చేతిలో ఒక సి.డి వుంది. ఆయన నేరుగా వెళ్లి సోనియాగాంధీని కలిసి... మేడమ్, ఆంధ్రప్రదేశ్ విభజన ప్రకటన తర్వాత దిగ్విజయ్‌ను కలవమన్నారుగా... ఆయన రాలేక ఈ సి.డిని నాతో పంపించారు. విభజన ప్రకటన తర్వాత పరిణామాలన్నీ ఈ సి.డిలో వున్నాయంట అని చెప్పాడు. సోనియా ఆ సి.డిని వెంటనే వీసిడిలో పెట్టి ప్లే చేసింది. టీవీ స్క్రీన్ మీద సి.డిలోని దృశ్యాలు మొదలయ్యాయి.

★★★★★

అది అనంతపురం... ఓ చోట దిగ్విజయ్, షిండే, సీమాంధ్ర కేంద్రమంత్రుల ఫోటోలకు దండలు వేసి జనం ఏడుస్తున్నారు. పిల్లా, పెద్దా, ఆడ, మగా తేడా లేకుండా... మాకు అన్యాయం చేసి వెళ్లిపోయారా అని శోకండాలు పెడుతున్నారు. ఆ దృశ్యాలు చూడగానే సోనియాకు దుఃఖం పొంగుకొచ్చింది. కళ్లల్లో నీళ్లు ఫైలిన్ తుఫాన్‌లాగా రాసాగాయి. ఆమె గద్గద స్వరంతో... ఏదో ఫారిన్ ట్రిప్‌కు పోయినట్లు అందరూ ఒకటేసారి పోయారా... అయినా నా అనుమతి లేకుండా పోవడానికి మీకెంత ధైర్యం వచ్చింది... ఈ అమ్మతో ఒక్క మాట కూడా చెప్పరా... అని బిగ్గరగా ఏడుస్తూ మన్మోహన్‌తో... దిగ్విజయ్ నిజాయితీపరుడు. మూడు నెలల తర్వాత ఆంధ్ర విభజనపై వివరణ కోరాను... అతను రాలేక పోయినా మీ చేత పంపించాడు... గ్రేట్‌పర్సన్, అలాంటి నేతను పోగొట్టుకోవడం మనపార్టీకి తీరని లోటే అని కళ్లొత్తుకుంటూ చెప్పింది. అప్పుడు మన్మోహన్... మేడమ్, మీరు పొరపడుతున్నారు. ఎవరూ ఎక్కడికీ పోలేదు. వీళ్లంతా నిక్షేపంగానే వున్నారు. రాష్ట్ర విభజనకు నిరసనగా సీమాంధ్రలో ప్రజలు మన నాయకుల ఫోటోలకు దండలు వేసి పిండ ప్రదానాలు చేస్తూ ఇలా తమ కసిని తీర్చుకుంటున్నారు. ఈ సి.డిలో మీ ఫోటో కూడా వుంది... మీరు చూస్తే బాగుండదని నేనే ఎడిటింగ్ చేయించా... తన ఫోటోకు దండవేసే సీన్ చూడలేక దిగ్విజయ్ నా చేత ఈ సి.డిని పంపించారు అని చెప్పారు. అప్పుడు సోనియా... ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన నిర్ణయం ఆ రాష్ట్రం మీద ఎలాంటి ప్రభావం చూపిస్తుందని అడిగింది. దానికి మన్మోహన్... రాష్ట్రం మీదేమో గాని సీమాంధ్రలోని మన కాంగ్రెస్ నాయకుల మీద మాత్రం తీవ్రంగా ప్రభావం చూపిస్తుంది. కొందరు నాయకులు ఇల్లు, ఊర్లు విడిచి పోయారు. వాళ్ల ఆచూకీ దొరక్క బంధువులు ఆందోళనకు గురై 'కనపడుటలేదు' అని పత్రికలలో ప్రకటనలిస్తున్నారు. మరికొందరు నాయకులు పిచ్చిపట్టి ఉన్మాదులుగా మారి తిరుగుతున్నారు. మరికొందరు నాయకులు ఇతర పార్టీలవైపు పరుగులు తీస్తున్నారు. ఇంకొందరు రాజకీయ సన్యాసం కోసం ఆశ్రమాలు, బాబాల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఇంకొందరేమో గుడ్డలు విప్పుకుని మెంటల్ కేసుల్లాగా ప్రవర్తిస్తున్నారు అని చెప్పాడు. మరి సైల్ ఆఫ్ సింహపురి, నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి పరిస్థితి ఎలా వుందని సోనియా అడిగింది. దానికి మన్మోహన్... ఆయన గుడ్డ లిప్పుకోవడం కాదు... ఎదుటివారి గుడ్డలిప్పుదీసి 'చాకిరేవుకాడ నీసోకు' అని పాటలు పాడుకుంటూ నెల్లూరు నగరంలో నడిరోడ్ల మీదే గుడ్డలుతికే స్థాయికి ఆయన పిచ్చి ముదిరిందని చెప్పాడు.

## భక్తి శ్రద్ధలతో బక్రీద్



దర్గా వద్ద ప్రార్థనలుచేస్తున్న నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి

ముస్లింల పవిత్ర పండగ బక్రీద్‌ను ముస్లిం సోదరులు బుధవారం జిల్లా వ్యాప్తంగా భక్తి శ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. నెల్లూరు బారాషాహీద్ దర్గా ఈద్గా మైదానంలో సామూహిక నమాజులు చేసారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని ఈద్‌ముబారక్ తెలుపుకున్నారు. నెల్లూరు నగరంతో పాటు జిల్లాలోని అన్ని ప్రధాన పట్టణాల్లో ఉన్న ఈద్గాల్లో జరిగిన ప్రార్థనల్లో ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఇస్లాం త్యాగానికి ప్రతీక అని, హింస, రక్తపాతం, ఇతరులకు హానితల పెట్టడం వంటి చర్యలకు ఇస్లాంలో స్థానం లేదని బారాషాహీద్ దర్గా ఈద్గా ఇమాంఖతీబ్ సయ్యద్ అబూబకర్ అఫ్రోజ్ సాబిరి సందేశమిచ్చారు. ప్రధాన ఈద్గాలతో పాటు మసీదుల్లో రద్దీనెలకొంది. నమాజుల అనంతరం పూర్వీకులు, కుటుంబ సభ్యుల పేర్ల మీద గొర్రె, ఆవు, పొట్టేళ్ళను ఖుర్బానీ(బలి) ఇచ్చారు. మాంసాన్ని పేదలకు దానం చేసారు. ఈసందర్భంగా అన్ని మసీదుల్లో, ఈద్గాల్లో మత పెద్దలు ఖురాన్‌లోని అల్లాహ్ సందేశాలను వివరించారు. బక్రీద్ పండుగ సందర్భంగా అన్ని మసీదులు, ఈద్గాలు కిటకిటలాడాయి.

## ఆరోగ్యానికి వెరీ'గుడ్డు'




చిన్నారులకు కోడిగుడ్లు పంపిణీ చేస్తున్న వాకర్స్

గుడ్డు ఆరోగ్య సంరక్షణి, సంపూర్ణ పౌష్టికాహారం, తల్లిపాల తర్వాత మొదటి స్థానం గుడ్డుదేనని నెక్ మాజీజోనల్, ఏసి స్టేడియం వాకర్స్ అసోషియేషన్ కార్యదర్శి నలుబోలు బలరామయ్యనాయుడు పేర్కొన్నారు. ఇటీవల ఏసి సుబ్బారెడ్డి వాకర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఏ.సి. స్టేడియంలో జరిగిన ప్రపంచ కోడి గుడ్డు దినోత్సవం సందర్భంగా వాకర్స్‌కు, క్రీడాకారులకు ఉడికించిన కోడి గుడ్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బలరామయ్యనాయుడు మాట్లాడుతూ ఈ పౌష్టికాహారానికి, ఉత్పత్తి కారకులు స్వర్గీయ పద్మశ్రీ డా॥ బి.వి.రావని తెలిపారు. కంటి చూపుకు కావలసిన 'ఏ' విటమిన్ గుడ్డులో పుష్కలంగా వున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.రాఘవేంద్రశెట్టి, కోశాధికారి స్వర్ణ రమేష్‌బాబు, కోళ్లరైతులు కె.రాఘవరావు, పి.శివరామయ్య, ఎన్‌వి.రమణారెడ్డి, టి.హరిప్రసాద్, ఎన్.కిషోర్‌బాబు, వాకర్స్ డా॥ కె.అంకిరెడ్డి, వి.హజరత్‌బాబు, బి.సుందరరామిరెడ్డి, బి.శేషగిరిరావు, ఎం.ఎల్లారెడ్డి, పి.రవిచంద్ర, జి.ఓబులురెడ్డి, ఎస్‌ఎం బాషా, వి.రంగారావు, ఎ.చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

PDF Compressor Free Version



### మేషం



అశ్వని, భరణి, కృత్తిక 1 పాదము

శుభకార్య ప్రయత్నాలు అనుకూలంకాగలవు. దూర ప్రయాణాలు శుభకార్యములలో పాల్గొనడం జరుగుతుంది. కొన్ని సమయాలలో మీపై బంధుమిత్రుల ప్రభావం పనిచేస్తుంది. వ్యాపార విషయాలలో, పెట్టుబడుల విషయాలలో శ్రద్ధ అవసరం. వ్యాపారవృద్ధి అవకాశాలు చేజారవచ్చును. వృత్తిపరంగా బాగుండి ఆదాయం పెరుగుతుంది. అదనపు ఖర్చులు పైనబడతాయి.


### వృషభం



కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర 1, 2పాదాలు

అదనపు ఖర్చులకు అదుపుండదు. వ్యాపకం బాగా పెరిగి, ఆలోచనలతో టెన్షన్ పడుతుంటారు. ఉద్యోగ ప్రయత్నాలందు కొంత సమయం వేచి ఉండకతప్పదు. వృత్తిపరంగా అభివృద్ధి, గుర్తింపు, ఆదాయం పెరుగుతుంది. వ్యాపారాలలో అధికారుల వత్తిడులుండడం, సరైన అవకాశాలు రాకపోవడం, ఆదాయం తగ్గడం ఉంటుంది. కుటుంబసౌఖ్యం ఉంటుంది.

### మిథునం



మృగశిర 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

వివాహ, ఉద్యోగ ప్రయత్నాలలో కొంత పురోగతి ఉంటుంది. శుభకార్యాల ఖర్చులు, ప్రయాణాల ఖర్చులు పెరుగుతాయి. వృత్తిపరంగా క్రొత్త పరిచయాలు ఉంటాయి. దైవసేవాకార్యాలకు సహాయపడతారు. అనుకున్న పనులను ఏదో ఒక విధంగా సాగించుకొంటారు. క్రొత్త గృహోపకరణాలు కొనడం, గృహ వాహన రిపేర్లుంటాయి. రావలసిన బాకీలు కొంతరావడం ఉంటుంది.


### కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

అవసరాలకు డబ్బు చేతికందుతుంది. రావలసిన బాకీలు కొంత లభించడం, కోర్టు వ్యవహారాలలో కొంత అనుకూలత షేర్లు, పెట్టుబడులపై లాభాలుంటాయి. చేయుచున్న పనులు సక్రమంగా జరుగుతాయి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగుతుంది. ప్రతి విషయంలో చికాకు, కోపం ప్రదర్శిస్తారు. ముఖ్యమైన వ్యవహారాలలో సొంత నిర్ణయాలు చేస్తారు.

### సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

కోర్టు కేసులు వాయిదాపడగలవు. బంధుముఖ్యులకు అనారోగ్య బాధలుంటాయి. కుటుంబంలో చిన్న విషయాలపై మాట పట్టింపులు వచ్చే అవకాశం ఉన్నది. వృత్తిజీవనంలో ఆదాయం పెరగడం, కొత్త అవకాశాలు దొరుకుతాయి. వ్యాపార వర్గాలకు పోటీ పెరిగి నిరుత్సాహముంటుంది. క్రొత్తవారితో అధికారులతో జాగ్రత్తగా మెలగండి. ఉద్యోగపరంగా అధికారుల సహకారం ఉంటుంది.

### కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

చేపట్టిన పనులు సరిగా జరగక మార్పులు చేర్పులు చేయవలసి వస్తుంది. అనుకోని ప్రయాణాలు, శుభకార్యాలలో పాల్గొనడం, ఖర్చులుంటాయి. ప్రభుత్వ అనుమతులలో ఆలస్యం జరగడం, కోర్టు వ్యవహారాలలో వ్యతిరేకతలుంటాయి. వృత్తి వ్యాపారాలలో ఆశించిన రాబడి ఉండదు. వ్యాపార అవకాశాలు చేజారిపోవచ్చును. శరీరానికి గాయాలు తగలవచ్చును.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 18.10.2013 నుండి
తేది. 24.10.2013 వరకు

ఈ వారము మీన మేష వృషభ మిథున రాశులలో చంద్రుడు, మేషంలో కేతువు, మిథునంలో గురువు, సింహంలో కుజుడు, తులలో రవి శని బుధ రాహువులు, వృశ్చికంలో శుక్రుడు సంచరిస్తారు.

### పంచాంగము:

ముహూర్తములు

తేది 18 శుక్రవారం ఉదయం గంట 8.30 నుండి గంట 10.30లోగా వృశ్చికలగ్నము వివాహ, గృహారంభ వ్యాపారములు. రాత్రి గంట 8.00 నుండి గంట 10.00లోగా వృషభలగ్నమున వివాహ గృహప్రవేశాలు.

తేది 23 బుధవారం ఉదయం గంట 9.00 నుండి 10.30లోగా వృశ్చికలగ్నమున వివాహ గృహారంభ వ్యాపారములు. రాత్రి గంట 7.50 నుండి 9.45లోగా వృషభలగ్నమున గృహప్రవేశము.

### ఆశ్వయుజ మాస కృష్ణ పక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 18 | శుక్ర | పూర్ణిమ | రా॥గం. 4.30వ॥ |
| తేది. 19 | శని | పాడ్యమి | రా॥గం. 4.20వ॥ |
| తేది. 20 | ఆది | విదియ | రా॥గం.4.50వ॥ |
| తేది. 21 | సోమ | తదియ | రా॥గం. 5.40వ॥ |
| తేది. 22 | మంగళ | చతుర్థి | పూర్తిగా |
| తేది. 23 | బుధ | చతుర్థి | ఉ॥గం.7.14వ॥ |
| తేది. 24 | గురు | పంచమి | ఉ॥గం.9.00వ॥ |


### తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

కుటుంబసభ్యులకు అనారోగ్య బాధలుంటాయి. గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి. షేర్లు పెట్టుబడి రంగాలు కొద్ది నిరుత్సాహపరుస్తాయి. శుభకార్యాలలో పాల్గొన్నందున ఖర్చులు పెరగడం, ప్రయాణాలుండటం, బంధువర్గంలో అనారోగ్య బాధలుంటాయి. ఉద్యోగులకు పనిభారం ఉండినను అధికారులకు మరింత సన్నిహితం కాగలరు. ఆర్థికపరమైన నిర్ణయాలు తొందరపడి చేయకండి.

### వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఉద్యోగులకు అదనపు బాధ్యతలు పనిభారం ఉంటుంది. అనుకున్న పనులు నిదానంగా జరగడం వల్ల చిరాకు, కోపం ఉంటుంది. ఉద్యోగార్థులకు అవకాశాలు రావడముకు ఇంకా సమయమున్నది. ఆదాయము కంటే ఖర్చులు పెరిగిపోతాయి. శుభకార్యాలలో పాల్గొనడం, నూతన వస్తువులు యంత్రాలు వంటివి కొనడం జరుగుతుంది. యజమానులకు వర్కర్లతో సమస్యలుంటాయి.

### ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

కుటుంబంలో ఒకరిద్దరికి అనారోగ్య బాధలుంటాయి. పెట్టుబడి రంగాలు, షేర్లు కొంత నిరుత్సాహపరుస్తాయి. పిల్లల ఉద్యోగ వివాహ ప్రయత్నాలు ఆశాజనకంగా ఉంటాయి. పన్నులు, చెల్లింపులు సకాలంలో పూర్తిగా చెల్లిస్తారు. అలర్జీ, శ్వాసకోస రుగ్మతలుంటాయి. గృహ మార్పు, వస్తు వాహన గృహ రిపేర్లుంటాయి. అనుకున్న పనులు సక్రమంగా జరగగలవు.

### మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

స్థిరాస్తుల లావాదేవీల విషయంలో కొంత ఆగటం మంచిది. ఉద్యోగప్రయత్నాలు, వివాహ ప్రయత్నాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ఆర్థికపరంగా వేసుకున్న ప్రణాళిక పథకాలు మంచి ఫలితాన్ని ఇచ్చి, ఆదాయం పెరుగుతుంది. వృత్తిపరంగా తీరిక లేకుండా శ్రమపడతారు. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు మంజూరు కాగలవు. దూరప్రయాణాలు నిర్ణయంకాగలవు.


### కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

అధికారుల అనుకూలత, స్థానమార్పులు ఉద్యోగులకు ఏర్పడవచ్చును. స్థిరాస్తి వ్యవహారాలు పరిష్కారానికి తెచ్చుకొనే ప్రయత్నాలు చేస్తారు. బకాయిలు మిమ్మల్ని పొగిడి పనులు జరిపేటట్లు ప్రయత్నాలు చేస్తారు. అనుకున్న పనిని ధైర్యంగా పట్టుదలతో నిర్వహించి విజయం సాధిస్తారు. కుటుంబంలో కొద్ది అవగాహన లోపం వల్ల విభేదాలు వస్తాయి.

### మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

దూరప్రయాణాలుంటాయి. నూతన పెట్టుబడుల విషయంలో ఆస్థి వ్యవహారాలలో తొందరపడవద్దు. అనుకున్న పనులు సానుకూలం కాగలవు. గృహోపకరణాలు, క్రొత్త వస్తువులు కొంటారు. ఉద్యోగ ప్రయత్నాలలో, ఇంటర్వ్యూలలో సంతృప్తికరంగా ఉంటుంది. ఇతరులకు ఋణాలు, హామీలివ్వడం చేయకండి. బంధువర్గంలో అనారోగ్య వార్తవింటారు.

## హైదరాబాద్‌లో నెల్లూరోడి ఘనకార్యం

నెల్లూరు జిల్లా చిల్లకూరు గ్రామానికి చెందిన గోతాల శ్రీనివాసులు అలియస్ వాసు బంజారాహిల్స్‌లోని ఎన్‌బిటి కాలనీలో నివాసం ఉంటూ పెయింటింగ్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. విజయవాడ అల్లె తివారి వీధికి చెందిన ఆలేటి కిరణ్ కిషోర్ అలియాస్ సుధాకర్ సైనిక్‌పురి కాలనీలో నివాసం ఉంటూ చర్లపల్లిలోని ఓ ప్రైవేటు సంస్థలో పని చేస్తున్నాడు. వీరిద్దరూ కలిసి 4నెలల క్రితం బంజారాహిల్స్‌లోని ఇంటికి ట్యాప్ కనెక్షన్ కోసం హాఫీజ్ అనే ఇన్‌స్పెక్టర్‌ని కలిశారు. ఏర్పాటు చేయడంలో జాప్యం చేస్తుండటంతో ఇద్దరూ నకిలీ ఏసిబి అవినీతి అధికారుల అవతారం ఎత్తారు. నీపై అవినీతి కేసులున్నాయి సెటిల్ చేసుకోవాలని హాఫీజ్‌ను బెదిరించి రూ.2 లక్షలు డిమాండ్ చేసి రూ.1.25 లక్షలు తీసుకున్నారు. ఈ పనేదో సులభంగా హాయిగా ఉందని భావించి మరికొంత మంది వద్ద ఇలాగే డబ్బు, బంగారాన్ని వసూలు చేసారు. ఈ క్రమంలో శేరిలింగంపల్లి సర్కిల్-2 ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ బుచ్చిరెడ్డి సురేంద్రరెడ్డిని అధిక మొత్తంలో డిమాండ్ చేయడంతో అతను చందానగర్ పోలీసులకు సమాచారం అందించాడు. గచ్చిబౌలి మహారాజా హోటల్ వద్దకు రమ్మని చెప్పడంతో ఇద్దరూ బుల్లెట్ వాహనంపై వచ్చారు. మాటు వేసిన పోలీసులు వీరిద్దరిని పట్టుకుని, వీరి నుంచి రూ.4.5 లక్షలు విలువైన నగదు, బంగారంతో పాటు బుల్లెట్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

## కిలాడి "లేడి" అరెస్ట్

### రూ10 లక్షలు విలువైన 38 సవర్ల బంగారం స్వాధీనం

అమాయకంగా కనబడుతూ, బస్టాండ్‌లో ఏమరుపాటుగా ఉన్న, ఆదమరచి కునుకు తీస్తున్న ప్రయాణీకుల పర్సులు, బ్యాగులు ఎత్తుకెళుతూ గత కొంత కాలంగా పోలీసుల కళ్ళు గప్పి తిరుగుతున్న కిలాడి లేడీ దొంగను ఎట్టకేలకు సిసియస్ పోలీసులు పట్టుకున్నారు. నెల్లూరు నగరంలోని ముత్తుకూరు బస్టాండ్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న అమావాస్య నరసమ్మ అలియాస్ మాల నరసమ్మను అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో మాయలేడి ఎక్కడెక్కడ బ్యాగులు చోరీ చేసింది వివరాలను విచారించి నేరాన్ని ఒప్పుకుంది. 12వ తేదీ సిసియస్ పోలీస్‌స్టేషన్‌లో సిఐ బాజీజాన్‌సైదా, 4వ నగర సిఐ రామారావు ఆధ్వర్యంలో నెల్లూరు నగర డిఎస్పీ పి. వెంకటనాథ్‌రెడ్డి విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జిల్లా నగర పరిధిలోని పలు చోట్ల చేసిన నేరాలకు సంబంధించి మొత్తం 38 సవర్ల బంగారు ఆభరణాలను ఆమె నుంచి స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్పీ తెలిపారు. వీటి విలువ సుమారు రూ 10 లక్షలు ఉంటుందని తెలిపారు. నరసమ్మను పట్టుకోవడంలో కృషి చేసిన సిసియస్ సిఐ బాజీజాన్‌సైదా, 4వ నగర సిఐ రామారావు, సిసియస్ సిబ్బంది ఎస్.వెంకటేశ్వర్లు, బి.నాగలక్ష్మీ, పి.శేషయ్య, ఆర్.సురేష్, కె.ఇలియాజ్, షేక్ అమీన్, షేక్ రియాజ్, అమర్‌బాబు, ఎల్.మాధవి, రామాంజనేయరెడ్డిలను జిల్లా ఎస్పీ పివియస్ రామకృష్ణ అభినందించి రివార్డులు ప్రకటించారు.

## వాచ్‌మెన్ హత్య

### ఆలయంలో దొంగల కిరాతకం

నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలంలోని చెముడుగుంట గ్రామంలో 12వ తేదీ రాత్రి గ్రామదేవత చింతాలమ్మ పరమేశ్వరి ఆలయంలో వాచ్‌మెన్ డబ్బుగుంట సుబ్బరామయ్య(65)ను దోపిడీ దొంగలు అత్యంత కిరాతకంగా హత్యచేసి ఆలయంలోని హుండీని అపహరించుకెళ్ళారు. చోరీకి గురైన హుండీ ఆలయానికి అరకిలోమీటరు దూరంలో పొలాల్లో పడేశారు. నిందితులు హుండీని అక్కడకు తీసుకెళ్ళి తాళాలు పగులగొట్టి అందులోని నగదు అపహరించుకెళ్ళారు. ఈ సంఘటనపై గ్రామస్తులు వెంకటాచలం పోలీసులకు సమాచారం అందించారు. వెంకటాచలం ఎస్సై సోమయ్య తన సిబ్బందితో సంఘటనాస్థలానికి చేరుకుని హత్య జరిగిన తీరుపై ఆరాతీసి అనంతరం ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి మృతుని కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**జిల్లా ఎస్పీ పరిశీలన :**

నెల్లూరు జిల్లా ఎస్పీ రామకృష్ణ ఆదివారం ఉదయం చెముడుగుంటకు వచ్చారు. ఆలయంలో హత్యకు గురైన సుబ్బరామయ్య మృతదేహాన్ని పరిశీలించారు. హత్య సంఘటన ఛేదించేందుకు నెల్లూరు నుంచి పోలీసు జాగిలాన్ని తీసుకువచ్చారు. వేలిముద్రల నిపుణులు పరిశీలించారు. కాని ఎక్కడ కూడా నిందితుల వేలిముద్రల జాడలేదు. దోపిడీలు చేయడంలో ఆరితేరిన వారే ఈ ఘాతుకానికి పాల్పడి వుంటారని పోలీసులు భావిస్తున్నారు.

## మిస్టరీ మర్డర్

నెల్లూరుజిల్లా నెల్లూరు రూరల్ మండలం ఆమంచర్లలో ఈ నెల 12వ తేదీన జరిగిన సమైక్యాంధ్ర దళిత జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బిరదవోలు చిరంజీవి(35) హత్య మిస్టరీగా మారింది. నెల్లూరులోని మోహన్‌సాయి ఫైనాన్స్ కంపెనీలో రికవరీ ఏజెంటుగా పనిచేసే చిరంజీవి 11వతేదీ ఇంటి నుంచి బయలుదేరి నెల్లూరులో తాను పనిచేసే ఫైనాన్స్ కంపెనీకి వెళ్లాడు. 12వ తేదీ మధ్యాహ్నం ఆమంచర్ల గ్రామానికి రహదారి పక్కన కాలువలో శవమై పడివున్నాడు. పశువుల కాపరులు హత్య జరిగిన విషయాన్ని గ్రామంలో తెలపడంతో కుటుంబసభ్యులు, బంధువులు, స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న నెల్లూరు రూరల్ సిఐ వి.సుధాకర్‌రెడ్డి, ఎస్సై ఏ.వెంకట్రావు, డాగ్ స్క్వాడ్ క్లూస్‌టీంలు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుని గొంతు, వీపుపై కత్తితో పొడిచి హత్య చేసినట్లు సిఐ తెలిపారు. మృతుని మోటారు సైకిల్ రోడ్డు పక్కనే నిలిపి వుంది. క్లూస్‌టీం పలు ఆధారాలను సేకరించింది. త్వరలోనే హత్యకు కారణాలు తెలుసుకుని హంతకులను పట్టుకుంటామని సిఐ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## ప్రమాదంలో లెక్చరర్ మృతి

నెల్లూరు రూరల్ మండలం కలివెల పాళెంకు చెందిన వేదగిరి పార్థసారధి రెడ్డి(42) ప్రమాదవశాత్తు లారీని వెనుక నుంచి ఢీకొట్టి మృతి చెందిన సంఘటన 12వ తేదీ జాతీయరహదారి వద్ద చోటు చేసుకుంది. నెల్లూరు రూరల్ పోలీసుల కథనం మేరకు కలివెలపాళెంకు చెందిన పార్థసారధిరెడ్డి నెల్లూరులోని వెంకటేశ్వర కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. 12వ తేదీ రాత్రి కళాశాలలో జీతం తీసుకొని ఇంటికి బయలుదేరుతుండగా జాతీయ రహదారిపై నారాయణ ఇంజీనీరింగ్ కళాశాల సమీపంలో ఓ లారీని వెనుక నుంచి ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. నెల్లూరు రూరల్ ఎస్సై అళహరి వెంకట్రావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## జిల్లా విద్యాశాఖ సమావేశాలు

సమైక్యాంధ్ర ఉద్యమ నేపథ్యంలో నెల్లూరు జిల్లాలోని పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు బోధన, పరీక్షలకు సంబంధించి అకాడమిక్ క్యాలెండర్ తదితర విషయాలపై ఈనెల 20, 21 తేదీల్లో జిల్లా విద్యాశాఖ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.రామలింగం తెలిపారు.

నెల్లూరు మూలపేటలోని సిఏఎం హైస్కూలు ఆవరణలో 20న ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో, 21న ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

PDF Compressor Free Version



# ముగిసిన దసరా ఉత్సవాలు



దసరా ఉత్సవాలు ముగింపు సందర్భంగా నెల్లూరు నగరంలోని వివిధ దేవస్థానాల్లో మంగళవారం విశేష పూజలు, అలంకారాలు, అన్నసంతర్పణ తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. దర్గామిట్ట శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఉత్సవాలు ముగింపు సందర్భంగా సోమవారం మధ్యాహ్నం అన్నసంతర్పణ చేసారు. ఉభయధాతలుగా ఆల్తూరు ఆదినారాయణ రెడ్డి కుటుంబసభ్యులు వ్యవహరించారు. స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి దర్బారు అలంకారం కనులవిందుగా జరిగింది. ఉభయ దాతగా ది ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అండ్ పాన్‌బ్రోకర్స్ అసోసియేషన్ వ్యవహరించింది. ఈ సందర్భంగా మూలవార్లకు విశేషపూజలు, పూలంగిసేవ తదితర ఏర్పాట్లను వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి మంగళవారం వసంతోత్సవం నిర్వహించారు. అమ్మవారిని రథంపై ఊరేగించారు. ప్రధాన వీధులగుండా ఊరేగింపు సాగింది. ఈ కార్యక్రమాన్ని పాలకమండలి సభ్యులు పర్యవేక్షించారు. సంతపేట కంసాలివీధిలోని హరిహరనాథ స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. మూలాపేటలోని శ్రీమతీద్రౌపతీదేవి సమేత శ్రీ కృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానంలో పార్వేట ఉత్సవం వైభవంగా జరిగింది. సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి అభిషేకం, పల్లకీసేవ, పూలంగిసేవ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. నెల్లూరు జిల్లా టిపిగూడూరు మండలం వరిగొండ గ్రామంలోని జ్వాలాముఖి అమ్మవారి దేవస్థానంలో విజయదశమి సందర్భంగా సోమవారం ఉదయం అమ్మవారికి అభిషేకం, సాయంత్రం పూలంగిసేవ, రాత్రి కలశోద్వాసన, పారువేట తదితర కార్యక్రమాలను నిర్వహించారు. సూళ్లూరుపేట



శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు.

## ఆదర్శ్ నాయర్ "భామాకలాపం"

హైదరాబాద్ రవీంద్రభారతిలో ఈనెల 11వతేదీ సాయంత్రం సంగమం ఫౌండేషన్, శ్రీ సిద్ధేంద్ర కూచిపూడి నాట్యకళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో యువనృత్య కళాకారుడు, నెల్లూరీయుడు మాస్టర్ కె.ఆదర్శ్‌నాయర్‌చే "భామాకలాపం" నృత్యప్రదర్శన కనులవిందుగా జరిగింది. ఇందులో సూత్రధారిగా వేదాంతం సత్యనరసింహశాస్త్రి, సత్యభామగా కె.ఆదర్శ్‌నాయర్, శ్రీకృష్ణుడిగా శారదకిల్లి నటించి తమ హావభావాలతో అందరినీ మైమరపించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏ.పి.రాష్ట్ర అధికార భాషాసంఘం అధ్యక్షులు మండలి బుద్ధప్రసాద్, విశిష్టఅతిథులుగా ప్రముఖ సినీనటి కళాభారతి జమున, ప్రఖ్యాత కూచిపూడి కళాకారిణి పద్మశ్రీ డా॥ శోభానాయుడు, గౌరవఅతిథిగా రంగస్థల ప్రముఖులు పద్మశ్రీ సురభి నాగేశ్వరరావు(బాబ్జి), సంగమం వ్యవస్థాపకులు సంజయ్ కిషోర్‌లు పాల్గొన్నారు.

## ఐఎంఏ అధ్యక్షుడిగా డాక్టర్ శ్రీనివాసతేజ



ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) నెల్లూరు జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ శ్రీనివాసతేజ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నెల్లూరు నగరం ఐఎంఏ హాల్లో బుధవారం డాక్టర్ ఏవి సుధాకర్‌రావు అధ్యక్షతన డాక్టర్ల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఐఎంఏ ఉపాధ్యక్షులుగా ఎం.వి.రమణయ్య రామకృష్ణ, పిట్టి మల్లికార్జున, కార్యదర్శిగా పి.చంద్రశేఖర్ కోశాధికారిగా బివియస్ రవిశంకర్ ఎంపికయ్యారు. నెల్లూరు మెడికల్ సొసైటీ ఛైర్మన్‌గా అమరేంద్రనాథ్‌రెడ్డి కార్యదర్శిగా భక్తవత్సలం, కోశాధికారిగా రవీంద్రనాథ్ ఠాగూర్‌లు ఎంపికయ్యారు.

## "బీస్" వివాహ పరిచయ వేదిక



సభలో ప్రసంగిస్తున్న కలెక్టర్ ఎన్.శ్రీకాంత్

నెల్లూరు పురమందిరంలో ఈనెల 13న బలిజ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆఫ్ సింహపురి(బీస్) ఆధ్వర్యంలో బలిజ, కాపు, తెలగ వివాహ పరిచయ వేదికను నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి, తిరుపతి, హైదారాబాద్, కడప, ఒంగోలు, చెన్నై, కందుకూరు తదితర ప్రాంతాల నుండి 257 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ముఖ్య అతిధిగా జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, పరిచయ వేదిక వ్యవస్థాపకులు ఏకోటి కోటేశ్వరరావు, వి.ఆర్ కాలేజి రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ అలంకి రాధిక, ఎస్వీయూనివర్శిటీ ఆచార్యులు వెంకటముని, ఒంగోలుకు చెందిన డాక్టర్ రామయ్య, నెల్లూరు జిల్లా పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధి శ్రీహరిబాబు, రిటైర్డ్ అడిషనల్ సూపరిటెడెంట్ మధుసూదన్‌రావు, కార్య నిర్వాహకులు యాదాల చక్రధర్, మయూరి ప్రసాద్, లక్కాకుల పెంచలయ్య, ఆనాల వెంకటరావు, గార్లపాట సుబ్బారావు, తోట లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

సన్నాహాలు చేస్తున్నానని, ఇక్కడ కార్పొరేట్ స్థాయి చదువు అతిసామాన్యుడికి ఉచితంగా అందించడమే తన ధ్యేయమని చెప్పాడు.

ఇవి చాలు ఆయనని అపరదానకర్ణుడని చెప్ప డానికి. నెల్లూరుజిల్లాలో వేలకోట్లు సంపాదించిన వారు చాలామందివున్నారు, కానీ కేవలం తను పుట్టిన ఊరుపై మమ కారంతో ఇన్ని కోట్లు ఖర్చుపెట్టి ఇంకా తాను సంపాదించేదంతా నెల్లూరీయులకే అంకితం అంటున్న వేమిరెడ్డికి భగవంతుడు ఇంకా ఐశ్వర్యంతో పాటు ఆయురారోగ్యాలు అందించాలని ఆశీద్దాం.

నెల్లూరురూరల్ కనుపర్తిపాడు సమీపంలో గొలగమూడిరోడ్డులో ప్రభాకర్‌రెడ్డి నూతనంగా నిర్మించిన వి.పి.ఆర్.కన్వెన్షన్ సెంటర్‌ను తిరుమలతిరుపతి దేవస్థానముల ఆధ్వర్యంలో తలపెట్టిన శ్రీశ్రీనివాస కల్యాణ మహోత్సవంతో నెల్లూరీయులకు పరిచయం చేస్తున్నారు. ఈ నెల 19వతేదీ శనివారం ఉదయం సుప్రభాతసేవతో మొదలయ్యే స్వామివారి సేవా కార్యక్రమాలు ఉదయం తోమాల అర్చనలతో ముగుస్తాయి. సాయంత్రం 5గంటల నుండీ జరిగే కల్యాణ మహోత్సవంతో ఈ ప్రాంగణం నెల్లూరీయుల సేవకు సిద్ధమౌతోంది.

అక్టోబర్ 23వతేదీ బుధవారం సాయంత్రం 5గంటలకు సుప్రసిద్ధ డ్రమ్స్ మాస్టర్ శివమణిచే సుమధుర సంగీత లహరితో పాటు పాడుతాతీయగా విజేతలు తేజస్విని, శివ, పరమేశ్వర్, షణ్ముఖప్రియ, సుదీప్‌లచే సంగీత విభావరి కార్యక్రమం జరుగనుంది.

అక్టోబర్ 24వతేదీ గురువారం సాయంత్రం 5గంటలకు ప్రముఖ సినీ నేపథ్యగాయకుడు పద్మభూషణ్ యస్.పి.బాలసుబ్రహ్మణ్యం ఆయన సోదరి యస్.పి.శైలజ, కుమారుడు యస్.పి. చరణ్‌లచే స్వర నీరాజనం కార్యక్రమం జరుగనుంది.

నవంబర్ 15 నుండి ఈ ప్రాంగణాన్ని అన్ని శుభవేడుకలకు ఇవ్వడానికి సన్నాహాలు చేస్తున్నారు.




## నెల్లూరులో అంతర్జాతీయ రచయితల పండుగ



పోస్టరును విడుదల చేస్తున్న రాజారామిరెడ్డి, పెరుగు రామకృష్ణ తదితరులు

నెల్లూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయంలో మంగళవారం అంతర్జాతీయ రచయితల పండుగ పోస్టరును విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ రాజారామిరెడ్డి విడుదల చేసారు. ఇండియా ఇంటర్ కాంటినెంటల్ కల్చరల్ సంస్థ, విక్రమసింహపురి విశ్వవిద్యాలయం, మురళీకృష్ణ హోటల్స్, నారాయణ ఇంజనీరింగ్ కళాశాల, సన్నిధి ప్రచురణల సంయుక్త ఆధ్వర్యంలో నెల్లూరులో నవంబర్ 9, 10తేదీల్లో అంతర్జాతీయ రచయితల పండుగను నిర్వహిస్తున్నట్లు ప్రముఖ రచయిత పెరుగు రామకృష్ణ పేర్కొన్నారు. నెల్లూరులో అంతర్జాతీయ స్థాయిలో ఇలాంటి కార్యక్రమం చేపట్టడం అదృష్టమన్నారు. 12దేశాల నుంచి 40మంది రచయితలు పాల్గొంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ నాగేంద్రప్రసాద్, రచయిత అల్లు భాస్కరరెడ్డి, అధ్యాపకురాలు డా॥ సరోజాదేవి, సత్యప్రసాద్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గోవిందా

(మొదటిపేజీ తరువాయి)

ఒకవేళ వైకాపా, టీఆర్ఎస్‌లు ఎంపీ సీట్లు గెలిచినా కాంగ్రెస్‌కు మద్దతు తెలుపుతాయనే నమ్మకం లేదు. మరి ఎన్నికలలోపు విభజన తంతును ముగించగలరా? అన్నది ప్రశ్న. ఈమేరకు కేంద్ర ప్రభుత్వం వేగంగానే ఫైలును ముందుకు కదిలిస్తుంది. అయితే సీమాంధ్రలో సమస్యలు పరిష్కరించకుండా ముందుకు కదలొద్దని ప్రధానప్రతిపక్షం బీజేపీ కూడా హెచ్చరించిన నేపథ్యంలో కేంద్రం సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరించుకుని, అడ్డంకులు తొలగించుకునేందుకు రాష్ట్రానికి సంబంధించిన అన్ని శాఖల వివరాలను రాబట్టుకుంటుంది. అలాగే విభజన ప్రక్రియకు రాజ్యాంగ ప్రతిబంధకాలు కూడా వున్నాయి. ఆర్టికల్-3 ప్రకారం విభజనకు పూనుకున్నారు. దీనికి ముందుగా 371సెక్షన్‌ను పార్లమెంటు మూడింట రెండొంతుల మెజార్టీతో ఆమోదించాల్సి వుంది. ప్రధాన ప్రతిపక్షంతో పాటు ఇతర ప్రాంతీయపక్షాల మద్దతు లేనిదే పార్లమెంటులో 371 క్లాజు10ను మార్చలేరు. ఆర్టికల్-3 ప్రకారం రెండుసార్లు తెలంగాణ బిల్లు అసెంబ్లీకి రావాల్సి వుంటుంది. అసెంబ్లీలో బిల్లుపై ఓటింగ్ జరిగినా లేక అభిప్రాయ సేకరణ జరిగినా మెజార్టీ సభ్యులు బిల్లును వ్యతిరేకిస్తారు. ఇలా అసెంబ్లీ తీర్మానం పొందని బిల్లును రాష్ట్రపతి పార్లమెంటుకు పంపుతాడా అనేది సందేహమే. సాంప్రదాయాలకు విరుద్ధంగా రాష్ట్రాల విభజన చేపట్టవద్దని, ఇలాంటి విభజనలు సమైక్య స్ఫూర్తిని దెబ్బతీస్తాయని రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కేంద్రప్రభుత్వానికి సూచిస్తున్నట్లు తెలుస్తుంది.

అయితే కాంగ్రెస్ గుడ్డిగా తొందరపడింది. కాబట్టి ఆ దిశగానే పోతుంది. బురదలో అడుగేసింది.. ఇప్పుడు కాలు తీసి కడుక్కోలేని స్థితిలో వుంది.

## తలోదారి

(మొదటిపేజీ తరువాయి)

మునిగిపోతుందని వీళ్లకు తెలుసు. కాని ఏం చేస్తారు. మనసు చంపుకుని తాము విమర్శలు చేసిన జగన్, చంద్రబాబుల క్రింద పనిచేయలేరుగా! మునిగినా తేలినా కాంగ్రెస్‌లో వుండాల్సిందే! ముంచినా తేల్చినా సోనియాను నమ్ముకోవాల్సిందే! కాంగ్రెస్‌లో వుండలేమనుకుంటే రాజకీయ సన్యాసం స్వీకరించాల్సిందే! సీమాంధ్ర కాంగ్రెస్ నేతల ముందున్న దారులివే! ఎవరు ఏ దారిలో వెళతారో చూద్దాం!

## బస్సు

(2వ పేజీ తరువాయి)

ప్రైవేట్ ట్రావెల్స్‌కు పోయిందనేది నిర్వివాదాంశం. ఎట్టకేలకు రవాణామంత్రి బొత్స - ఆర్టీసీ కార్మికుల మధ్య జరిగిన చర్చలు సఫలం కావడంతో కార్మికులు సమ్మెను విరమించారు. 60రోజులుగా దుమ్ముపట్టి వున్న బస్సులను కార్మికులు కడిగి బయటకు తీసారు. ఇప్పుడు రోడ్ల మీద ఆర్టీసీ బస్సులు కనపడుతున్నాయి. ప్రయాణికులకు ఏదో వెలితి తీరినట్లయ్యింది. ప్రైవేట్ వాహనాల వాళ్లు మాత్రం ఉసూరుమంటున్నారు. జిల్లాలో నిన్న మొన్నటివరకు పందుల గుంపులతో కనిపించిన బస్టాండ్‌లు ఇప్పుడు బస్సులతో కళకళలాడుతున్నాయి.

## సిల్లీ దీక్ష

(మొదటిపేజీ తరువాయి)

ఢిల్లీలో కూర్చున్నాడు. అంతేకాదు, సీమాంధ్రకు న్యాయం చేసాకే తెలంగాణబిల్లును ముందుకు తీసుకెళ్లాలంటూ ఆ పార్టీ వారి చేత చెప్పించగలిగాడు. బీజేపీ ప్రధాన మంత్రి అభ్యర్థి నరేంద్ర మోడీ, బీజేపీ అధ్యక్షుడు రాజ్‌నాథ్‌సింగ్‌లు బాబును ఫోన్‌లో పరామర్శించారు. ఢిల్లీ దీక్ష ద్వారా కాంగ్రెస్ అధిష్టానం దిగిరావాలని, రాష్ట్రానికి సమన్యాయం జరగాలని చంద్రబాబు కోరుకోలేదు. బీజేపీతో పొత్తు కుదరాలని, పలు జాతీయపార్టీల దృష్టిలో తాను పడాలని భావించాడు. ఆ దిశగానే ఫలితం సాధించాడు.

## నిలుస్తారా?

(2వ పేజీ తరువాయి)

ఎమ్మెల్యేలలో కొందరి పట్ల అనుమానాలున్నాయి. మన జిల్లాలో పదిమంది ఎమ్మెల్యేలలో నలుగురు కాంగ్రెస్, నలుగురు టీడీపీ, ఇద్దరు వైకాపాకు చెందినవాళ్లు, రాష్ట్ర అసెంబ్లీకి తెలంగాణబిల్లు వస్తే వ్యతిరేకిస్తామని ఏపి ఎన్జీఓలకు 10మంది ఎమ్మెల్యేలు ప్రమాణపత్రాలిచ్చారు. కాబట్టి ఈ విషయంలో వీళ్లు ఐక్యంగా నిలబడడం సంతోషమే. తెలంగాణ బిల్లు విషయంలో సీమాంధ్రలోని ప్రతిజిల్లాలోనూ ఎమ్మెల్యేలంతా ఒక తాటిపైకి రావాలి.

PDF Compressor Free Version



# గూడూరు డివిజన్ వార్తలు

## టినోట్‌కు వ్యతిరేకంగా బల్లి హామీ



హామీపత్రంపై సంతకం చేస్తున్న ఎమ్మెల్యే బల్లి

టినోట్ తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేస్తానని జేఏసీ నాయకులకు హామీ పత్రంపై 11వ తేదీన ఎన్‌జిఓ భవన్‌లో గూడూరు ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్‌రావు సంతకం చేసి ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేను ఈ రాష్ట్ర సమైక్యతను ప్రగాఢంగా కోరుకుంటున్నానని, రాష్ట్ర విభజనపై ఆంధ్రప్రదేశ్ శాసనసభలో చర్చ లేక తీర్మానానికి ఈ అంశం వచ్చినప్పుడు నేను రాష్ట్ర సమైక్యతను కోరుకుంటున్నానని తెలియజేస్తానని, రాష్ట్ర సమైక్యతకు కట్టుబడి ఓటు వేస్తానని తెలుగుతల్లి సాక్షిగా ప్రమాణం చేస్తున్నానని ఒక ప్రమాణపత్రం ద్వారా విలేకర్లకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు మస్తానయ్య, రాజేంద్రప్రసాద్, కె.ఆర్.రెడ్డి, దశరథరామిరెడ్డి, రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు శివకుమార్, గూడూరు జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షులు అనిమెళ్ళ శివకుమార్, జక్కంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నీలంరాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమాన్ని ఆపేది లేదు

:: జేఏసీ నాయకుల వెల్లడి ::



సోనియా, దిగ్విజయ్‌సింగ్, షిండే చిత్రాలకు సమాధులు కట్టిన సమైక్యవాదులు

సమైక్యాంధ్ర ప్రకటన వచ్చేవరకు ఉద్యమాన్ని ఆపేది లేదని సమైక్య రాష్ట్ర పరిరక్షణ వేదిక నాయకులు వెల్లడించారు. గూడూరు టవర్‌క్లాక్ వద్ద 12వ తేదీ రాష్ట్ర విభజనకు పూనుకున్న సోనియాగాంధీ, దిగ్విజయ్‌సింగ్, షిండేలకు వ్యంగ్యంగా సమాధులను నిర్మించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 75రోజులుగా సీమాంధ్ర ప్రాంత ప్రజలు ఆందోళనలు నిర్వహిస్తున్నా కేంద్రప్రభుత్వానికి చీమ కుట్టినట్లుగా కూడా లేదన్నారు. సీమాంధ్రప్రజాప్రతినిధుల చేతకానితనం, పదవీ వ్యామోహంతోనే రాష్ట్రవిభజన జరుగుతుండడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు మేల్కొని సీమాంధ్ర ప్రజల మనోభావాలను కేంద్రానికి నివేదించాలన్నారు. అనంతరం దీక్షా శిబిరంలో జేఏసీ నాయకులు మస్తానయ్య, వేగూరు రాజేంద్రప్రసాద్, యేకుల రవిచంద్ర, ఓబులేసు, ఫిరోజ్‌ఖాన్ జక్కంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, నీలం రాజారెడ్డి పాల్గొన్నారు. కాగా జేఏసీ నాయకులతో పాటు వైయస్సార్సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త పాశం సునీల్‌కుమార్, వారి ముగ్గురి సమాధులపై పూలుచల్లి నివాళులర్పించారు. దీక్షలో వున్న జేఏసీ నాయకులకు సంఘీభావం తెలిపారు.

## వైభవంగా అమ్మవారి అలంకరణలు



గూడూరులో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలు ఆలయాల్లో అమ్మవార్లను 12వ తేదీ ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. కన్యకా పరమేశ్వరిని చాముండేశ్వరి దేవిగా, గంగమ్మను మహిషాసురమర్ధినిగా, శివాలయంలో అమ్మవారిని మహిషాసురమర్ధినిగా, బజారు కలశంలో అమ్మవారిని విజయలక్ష్మిగా అలంకరించారు. ధర్మరాజులస్వామి ఆలయంలో అమ్మవారికి మహిషాసురవధ అలంకారం చేశారు. నారాయణమ్మ పేరంటాళ్ళ ఆలయంలో, మాలవ్యానగర్ మహాలక్ష్మి ఆలయాల్లో అమ్మ వార్లకు విశేషాలంకారాలు చేసారు. సాయిసత్సంగ నిలయంలో అమ్మవారిని మహిషాసురమర్ధినిగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. ఇందిరానగర్‌లోని నాగరప్పమ్మకు విశేషపూజలు చేశారు. తూర్పుకనుపూరు ముత్యాలమ్మను మహిషాసుర మర్ధినిగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు.

## ఫ్యామిలీ కౌన్సిలింగ్‌లో డిఎస్పీ చౌడేశ్వరి

గూడూరురూరల్ పోలీస్‌స్టేషన్‌లో 12వ తేదీన డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఫ్యామిలీ కేసులకు సంబంధించి బాధితులు, నిందితులకు గూడూరు డిఎస్పీ కె.చౌడేశ్వరి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ కుటుంబంలో వచ్చే చిన్న పాటి మనస్పర్థలతో ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకోవడం తగదన్నారు. కుటుంబాల్లో భార్య భర్తల మధ్య, అత్తా కోడళ్ల మధ్య చిన్నపాటి గొడవలు సాధారణమేనన్నారు. కుటుంబసభ్యులంతా కూర్చొని మాట్లాడుకొని మనస్పర్థలను తొలగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ వేమారెడ్డి, ఎస్సైలు సుధాకరరావు, నాగేశ్వరరావు, కౌన్సిలింగ్ సభ్యులు సారంగం సులక్ష్మి, మంజులమ్మ, బి.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీనగర్‌లో పోలీసుల సోదాలు



గాంధీనగర్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

గూడూరు మండలపరిధిలోని గాంధీనగర్‌లో 13వ తేదీ ఐదుగురు ఎస్సైలు సిబ్బందితో కలసి ఇల్లిల్లా సోదా చేసారు. గాంధీనగర్ శివారు ప్రాంతం కావడం, ఇటీవలే అభివృద్ధి చెందుతుండడంతో ఇతర ప్రాంతాల నుంచి ఎక్కువమంది వచ్చి నివాసముంటున్నారు. కొత్తవారికి ఇళ్లను బాడుగలకు ఇచ్చే సమయంలో తప్పనిసరిగా గుర్తింపుకార్డులను, పూర్తి వివరాలను సేకరించాలని పోలీసులు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులకు ఇల్లు బాడుగకు ఇచ్చే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ తనిఖీలను నిర్వహిస్తున్నామని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు షేక్ షరీఫ్, సుధాకరరావు, దశరథరామారావు, మారుతీకృష్ణ పాల్గొన్నారు.

## పోటుపాళెం జాతీయ రహదారిపై.. టిడిపి రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న టీడీపీ నాయకులు బల్లి, చేవూరి

టీ.డి.పి అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు చేస్తున్న దీక్షను భగ్నం చేసినందుకు నిరసనగా గూడూరు ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్‌రావు అధ్వర్యంలో మండలపరిధిలోని పోటుపాళెం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీమాంధ్ర ప్రాంతం లోని ఎంపీలు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు ప్రజల మనోభావాలను కాంగ్రెస్ అధిష్టానానికి తెలపకుండా మిన్నకుండడం తగదన్నారు. ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చేవూరి విజయ మోహన్‌రెడ్డి, బల్లి కళ్యాణ్, వల్లంపర్తి మధుసూధనరెడ్డి, పారి చర్ల రామ చంద్రయ్య, కాటంరెడ్డి రాధాకృష్ణారెడ్డి, మాజీకౌన్సిలర్లు బిల్లు చెంచురామయ్య, పుచ్చలపల్లి వెంకటేశ్వర్లు, మైనంపాటి మోహన్, రమేష్, మంజులమ్మ తదితరులు పాల్గొన్నారు.



# పోలీసు అమరవీరుల సంస్మరణ దినం

అక్టోబర్ 21

దేశ రక్షణ కోసం ప్రాణాలే అర్పించారు...

శాంతి సౌభాగ్యాల కోసం మీ రక్తాశ్రువులు ధారపోసారు.

మీ త్యాగనిరతికి ఇదే మా నివాళి.





పి.వి.యస్.రామకృష్ణ
సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్
నెల్లూరుజిల్లా.



ఐ.ఆర్.యస్.మూర్తి
అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్
నెల్లూరుజిల్లా.



కె.చౌడేశ్వరి
సబ్‌డివిజనల్ పోలీస్ అధికారి, గూడూరు.

మరియు సిబ్బంది

సబ్ డివిజనల్ పోలీస్ - గూడూరు



# ఆహ్వానము

నెల్లూరు రూరల్, కనుపర్తిపాడు నందు
అంతర్జాతీయ స్థాయిలో నిర్మించబడిన

## VPR కన్వెన్షన్ సెంటర్

పరిచయోత్సవం సందర్భంగా రెండురోజులు జరుగనున్న
సంగీత సాంస్కృతిక కార్యక్రమాలకు
సింహపురి సంగీత సాంస్కృతిక కళాభిమానులందరికీ
నా హృదయపూర్వక ఆహ్వానం.

మీ...
వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

**23-10-2013**
సాయంత్రం 5 గంటలకు
సుప్రసిద్ధ డ్రమ్స్ మాస్టర్
**శ్రీ శివమణి గారిచే**
**సుమధుర సంగీతలహరి**
మరియు
"పాడుతా తీయగా" విజేతలు తేజస్విని, శివ, పరమేశ్వర్, షణ్ముఖప్రియ, సుదీప్ లచే
**సంగీత విభావరి**





**24-10-2013**
సాయంత్రం 5 గంటలకు
నెల్లూరు ముద్దుబిడ్డలు, సంగీత సామ్రాజ్యానికి
తియ్యని వరాలు, కమనీయ స్వరాలు
**పద్మభూషణ్ డా॥ యస్.పి. బాలసుబ్రహ్మణ్యం**
**శ్రీమతి యస్.పి. శైలజ**
**శ్రీ యస్.పి. చరణ్ గార్లచే**
**స్వరనీరాజనం**




సర్వ శుభకార్యాల తోరణం... అధునాతన విశాల ప్రాంగణం! ఎంగేజ్‌మెంట్స్ | వెడ్డింగ్స్ | రిసెప్షన్స్ | బర్త్‌డేస్ | సెమినార్స్ | కాన్ఫరెన్స్ | ఫ్యామిలీ ఫంక్షన్స్ | గెట్-టుగెదర్స్

**ఉచిత పాసుల కొరకు** దిగువ నెంబర్ల నందు సంప్రదించి పొందగలరు.
**94926 87680  99639 12777  94404 25225**

Edited, Published, Printed & owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY.